"విశాలాంధ్ర"
చందా వివరాలు
దినపత్రిక 12 పైసలు, ఆదివారం సంచిక 15 పైసలు

	ఏజంటుద్వారా		పోస్టుద్వారా
సంవత్సరానికి	రు. 44-00	....	రు. 58-00
6 నెలలకు	22-00	....	29-00
3 నెలలకు	11-25	....	14-50
నెలకు	3-75	....	5-00

VISALAANDHRA Phone 5301 ఉదయం ★★ Regd No. H. 201

విశాలాంధ్ర

702917

సంపుటి 19 సంచిక 34] విజయవాడ 22—4—1969 మంగళవారం [6 పేజీలు 12 పై.



విభజనకు తెలంగాణా కాంగ్రెసు కమిటీలో అత్యధికుల వ్యతిరేకత

చట్టబద్ధరక్షణలతో సమైక్యత కాపాడుకోవాలని స్పష్టీకరణ

హైదరాబాద్, ఏప్రిల్ 21

కేంద్ర నాయకులతో, కాంగ్రెస్ అధిష్టాన వర్గంతో, తెలంగాణా సమస్యపై చర్చలు జరిపి, ఒకపరిష్కార మార్గాన్ని కనుగొనటానికి, 28మంది సభ్యులతో కూడిన ఒకకమిటీని గత మూడు రోజులుగా జరుగుతున్న తెలంగాణా ప్రాంతీయ కాంగ్రెస్ కమిటీ ఏర్పాటు చేసింది.

తెలంగాణా ప్రజలకు చట్టబద్ధమైన రక్షణలు కల్పించి రాష్ట్ర సమైక్యతను కాపాడుకోవాలని, చర్చలో పాల్గొన్న అత్యధిక సంఖ్యాకులు అభిప్రాయ పడ్డారు. ప్రత్యేక తెలంగాణా కావాలని కొద్ది మంది మాత్రమే కోరారు.

28 మందితో కూడిన కమిటీలో పనిచేయడానికి, శ్రీ అచ్యుతరెడ్డి, చెన్నారెడ్డిగారలు నిరాకరించారు. వీరుఉభయులు రాష్ట్ర విభజన జరగాలని గట్టిగా వాదించారు.

తెలంగాణా ప్రాంతంలోని కాంగ్రెస్ వాదులపట్ల ఏకాభిప్రాయాన్ని సాధించవలసిన కర్తవ్యాన్ని ఈ కమిటీకి అప్పగించింది.

గత మూడు రోజులుగా జరుగుతున్న ఈ సమావేశంలో వివిధ అభిప్రాయాలు వ్యక్తమయినాయి. సమావేశంలో ఏర్పడ్డ ప్రతిష్టంభనను ఈ కమిటీ పరిష్కరించుతుందని, తెలంగాణా ప్రాంతీయ కమిటీ అధ్యక్షులు శ్రీ జె. చొక్కారావు చెప్పారు.

ఈ కమిటీలో రాష్ట్రకాంగ్రెస్ కార్యవర్గ సభ్యులు (తెలంగాణా ప్రాంతంవారు) కె.వి. నారాయణరెడ్డి మినహా మిగిలిన తెలంగాణా మంత్రులు వుంటారు. వీరుకాక శ్రీయుతులు వెంగళరావు, నూకల రామచంద్రారెడ్డి, తదితరులు కూడా వున్నారు.

డాక్టర్ మర్రి చెన్నారెడ్డి, అచ్యుతరెడ్డి గారిలు [illegible]లో వుండటానికి అంగీకరించలేదని విశ్వసనీయంగా తెలుస్తోంది.

మూడు రోజులుగా జరిగిన ప్రాంతీయ కాంగ్రెసు సమావేశంలో మూడు రకాల అభిప్రాయాలు వ్యక్తం అయినాయి. కొంత మంది రక్షణలు లేకుండానే రాష్ట్రం ఐక్యంగా వుండాలని కోరగా, కొందరు రక్షణలు వుండాలని అన్నారు. కొందరు రాష్ట్ర విభజన జరగాలని అన్నారు.

రాష్ట్ర విభజన జరగాలని, ప్రత్యేక రక్షణలు అక్కరలేదని వాదించిన వారు చాలా తక్కువమంది వున్నారు. తెలంగాణాకు చట్టబద్ధమైన రక్షణలతో, రాష్ట్ర ఐక్యతను కాపాడుకోవాలని అత్యధికులు కోరారు.

వి. బి. రాజు ప్రసంగం

శ్రీ వి. బి. రాజు మాట్లాడుతూ తెలంగాణా సమస్య తెలంగాణాతో ముగిసేదికాదు. ఆంధ్ర ప్రదేశ్ ఐక్యత కాక భారతదేశ ఐక్యతను కోరేవారు ఎవ్వరుకూడా ఏర్పాటు ధోరణులు ప్రోత్సహించవద్దు. ఇప్పుడు తెలంగాణాలో వచ్చినటువంటి విద్యార్థి ఉద్యమం ప్రధానంగా ఆర్థికసమస్య. గత కొన్ని సంవత్సరాలుగా ఉద్యోగఅవకాశాలు లేకపోవటం రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దెబ్బతినటంచే అభివృద్ధిపనులు జరుగక పోవటం, విద్యాలయాలనుంచి బయటకు వస్తున్న యువకులకు ఉద్యోగ అవకాశాలు తగినంతగా కనపడక పోవటంచే వారిలో నిస్పృహ అసంతృప్తి దీనికి కారణం యిది ఎవరో కొందరు వ్యక్తులు రెచ్చగొట్టారని, వెనకాల ఏవో కొన్ని శక్తులు వున్నాయని అనటం సమంజసంకాదు. మనం ఈ రోజు విద్యార్థులకు, యువకులకు, నచ్చచెప్పి ఆందోళనను విరమింపచేసి సమస్య పరిష్కార మార్గం కనుగొనవలసిన అవసరంవున్నది అని అన్నారు.

శ్రీ వి. బి. రాజు ఇంకా మాట్లాడుతూ ప్రభుత్వోద్యోగులు రాజకీయ సమస్యలపై నిర్ణయంచేయుటం సముచితంకాదనీ వారి కోసం రాష్ట్రాలను విభజించడానికి వీలుపడదనీ కనుక నిరంకుశత్వాన్ని ప్రోత్సహించి రెచ్చగొట్టవద్దని సభ్యులకు విజ్ఞప్తి చేశారు.

ఉద్యోగ సంఘాలు ఏ ప్రాంతమువైనా వారి ధర్మము ప్రభుత్వ ఉద్యోగాన్ని నిర్వహించడమేగాని పత్రికా ప్రకటన ద్వారా ఒకరిపై ఒకరు విద్వేషాన్ని రెచ్చగొట్టే విధముగా వుండటము మంచిదికాదని అది ఎక్కడికి దారి తీస్తాయో ఊహించుకోవలసిందిగా విజ్ఞప్తి చేశారు.

శ్రీ రామచంద్రారెడ్డి ప్రసంగం

శ్రీ నూకల రామచంద్రారెడ్డి (మాజీ మంత్రి) మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణా సమస్య ఉద్రేకాలతో పరిష్కారము కాదని కనుక రెచ్చగొట్టే ఉపన్యాసాలు చేయవద్దని శాంతియుతంగా, నలుగురు కూర్చొని చర్చించుకొని నిర్ణయించవలసిన సమస్య అని అన్నారు.

రక్షణలు [illegible] ప్రసారమైనా ఇవి ఏ ఒక్క [illegible] లేక బ్రహ్మానందరెడ్డికో అంటగట్టే పద్ధతి సరికాదని ఈ ముగ్గురి మంత్రివర్గాలలోవున్న మంత్రులందరూ బాధ్యులేనని అందులో తానుకూడా ఒకడినని అందుచేత ఎవరినో ఒకరిని యాగ పశువుగా బలిచేస్తే సమస్య పరిష్కారం కాదని అన్నారు. అయితే ప్రస్తుత మంత్రి వర్గంపై ఎక్కువ బాధ్యత వుండటం వాస్తవం అన్నారు. మనకువున్న ఈ మూడు ధోరణులు ఆంధ్ర ప్రాంతంలోనూ కనపడుతున్నాయని అందుచేత అందరము కలసి కూర్చొని ఆలోచించాలని యింతవరకు జరిగిన అన్యాయాలను సవరించుకుంటూ విశాలాంధ్ర ఐక్యతను ఎలా కాపాడాలో ఆలోచించవలసి వున్నదని అన్నారు.

మిగులు నిధుల విషయం ప్రస్తావిస్తూ మిగులునిధులు [illegible] ఇప్పుడు మనరాష్ట్ర ఆర్థిక పరిస్థితి దృష్ట్యా ఆంధ్రప్రాంతంనుండి నిధులను తరలిస్తే ఆ ప్రాంతంలో కూడా వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి కుంటుపడుతుందని అందుచేత కేంద్ర ప్రభుత్వం అదనంగా రు. 40 కోట్లు యిస్తే వాటితో పోచంపాడు ప్రాజెక్టును పూర్తి చేసుకోవచ్చునని ఆ విధంగా తెలంగాణాను అభివృద్ధి చేసుకోవచ్చునని అన్నారు.

కేంద్ర ప్రభుత్వం న్యాయవేత్త వాంఛూ అధ్యక్షతన నియమించిన న్యాయవేత్తల కమిటీ తెలంగాణా రక్షణల విషయమై పరిశీలిస్తున్నదని ఇంతకు మించిన పెద్ద న్యాయవేత్తల కమిటీలేదనీ కనుక వారి అభిప్రాయానికై వేచి వుండటం మంచిదని అన్నారు.

ఎనిమిది అంశాల పథకం

తెలంగాణా నాయకులను సంతృప్తిపరచగలదని శ్రీ బ్రహ్మానందరెడ్డి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 20

ప్రధాన మంత్రి శ్రీమతి ఇందిరాగాంధి ప్రకటించిన 8 అంశాల పథకం తెలంగాణా నాయకులలోని అధిక సంఖ్యాకులను సంతృప్తి పరచగలదని ముఖ్యమంత్రి శ్రీ బ్రహ్మానందరెడ్డి నేడిక్కడ అన్నారు.

శ్రీ బ్రహ్మానందరెడ్డి పత్రికల వారితో మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణా రాష్ట్రం ఏర్పాటుకు అవకాశంలేదని చెప్పారు.

ప్రస్తుతం జరుగుతున్న ఆందోళన కొద్ది మంది వున్న ముఠాకు పరిమితమైనదని అన్నారు.

అక్కడక్కడ జరిగే సంఘటనలు అధిక సంఖ్యాక ప్రజల అభిప్రాయాలను ప్రతిబింబిస్తున్నాయని భావించకూడదని అన్నారు.

తెలంగాణా ప్రజల న్యాయమైన కోర్కెలను తీర్చగలమని అన్నారు.

టెలిఫోన్ కార్యాలయ కౌంటర్ దహనం

హైదరాబాద్, ఏప్రిల్ 20

హైదరాబాద్‌లోని టెలిఫోన్స్ జిల్లా మానేజర్ కార్యాలయం వద్దవున్న కౌంటర్‌ను ప్రత్యేక తెలంగాణా వాదులు పెట్రోల్ పోసి దహనం చేశారు.

అగ్నిమాపకదళాలు ప్రమాదస్థలానికి వెళ్ళి మంటలు విస్తరించకుండా ఆర్పివేశాయి.

ఒక తలుపు, కొన్ని కుర్చీలు తగులబడిపోయాయని అగ్నిమాపకదళ వర్గాలద్వారా తెలుస్తున్నది.

కె. వి. నారాయణరెడ్డి పరిస్థితి మెరుగుపడల

రాష్ట్ర కార్మిక మంత్రి శ్రీ కె. వి. నారాయణ రెడ్డి ఆరోగ్య పరిస్థితి మెరుగుపడింది.

విశ్రాంతి తీసుకోవలసిందిగా డాక్టర్లు ఆయనకు సలహాయిచ్చారు. రెండు వారాలపాటు ఆయన తన కార్యక్రమాల నన్నింటినీ రద్దు చేసుకొన్నారు.

ఏప్రిల్ 15న తెలంగాణావాదులు కారుపై రాళ్ళు విసరగా ఆయన గాయపడిన విషయం పాఠకులెరిగినదే.

రాజధానిలో పరీక్షల బహిష్కరణ

విద్యార్థి నాయకుని అరెస్టు

హైదరాబాద్, ఏప్రిల్ 21

రాష్ట్ర రాజధానిలో నేడు ప్రారంభమైన పరీక్షలను పెక్కు పాఠశాలలలో విద్యార్థులు బహిష్కరించారు.

కొన్ని పాఠశాలల్లో విద్యార్థుల పూర్వపు అర్హతనుబట్టి ప్రమోట్ చేయాలని నిశ్చయించారు.

నేటి ఉదయం విద్యార్థి నాయకుడు శ్రీ ఎం. శ్రీధర్ రెడ్డిని పోలీసులు అరెస్టు చేశారు.

సర్వే ఉద్యోగుల అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి విమర్శ

హైదరాబాదు జిల్లా మేడ్చల్‌లో పని చేస్తున్న ఆంధ్రప్రాంతానికి చెందిన సర్వే శాఖ ఉద్యోగిని కొట్టడంపట్ల ఆంధ్రప్రదేశ్ సర్వే యన్.జి.వో.ల అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి తీవ్రంగా విమర్శిస్తూ ఒక ప్రకటన చేశారు.

ఏప్రిల్ 15, 16 తేదీలలో జరిగిన "తెలంగాణా పోరాటదినం" సందర్భంగా ఆంధ్ర ప్రాంత ఉద్యోగులపై హింసాయుత చర్యలు జరిగాయనీ కొంతమందిని గాయపరచడం జరిగిందని అన్నారు.

వారి ప్రాణానికి, ఆస్తికి రక్షణ కల్పించే నిమిత్తం తాలూకా స్థాయిలో పని చేస్తున్న సర్వేశాఖ ఉద్యోగులను, సర్వేపార్టీ ఆఫీసులను చెందిన కేంద్ర కార్యాలయాలకు బదిలీ చేయవలసిందిగా ఆయన విజ్ఞప్తి చేశారు.

వరంగల్ లో 94 మంది అరెస్టు

వరంగల్, ఏప్రిల్ 21

వరంగల్, హనుమకొండ ప్రభుత్వ కార్యాలయాల ముందు పికెటింగ్ చేస్తున్న 94 మందిని నేడు పోలీసులు అరెస్టుచేశారు.

ఇందులో 8 మంది బాలికలు కూడా వున్నారు.

గుర్తు తెలియని కొందరు దుండగులు "ఆంధ్ర ప్రభ" వార్తాపత్రికల కట్టలను వరంగల్ స్టేషన్ రోడ్డులోవున్న విద్యుత్ కార్యాలయంముందు తగుల బెట్టినట్లు తెలియవచ్చింది.

పోలీసులపై క్రాకర్ల ప్రయోగం

హైదరాబాద్, ఏప్రిల్ 20

సికింద్రాబాద్‌లోని రాష్ట్రపతిరోడ్ ఆర్. ఎం. ఎస్. పోస్టుఆఫీసువద్ద కాపలావున్న పోలీసు బృందంపై నేటిరాత్రి కొందరు దుండగులు రెండు ప్రేలుడు పదార్థాలు విసరగా ఒక పోలీసు గాయపడ్డారు. వారు విసిరినవి క్రాకర్లు అని విశ్వసించబడుతున్నది.

తపాలా కార్యాలయ భవనానికి నష్టం వాటిల్లలేదు.

139 మంది అరెస్టు

హైదరాబాద్, ఏప్రిల్ 20

కరీంనగర్, వరంగల్, మహబూబ్‌నగర్ జిల్లాలలో నిన్న, మొన్న ప్రివెంటివ్ డిటెన్షన్ చట్టంక్రింద 139 మంది ప్రత్యేక తెలంగాణా ఆందోళనకారులను అరెస్టు చేసినట్లు అధికార వర్గాలు తెలిపాయి.

ప్రభుత్వ కార్యాలయాల ముందు సత్యాగ్రహం జరిపినందుకు, నిషేధాజ్ఞలను ఉల్లంఘించినందుకు ఈ అరెస్టులు జరిగాయి.

ఐదుగురు తెలంగాణా జిల్లా పరిషత్తు అధ్యక్షుల వ్యతిరేకత

—రాష్ట్ర విభజనకు

హైదరాబాద్, ఏప్రిల్ 21

ప్రత్యేక తెలంగాణా ఆ ప్రాంత ప్రయోజనాలకు హానికరమని స్పష్టంచేస్తూ, తెలంగాణా ప్రాంతంలోని అయిదు జిల్లా పరిషత్‌ల అధ్యక్షులు నేడొక సంయుక్త ప్రకటన చేశారు. ఐక్య విశాలాంధ్ర వల్లనే తెలంగాణా ప్రజలకు హెచ్చు మేలు జరుగుతుందని అన్నారు.

వారి ప్రకటన సారాంశం ఈ క్రింది విధంగా వుంది.

తెలంగాణా ప్రాంతానికి చెందిన జిల్లా పరిషత్తు ఛైర్మన్లమైన మేము ఈ నెల 11 వ తేదీన తెలంగాణా సమస్యపై లోక్ సభలో ప్రధాని చేసిన ప్రకటనకు హర్షాన్ని ప్రకటిస్తున్నాం. ప్రధాని ప్రతిపాదనలను త్వరితంగా అమలు పెట్టవలసిన అవసరాన్ని కేంద్ర ప్రభుత్వానికి నొక్కి చెప్పాలని మేము అభిలషిస్తున్నాం. ప్రభుత్వోద్యోగాలలో తెలంగాణా ప్రజలకు రక్షణలు కల్పించేందుకు రాజ్యాంగపరమైన న్యాయసంబంధమైన చర్యలు త్వరగా తీసుకోవాలని ప్రత్యేకంగా కోరుతున్నాం. పెద్దరాష్ట్రంగావుండటమే తెలంగాణా ప్రజలకు లాభసాటిగా వుంటుందనీ అందువల్ల ప్రత్యేక తెలంగాణా డిమాండ్‌ను మేము వ్యతిరేకిస్తున్నాం అని వారు తమ ప్రకటనలో పేర్కొన్నారు.

ఈ ప్రకటనపై శ్రీయుతులు వి. జగపతి రావు (మెదక్‌జిల్లా పరిషత్తు ఛైర్మన్) పి. ధర్మారెడ్డి (వరంగల్‌జిల్లా పరిషత్తు ఛైర్మన్) బి నారాయణరెడ్డి (ఆదిలాబాద్ జిల్లా పరిషత్తు ఛైర్మన్) కె. కె. రెడ్డి (మహబూబ్‌నగర్‌జిల్లా పరిషత్తు ఛైర్మన్) రాజారెడ్డి (నిజామాబాదుజిల్లా పరిషత్తు ఛైర్మన్) సంతకాలు చేశారు.

తెలంగాణాలో మొత్తం 9 జిల్లాలున్నాయి.

రిపబ్లికన్‌పార్టీప్రధాన కార్యదర్శి శ్రీమతి జె. ఈశ్వరీబాయిఒకప్రకటనచేస్తూ కాలాతీతం చేసినందువల్ల తెలంగాణా ప్రజల అసంతృప్తి అగ్నిపర్వతంలాగా బ్రద్దలు కావచ్చునని హెచ్చరించారు.

ప్రధాన మంత్రి హైదరాబాద్ వచ్చి అన్ని పక్షాల వారితో, సమస్యా పరిష్కారానికి రౌండ్ టేబుల్ సమావేశం జరపాలన్నారు.

మహబూబ్‌నగర్ జిల్లాలో కాల్పులు

హైదరాబాదు, ఏప్రిల్ 21

మహబూబ్‌నగర్, జిల్లాలోని గోపాలపేట వద్ద ఒకపోలీసు పార్టీని చుట్టుముట్టి [illegible] డిమాండ్ చేసిన పెద్దగుంపును చెదరగొట్టేందుకు పోలీసులు కాల్పులు జరిపారు.

ఈఘటన గత శనివారం రాత్రిజరిగింది.

గోపాలపేట వద్ద [illegible] గొట్టిన ఒకనాతమరో పెద్ద గుంపువచ్చి పోలీసులను అడ్డగించిందనీ [illegible] చేసినా ప్రయోజనం లేనందువల్ల కాల్పులు జరపవలసి వచ్చిందని తెలియవచ్చింది.

ఈ సందర్భంగా [illegible] అరెస్టు చేయడం జరిగింది.

నాల్గవ ప్రణాళికలో మార్పులవసరం

జాతీయ ప్రణాళిక సమావేశానంతరం శ్రీ నంబూద్రిపాద్ డిమాండ్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 20

జాతీయ అభివృద్ధిమండలి చర్చలను దృష్టిలో పెట్టుకొని నాలుగవ ప్రణాళికను సవరించాలని కేరళ ముఖ్యమంత్రి శ్రీ నంబూద్రిపాద్ అన్నారు.

జాతీయ అభివృద్ధిమండలి సమావేశానంతరం నేడిక్కడ జరిగిన పత్రికా గోష్ఠిలో ప్రసంగిస్తూ రాష్ట్రాల పెట్టుబడులను ఏ విధంగా పెంచవచ్చుననే దృష్టితో ప్రణాళికను యింకా పరిశీలించాలని శ్రీ నంబూద్రిపాద్ అన్నారు. ప్రణాళిక ముసాయిదా ప్రణాళికా సంఘ నివేదిక మాత్రమే కాని, జాతీయ అభివృద్ధి మండలి నివేదిక కాదని అన్నారు.

జాతీయ అభివృద్ధి మండలి సమావేశంలో భిన్నాభిప్రాయాన్ని వ్యక్తంచేసిన ముగ్గురిలో తానుఒకడినని శ్రీనంబూద్రిపాద్ తెలియచేశారు మరోయిద్దరు పశ్చిమ బెంగాల్ బీహారులకు చెందినవారని అన్నారు. ఏ సందర్భంలో కూడా ఓటింగ్ తీసుకోలేదని పేర్కొన్నారు.

వివిధ సమస్యలపై ఎక్కువ రాష్ట్రాలు ప్రణాళికనే విమర్శించాయి. వీటన్నిటిదృష్ట్యా ప్రణాళికా ముసాయిదాను జాతీయ అభివృద్ధి మండలి నివేదికగా కాక ప్రణాళికా సంఘ నివేదికగా పార్లమెంటు ముందు వుంచాలని శ్రీ నంబూద్రిపాద్ అన్నారు.

నాలుగవ ప్రణాళిక ఈ సంవత్సరం ఏప్రిల్‌నుండి ప్రారంభించబడినట్లు భావిస్తారా? అని ప్రశ్నించగా, ప్రారంభించినట్లయితే, 1966 లో చేసినట్లుగానే వుంటుందని అన్నారు అంటే రెండు సంవత్సరాలపాటు ప్రణాళిక లక్ష్యాలను వాయిదా వేయటం. ప్రణాళిక కాలంలో రాష్ట్ర ప్రణాళికలకు రు 1000 కోట్లు కేటాయించాలనే డిమాండ్‌ను గట్టిగా బలపరుస్తూ, కొంతమంది ముఖ్యమంత్రులు సూచించినట్లుగా రు. 500 కోట్ల లోటు ఆర్థిక వ్యవస్థకు తాను అనుకూలుడను కానని కేరళ ముఖ్యమంత్రి నంబూద్రిపాద్ అన్నారు లోటు ఆర్థిక వ్యవస్థను ఉప ప్రధాని శ్రీ మొరార్జీదేశాయి మాదిరిగా తాను వ్యతిరేకిస్తానని ఆయన అన్నారు.

అదనపు కేటాయింపులకు అవసరమయిన మొత్తాన్ని కేంద్రరంగం నుండి రాష్ట్రాలకు బదలాయించాలని అన్నారు.

ఆర్థిక సంవత్సరం మార్పు విషయమై ప్రశ్నించగా, మెజారిటీ ప్రతినిధులు ఆర్థిక సంవత్సరం జూలైనుండి ప్రారంభం కావాలని కోరారు. అయితే ఈ విషయంపై జాతీయ అభివృద్ధి మండలి సమావేశం నిర్ణయం చేయలేదని శ్రీ నంబూద్రిపాద్ అన్నారు.

కరెన్సీ చలామణిలో పెరుగుదల

న్యూఢిల్లీ ఏప్రిల్ 21

మొదటి మూడు పంచవర్ష ప్రణాళికల్లో కరెన్సీ చలామణి వరుసగా 55 శాతం, 36 3 శాతం, 45 4 శాతం పెరిగింది.

ఈ విషయాన్ని నేడు ఆర్థికశాఖ మంత్రి లోక్‌సభలో చెప్పారు.

1966 మార్చి నుండి 1967 మార్చి వరకు 22 3 శాతం కరెన్సీ పెరిగింది.

జాతీయ ఉత్పత్తి పెరుగుటవల్ల కరెన్సీ అవసరం కూడా పెరిగిందని ఆయన అన్నారు.

బ్యాంకు డైరెక్టర్లపై 42 ఫిర్యాదులు

లోక్‌సభలో ఆర్థికశాఖ స్టేట్ మంత్రి వెల్లడి

న్యూఢిల్లీ ఏప్రిల్ 21

22 బ్యాంకులకు చెందిన [illegible] డైరెక్టర్లు, డైరెక్టర్లపై 42 ఫిర్యాదులు వచ్చాయని నేడు లోక్‌సభలో ఆర్థికశాఖ స్టేట్ మంత్రి శ్రీ పి. సి. సేథీ ఒక ప్రశ్నకు లిఖితపూర్వక సమాధాన మిచ్చారు.

ఫిర్యాదులకు సంబంధించిన వివరాలు ప్రజా ప్రయోజనాల దృష్ట్యా వెల్లడించడం సరికాదనీ, ఫిర్యాదుల ఆధారంగా ఎవరినీ డిస్మిస్ చేయటంగాని రాజీనామా యివ్వమని ఆదేశించటంగానీ జరగలేదని ఆయన అన్నారు.

అఖిలపక్ష సమావేశంద్వారా రాజకీయ పరిష్కార సాధన

భారత కమ్యూనిస్టుపార్టీ ప్రధాన కార్యదర్శి శ్రీ రాజేశ్వరరావు స్పష్టీకరణ; రాజకీయ ఖైదీలను విడుదల చేయాలని బ్రహ్మానందరెడ్డి మంత్రివర్గం రాజీనామా చేయాలని డిమాండ్

హైదరాబాద్, ఏప్రిల్ 21

రోజు రోజుకు క్షీణిస్తున్న తెలంగాణా పరిస్థితిని చక్కబరచేందుకు ప్రధాని వెంటనే హైదరాబాదుకువచ్చి అన్ని వర్గాల ప్రజలకు చెందిన ప్రతినిధులు, రాజకీయపార్టీలతో రౌండ్ టేబుల్ సమావేశాన్ని ఏర్పాటు చేయాలని నేడు ఇక్కడ ఏర్పాటు చేసిన పత్రికా సమావేశంలో భారత కమ్యూనిస్టుపార్టీ ప్రధాన కార్యదర్శి శ్రీ చండ్ర రాజేశ్వరరావు విజ్ఞప్తి చేశారు.

రౌండ్ టేబుల్ సమావేశానికి తగిన వాతావరణాన్ని సృష్టించేందుకు వెంటనే ఆందోళన సందర్భంగా అరెస్టు చేయబడ్డ రాజకీయ ఖైదీలను విడుదల చేయాలనీ, బ్రహ్మానందరెడ్డి ప్రభుత్వం రాజీనామా చేయాలని ఆయన స్పష్టీకరించారు.

రౌండ్ టేబుల్ సమావేశంలో తెలంగాణా ప్రజల ప్రయోజనాల అమలు, రాష్ట్ర సమైక్యతా పరిరక్షణకు రాజకీయ పరిష్కార మార్గాన్ని రూపొందించాలని ఆయన వివరించారు.

శ్రీరాజేశ్వరరావుగారి పత్రికా గోష్టి పూర్తి ప్రకటన ఇలావుంది.

తెలంగాణాలో పరిస్థితి రోజు రోజుకు క్షీణిస్తున్నదనీ ప్రత్యేకతెలంగాణాఆందోళనా కారుల దుండగీడుచర్యలు అనగా రైల్వే స్టేషన్లు పోస్టాఫీసులు, బస్సులు తగలబెట్టటం బాంబులు విసరడం పెరిగిపోతున్నదని శ్రీ రావు తమ ఆందోళనను వ్యక్తం చేశారు.

చిన్న వయస్కులకు కఠిన శిక్షలు

ఈ దుండగీడు చర్యలను బలవంతంగా అణచాలని రాష్ట్రప్రభుత్వంచేసిన ప్రయత్నం విఫలమైంది. విచక్షణా రహితంగా చిన్న బాలురను పోలీసులు కొట్టడం, ముగ్గురు నలుగురు చిన్న బాలికలకు కఠిన శిక్షలు విధించడం చాలా విచారకరమైన విషయం అని ఆయన పేర్కొన్నారు.

ఈభయానకపరిస్థితినిబలప్రయోగంద్వారా అణచివేసి అదుపులోకి తేవాలని ప్రయత్నించిన పక్షంలో ఇంకా పరిస్థితి తొందరగా అదుపు తప్పిపోతుందని దీనికి రాజకీయ పరిష్కార మార్గ మొక్కటే ఆచరణ యోగ్యమైనదని ఆయన చెప్పారు. కేంద్రంలోనూ రాష్ట్రంలోనూ అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ దీనికి రాజకీయ పరిష్కార మార్గాన్ని రూపొందించటంలో విఫలమైన పక్షంలో ఈ దుస్థితికి ప్రధాన బాధ్యత కాంగ్రెస్ తప్ప మరెవరూ వహించవలసి వుండదని ఆయన తెలియ జేశారు.

కేంద్రప్రభుత్వనిర్లక్ష్యవైఖరి

ఈ సమస్యపై ప్రధాని, కేంద్రప్రభుత్వం బాధ్యతారహితంగా ప్రవర్తించింది. వారి చర్య రోమ్‌నగరం కాలిపోతుండగా నీరో చక్రవర్తి ఫిడేలు వాయించినట్లు వుంది.

ఇతర రాష్ట్రాలు, ఇతర దేశాలలో కూడా పర్యటించేందుకు ప్రధానికి సమయం చిక్కింది. కాని తెలంగాణా అంతటా మంటలు లేచి రాష్ట్ర విచ్ఛిత్తికి దారితీసే పరిస్థితులు ఏర్పడ్డా గత మూడునెలలనుండి రాష్ట్రాన్ని సందర్శించేందుకు ప్రధానికి సమయం చిక్కకపోవడం సిగ్గుచేటైన విషయమని ఆయన అన్నారు.

చాలాఆలస్యంగా కొద్దిమంది తెలంగాణా కాంగ్రెస్‌వారితో సమావేశమై కేంద్రప్రభుత్వం తరపున ప్రధానిచేసిన ప్రకటన సమస్యను పరిష్కరించలేదు. అసంఖ్యాకంగా ప్రధాని వేసిన కమిటీలు తెలంగాణా ప్రజలలో విశ్వాసాన్ని కలిగించలేవు. ఎందుకనగా ప్రధాని చేసినప్రకటనలో చట్టబద్ధమైనహామీలు లేవు లోగడ 1956 ఒప్పందంలో యిచ్చిన హామీలనుకూడా ఉల్లంఘించడం జరిగింది అని ఆయన వివరించారు.

పరిస్థితి కుదుటపడుటకు మార్గం

ప్రదేశ్ కమ్యూనిస్టు సమితి తీర్మానంలో పేర్కొన్న ప్రకారం తెలంగాణా ప్రజలను సంతృప్తి పరచేందుకు రక్షణల అమలుకు రాజ్యాంగ పరంగానూ, న్యాయరీత్యానూ, పరిపాలనా రీత్యానూ గ్యారంటీ లభించడమే ఏకైక మార్గమని, కేంద్రంలోగానీ రాష్ట్రంలోగానీ ఏ ప్రభుత్వం అధికారంలోవున్నా ఈ గ్యారంటీ వున్నచో రక్షణల అమలు తప్పనిసరిగా చేయవలసి వస్తుందని ఆయన అన్నారు.

ప్రస్తుత ఉద్రిక్తత తగ్గించి ప్రతిష్టంభనను

[మిగతా 2 వ పేజీలో]

భాస్కరరావుపేటలో

శ్రీ చలసానిని బలపరుస్తూ ప్రదర్శన

విజయవాడ, ఏప్రిల్ 21

38 వ వార్డులో కమ్యూనిస్టుపార్టీ అభ్యర్థి శ్రీ చలసాని వెంకటరత్నం అభ్యర్థిత్వాన్ని బలపరుస్తూ నిన్న సాయంత్రం గం॥ 4.30 నుండి 1000 మందితో బ్రహ్మాండమైన ప్రదర్శన జరిగింది. ఇసుక ముఠా, లారీ ముఠా కొట్ల ముఠా కార్మికులు తమ పనులు మానేసి ప్రదర్శనలో చేరారు. దాదాపు 300 మంది స్త్రీలుకూడా ఉత్సాహంగా పాల్గొనటం కామ్రేడ్ చలసానిని గెలిపించాలని ప్రబోధం చేస్తూ క్రమశిక్షణతో ప్రదర్శన వార్డు అన్ని వీధులలోను తిరగటం జరిగింది.

కమ్యూనిస్టుపార్టీ అభ్యర్థిపై పోటీ చేస్తున్న మార్క్సిస్టుపార్టీ అభ్యర్థిని బలపరుస్తూ నిన్న ఉదయం షుమారు 100 మందితో ప్రదర్శనచేయటం జరిగింది ఎన్ని అపసవ్య పద్ధతులకు మార్క్సిస్టులు దిగినా, రెచ్చగొట్టే చర్యలకు తల్పిస్తున్నా, కమ్యూనిస్టుపార్టీ కార్యకర్తలు ఎంతో నిగ్రహంతో, తమ ఎన్నికల ప్రచారం ప్రశాంతంగా చేసుకొంటున్నారు. ఏదిఏమైనా కామ్రేడ్ చలసాని గెలుపు ఖాయమనటంలో ఏమాత్రంసందేహం లేదని జనవాక్యంగా ఆ వార్డులో వుంది.

(వి. వి)

సిగరెట్ హానికరమే అయినప్పటికీ...

న్యూఢిల్లీ, ఏప్రిల్ 21

సిగరెట్లు త్రాగటంవల్ల కాన్సర్ వస్తుందని తెలుపుతున్న పరిశోధనలు ప్రభుత్వం దృష్టికి తీసుకరావటం జరిగిందనీ, అయినప్పటికీ సిగరెట్లు త్రాగటంవల్ల ఆరోగ్యం చెడిపోతుందని అమెరికాలో మాదిరిగా సిగరెట్ పెట్టెలపై దాని చెడు ఫలితాలను రాయాలనే ప్రతిపాదన ఏమీలేదని నేడు లోక్‌సభలో ఆరోగ్యశాఖమంత్రి శ్రీ కె. కె. షా ఒక ప్రశ్నకు సమాధానము యిచ్చారు.

ఆరోగ్యానికి సంబంధించిన విద్యా ప్రచారంలో సిగరెట్లు త్రాగటంవల్ల ఆరోగ్యం చెడిపోతుందని ప్రచారం చేయటం జరిగిందనీ చాలా రాష్ట్రాల్లో సినిమాహాళ్ళలోను ఆడిటోరియంలలోను థియేటర్లలోను పొగ త్రాగటం నిషేధించబడిందని ఆయన చెప్పారు.

కొన్ని రాష్ట్రాల్లో బాలురు పొగ త్రాగటాన్ని నిరోధించేందుకు శాసన [illegible] చర్యలు తీసుకొనేందుకు అవకాశాలున్నాయని ఆయన అన్నారు.

లోక్ సభకు చతుర్థ ప్రణాళిక ముసాయిదా సమర్పణ

ప్రణాళికను తిరిగి రూపొందించాలని శ్రీయస్. యమ్. బెనర్జీ సూచన

న్యూఢిల్లీ, ఏప్రిల్ 21

రు 24,398 కోట్ల నాలుగవప్రణాళిక ముసాయిదాను, పార్లమెంటు పరిశీలనకొరకు, ఆమోదం కొరకు ప్రధానమంత్రి శ్రీమతి ఇందిరాగాంధి నేడు లోకసభలో ప్రవేశపెట్టారు.

జాతీయ అభివృద్ధి మండలి ఆమోదం వుండే విధంగా ప్రణాళికను తిరిగి రూపొందించాలని కమ్యూనిస్టు పార్టీ సభ్యుడు శ్రీ యస్. యం. బెనర్జీ అన్నారు.

సభ ముందు ప్రణాళికను ప్రవేశపెట్టేందుకు అనుమతివ్వవలసిందిగా ప్రధాన మంత్రి స్పీకర్ సంజీవరెడ్డిని కోరటంతోనే, ప్రణాళికను జాతీయ అభివృద్ధి మండలి ఆమోదించిందీ? లేనిదీ? తెలియచేయవలసిందిగా సభ్యులు కోరారు.

ప్రణాళికపై వ్యాఖ్యానిస్తూ జాతీయ అభివృద్ధి మండలి ఆమోదం పొందే విధంగా ప్రణాళికను తిరిగి రూపొందించాలని శ్రీ బెనర్జీ అన్నారు.

ప్రణాళికను కొంతమంది ముఖ్యమంత్రులు ఆమోదించనట్లు పత్రికలలో పడిందని శ్రీ జార్జి ఫెర్నాండెజ్ (ఎస్.ఎస్.పి) అన్నారు. వారి భిన్నాభిప్రాయ ప్రకటనతో ప్రణాళిక వ్యర్థమయినట్లు కాదని శ్రీ ఫెర్నాండెజ్ అన్నారు.

జాతీయ అభివృద్ధి మండలి సమావేశ నిర్ణయాలను సభకు తెలియ జేయవలసిందిగా స్వతంత్ర పార్టీ సభ్యులు శ్రీ పి. కె. దేవ్ కోరారు.

సభకు సమర్పించే ముందు ప్రణాళిక మొత్తం వార్తాపత్రికలలో వచ్చిందని శ్రీ మధులిమాయే, శ్రీ తెన్నేటి విశ్వనాధంలు ఫిర్యాదు చేశారు.

ప్రణాళికపై సభ చర్చించేటప్పుడు ఈ సమస్యలన్నీ లేవనెత్తవచ్చునని స్పీకర్ శ్రీ సంజీవరెడ్డి అన్నారు.

వివిధ కమిటీలు, జాతీయ అభివృద్ధి మండలి కొంతకాలంనుండి ప్రణాళికను చర్చిస్తున్నందువలన వార్తాపత్రికలకు తెలియకుండా వుండటం కష్టమని శ్రీ సంజీవరెడ్డి అన్నారు.

ప్రణాళికపై చర్చ జరగాలని కొంతమంది సభ్యులు కోరగా ప్రభుత్వం అందుకు ఎప్పుడూ సంసిద్ధంగానే వుంటుందని శ్రీమతి ఇందిరాగాంధి అన్నారు.

సారాభాయి కెమికల్స్‌తో కేంద్ర మంత్రి కుమ్మక్కు

లైసెన్సుయిచ్చి 6 ఏండ్లుగడిచినా పబ్లిక్ రంగంలో విటమిన్ 'సి' ఉత్పత్తి చేయని విద్రోహం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 21

పింప్రీలో ప్రభుత్వ యాజమాన్యాన వున్న హిందూస్థాన్ యాంటీబైటిక్స్ లిమిటెడ్ కంపెనీ వద్ద 'సి' విటమిన్ ఉత్పత్తి జాప్యంలో సారాభాయ్ కెమికల్స్‌కంపెనీతో పెట్రోలియం, కెమికల్స్ మాజీ మంత్రి లాలూచీ అయ్యారా? అని లోక్‌సభలో పలువురు సభ్యులు ప్రశ్నించారు.

అయితే ఉపప్రధాని మురార్జీ దేశాయ్ పెట్రోలియం రసాయనాల స్టేట్ మంత్రి డి. ఆర్. చావన్‌లు ఈ విషయాన్ని తిరస్కరించారు.

పింప్రీ లిమిటెడ్ కంపెనీకి సి. విటమిన్ తయారుచేయడానికి అనుమతి యిచ్చారా? అని జార్జి ఫెర్నాండెజ్ అడిగారు

పింప్రీ కంపెనీకివున్న లైసెన్సు ఉపయోగపడకుండాచూడడానికి వీలుగా విటమిన్ 'సి' తయారుచేసేసారాభాయ్‌కెమికల్స్‌వారు మంత్రిని ఉపయోగించుకొన్నారా అని ఫెర్నాండెజ్ ప్రశ్నించారు.

హిందుస్థాన్ యాంటిబైటిక్స్ విటమిన్ సి కర్మాగారాన్ని అధ్యతన కాలిలో ఏర్పాటుచేస్తుందని రెండుమూడు సంవత్సరాలలో యిది ఉత్పత్తిని ప్రారంభిస్తుందని శ్రీ డి. ఆర్. చావన్‌చెప్పారు.

ఈ ఫ్యాక్టరీ 125 టన్నుల ఉత్పత్తిశక్తి కలిగి వుంటుందనీ, 118 లక్షల రూపాయలు వ్యయం అవుతుందని చెప్పారు.

ఆరు సంవత్సరాల క్రింద హిందుస్థాన్ యాంటిబైటిక్స్ కంపెనీకి లైసెన్సుయిచ్చినా యింతవరకు నిర్మించక పోయినందువల్ల సారాభాయ్ కెమికల్స్‌కంపెనీప్రజలను దోచుకుంటున్నదని అన్నారు.

ఇన్నాళ్ళుగా ప్రభుత్వం ఎందుకు నిమ్మకు నీరెత్తినట్లుగా వున్నదని రావీరే అడిగారు.

ప్రభుత్వం యెలాంటి వత్తిడికి లొంగడం లేదనీ విటమిన్'సి'కర్మాగారం ఏర్పాటుచేయబడుతుందని మంత్రిఅన్నారు.

ఇది చాలా పొరపాటు. ప్రభుత్వం దగా చేస్తున్నది. ఈ గుత్తవ్యాపారాన్ని సహించగూడదని"మంత్రి సమాధానం విని సంతృప్తి పడని ప్రతిపక్ష సభ్యులు గగ్గోలు చేశారు.

ప్రతిపక్ష సభ్యుల విమర్శను తట్టుకోలేక కాంగ్రెస్ సభ్యులు హరినారాయణ, రణధీర్ సింగ్‌లు లేచి మాట్లాడుతూ నిందారోపణలు చేయగూడదనీ ఆరోపణలను రుజువు చేయాలని అన్నారు.

ఇది సిగ్గు యేమాత్రం లేని ప్రభుత్వం. నేను రుజువు చేయగలను. ఈ విషయాన్ని ఎందుకు పబ్లిక్ అక్కౌంట్స్ కమిటీకి నివేదించరు? ఇందులో యేదో కుంభకోణం జరిగింది అని ఫెర్నాండెజ్ అన్నారు.

ఫెర్నాండెజ్ వ్యాఖ్యలకు రణధీర్‌సింగ్ అభ్యంతరం చెబుతూ ప్రతిపక్షాల నుద్దేశించి కేకలు వేయడంతో స్పీకర్ సంజీవరెడ్డి వెంటనే జోక్యంచేసుకొని సభ్యులుశాంతించ వలసినదిగా అడిగారు. సభ్యుడు ఏ విధంగానూ ప్రభుత్వానికి సహాయం చేయడం లేదుసుమా అని మందలించారు.

ఆరోపణలు నిజంకాదని మంత్రి తిరిగి చెప్పారు.

రణధీర్‌సింగ్ : తప్పనివిధంగా నోరు మూయించలేరు.

తిరిగి స్పీకర్ హెచ్చరించడంతో రణధీర్ శాంతించారు.

ఈయన సవాలు పరిశీలించడానికి ప్రభుత్వం విచారణసంఘాన్ని గానీ, లేక పార్లమెంటరీ కమిటీనిగానీ నియమిస్తుందా? యస్. యం. బెనర్జీ అడిగారు.

చతుర్థ ప్రణాళిక ముసాయిదాలోని ముఖ్యాంశాలు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 19

జీవనస్థాయిని త్వరితంగా పెంచటం, సామాజిక న్యాయాన్ని కలుగచేయటం మొదలయిన లక్ష్యాలతో తయారుచేసిన 350 పేజీల నాలుగవ ప్రణాళికను నేడిక్కడ ప్రారంభమయిన జాతీయ అభివృద్ధిమండలి సమావేశం పరిశీలనకు తీసుకున్నది.

స్థిరత్వాన్ని, స్వయం సమృద్ధిని సాధించేందుకు వీలుగా అభివృద్ధి కార్యక్రమాలను ఎక్కువచేసే విధంగా ప్రణాళికను రూపొందించారు. ప్రస్తుతం వున్న సాధన సంపత్తి, వనరులవలన సమకూడే సాధన సంపత్తిని వినియోగించుకొనేందుకు ప్రణాళిక అవకాశాలను కలిగిస్తుంది.

నాలుగవ ప్రణాళిక విధానాలను, కార్యక్రమాలను కేంద్ర మంత్రివర్గం సాంఘిక లక్ష్యాలను చేరుకునే విధంగా రూపొందించబడింది. విశాల లక్ష్యాలను సాధించేందుకు ప్రణాళిక ఈ క్రింది విధంగా వుండాలని నిర్ణయించారు.

1. ఆదాయం, సంపదలో ఎక్కువ సమానత్వం వుండేవిధంగా ప్రణాళిక వుండాలి.
2. ఆదాయం, సంపద, ఆర్థికశక్తుల కేంద్రీకరణ గణనీయంగా తగ్గుతూ వుండాలి.
3. సంఘంలో తక్కువ సౌకర్యాలువున్న ప్రజలకు అభివృద్ధివలన కలిగే లాభాలు ఎక్కువగా వుండాలి

సామాజిక న్యాయాన్ని కలుగచేసేందుకు, త్వరితంగా ఆర్థికాభివృద్ధిని సాధించేందుకు ఆర్థికసమాజిక సంస్థలను పునర్వ్యవస్థీకరించాలని ప్రణాళికలో పేర్కొనటం జరిగింది. సామాజికలక్ష్యాలు చేరుకోవటం అభివృద్ధి కార్యక్రమాలను రూపొందించింది. సమాజిక-ఆర్థికసంస్థలను ఏర్పాటుచేసి వాటి నిర్వహణపై ఆధారపడి వుంటుంది.

మొత్తం ప్రభుత్వరంగ పెట్టుబడులలో రు. 7207 కోట్లు కేంద్ర పథకాలకు, రు. 787 కోట్లు కేంద్రం నిర్వహించే పథకాలకు కేటాయించటం జరిగింది. రు. 666 కోట్లు రాష్ట్రాలకు, రు.398 కోట్లు కేంద్ర పాలిత ప్రాంతాలకు యివ్వటం జరుగుతుంది,

రాష్ట్రాలకు. కేంద్ర సహాయం విధానం, పద్ధతి మార్పుచేయటం జరిగింది. అస్సాం, నాగాలాండ్, జమ్ము, కాశ్మీర్‌ల అవసరాలకు కేటాయించిన తరువాత మిగతా రాష్ట్రాలకు కేంద్రసహాయంలో 60 శాతం జనాభా ప్రాతిపదికపైన. 10 శాతం తలసరి ఆదాయంపైన మరొక 10 శాతం ఇరిగేషన్, విద్యుచ్ఛక్తి పథకాలకు అంతకు ముందు యిచ్చిన హామీలపై ఆధారపడివుంటుంది

వరదలు. కరువు, గిరిజనప్రాంతాలు మొదలయిన ప్రత్యేక సమస్యలను పరిష్కరించేందుకు మిగతా 10 శాతం సహాయాన్ని యివ్వటం జరుగుతుంది.

ప్రణాళికా అవసరమయిన వనరులు ఈ క్రింది విధంగా వుంటాయి. పబ్లిక్, ప్రభుత్వ రంగాల పెట్టుబడులు బడ్జెటు వనరులు, జీవితభీమా మినహా, ప్రభుత్వ సంస్థల మార్కెట్ అప్పులు 1968-69 సంవత్సర రెవిన్యూ బ్యాలన్సు(కోట్లరూపాయలలో)

పన్నులు	2455
రైల్వేలు	265
యితరములు	1465
రిజర్వుబ్యాంక్ నిలుపుకున్న లాభాలు	165
కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలచే మార్కెటు అప్పులు (నికరం)	1186
చిన్నతరహా పొదుపులు	800
యాన్యూటి డిపాజిట్లు. నిర్బంధ పిడి డిపాజిట్లు ప్రైజ్‌బాండ్లు బంగారం బాండ్లు	(—) 104
రాష్ట్రాల ప్రావిడెంటుఫండ్లు	640
పెట్టుబడుల ఆదాయం (నికరం)	1130
యల్. ఐ. సి. యింకా ప్రభుత్వ సంస్థల నుండి మార్కెటు అప్పులు	343
హౌసింగ్, వాటర్ సప్లయిలకు రాష్ట్ర ప్రభుత్వాలకు యల్.ఐ.సి రుణాలు	96
ప్రభుత్వ పరిశ్రమల మార్కెటు అప్పులు	137
ప్రభుత్వ పరిశ్రమలకు యల్. ఐ. సి. రుణాలు	116
విదేశీ సహాయానికి సంబంధించి బడ్జెటు ఆదాయం	25144
పి. యల్. 480 లేక యితరం నుండి	2130
పి. యల్. 480 క్రింద సహాయం	389
మొత్తం బడ్జెటువనరులు	10,839
అదనపు వనరుల సేకరణ	270
లోటు ఆర్థిక వ్యవస్థ	850
మొత్తం వనరులు	14398
రాష్ట్ర ప్రణాళిక సహాయం	—
ప్రణాళిక పెట్టుబడులకు నికర వనరులు	14398

రాష్ట్ర ప్రణాళిక పెట్టుబడుల అంచనాలు

(కోట్ల రూపాయలలో)

ఆంధ్రప్రదేశ్	380.5
అస్సాం	225.5
బీహార్	491.6
గుజరాత్	450.2
హర్యానా	190.5
జమ్మూ, కాశ్మీర్	145.0
కేరళ	258.4
మధ్యప్రదేశ్	156.0
మహారాష్ట్ర	801.8
మైసూరు	327.1
నాగాలాండ్	35.0
ఒరిస్సా	180.5
పంజాబ్	271.4
రాజస్థాన్	239.0
తమిళనాడు	502.0
ఉత్తరప్రదేశ్	951.0
పశ్చిమబెంగాల్	320.5
మొత్తం	6066.0

నీటి సరఫరా కేటాయింపులు

నాలుగవ ప్రణాళికలో నీటి సరఫరా, పారిశుధ్యంకు మొత్తం రు. 339 కోట్లను కేటాయించారు, మంచినీటి ఎద్దడి గల గ్రామీణ ప్రాంతాలలో నీటి సరఫరాకు రు. 100 కోట్లను కేటాయించారు.

ఈ కేటాయింపులు అవసరాలను కొద్దిగా మాత్రమే తీర్చగలవని భావిస్తున్నారు.

యిరిగేషన్ పథకాలు

రు. 1190 కోట్ల వ్యయంతో నాలుగవ ప్రణాళికాకాలంలో 117 లక్షల హెక్టార్ల భూమిని ఇరిగేషన్ పథకాల క్రిందకు తీసుకుని వస్తారు.

మేజర్, మైనర్ ఇరిగేషన్ పథకాలకు కేటాయించిన రు 857 కోట్లలో, ప్రస్తుతం అమలులో పథకాలకు రు 717.4 కోట్లు. కొత్త పథకాలకు 97.4 కోట్లను వినియోగిస్తారు.

రాష్ట్రాలలో రీసెర్చి, పరిశీలన కొనసాగించేందుకు రు. 15.5 కోట్లను కేటాయించారు. మధ్యతరహా ఇరిగేషన్ పథకాలన్నింటిని నాలుగవ ప్రణాళిక కాలంలో పూర్తిచేయాలని నిర్ణయించటం జరిగింది, ఇరిగేషన్ పథకం ద్వారా గరిష్ట ఉత్పత్తిని సాధించేందుకు వీలుగా గ్రామీణ విద్యుద్దీకరణకు రు. 363 కోట్లను కేటాయించటం జరిగింది. ఇందులో రాష్ట్రాలకు రు. 313 కోట్లు లభిస్తాయి,

గ్రామీణ విద్యుదీకరణ కార్పొరేషన్

నాలుగవ ప్రణాళిక కాలంలో రు. 45 కోట్లతో ప్రభుత్వ రంగంలో గ్రామీణ విద్యుద్దీకరణ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేశారు.

రాష్ట్ర ఎలక్ట్రిసిటీబోర్డులకు, ఇంజినీరింగు పంపుసెట్లకు, కార్పొరేషన్ రుణాలను అందచేస్తుంది. ప్రణాళిక కాలంలో వివిధ రాష్ట్రాలలో అదనంగా 5 లక్షల పంప్‌సెట్లను కొనుగోలు చేసేందుకు రుణాలను యివ్వటం జరుగుతుంది.

విద్యుచ్ఛక్తి కేటాయింపులు

నాలుగవ ప్రణాళిక విద్యుచ్ఛక్తి సౌకర్యాల కొరకు రు 2085 కోట్లను కేటాయించారు.

ప్రాంతీయ విద్యుచ్ఛక్తి పథకాలను ఒకదానితోఒకటికలిపేందుకు 14 కోట్లను కేటాయించారు, రాష్ట్రాలలో విద్యుత్ ఉత్పాదనకు సంపిణీ కార్యక్రమాలకు రు. 587 కోట్లను వినియోగిస్తారు.

వెనుకబడిన తరగతుల సంక్షేమం

వెనుకబడిన తరగతుల సంక్షేమానికి, అభివృద్ధికి నాలుగవ ప్రణాళికలో రు. 134.37 కోట్లను కేటాయించారు.

గత 18 సంవత్సరాల ప్రణాళిక కాలంలో వెనుకబడిన తరగతుల సంక్షేమానికి సంబంధించి ప్రత్యేక కార్యక్రమాలలో రు. 2770 కోట్లను వ్యయపరిచారు.

కార్మిక సంక్షేమం

కార్మిక సంక్షేమకార్యక్రమాలకు నాలుగవ ప్రణాళికలో రు. 37.11 కోట్లను కేటాయించారు. ఇందులో రు. 9.20 కోట్లు కేంద్ర ప్రణాళికకు, 25.12 కోట్లు రాష్ట్ర ప్రణాళికలకు, రు. 2.79 కోట్లు కేంద్రపాలిత ప్రాంత ప్రణాళికలకు కేటాయించారు.

అభివృద్ధి కార్యక్రమాలలో ఉద్యోగవసతి కల్పించటం మొదలయిన కార్యక్రమాలను పేర్కొనటం జరిగింది.

కమ్యూనికేషన్లకు రు. 520 కోట్లు

కమ్యూనికేషన్ల అభివృద్ధికి నాలుగవ ప్రణాళికలో రు. 520 కోట్లను కేటాయించారు.

ఇందులో టెలి కమ్యూనికేషన్లకు రు 406.25 కోట్లు పోస్టల్ సర్వీసులకు, రు. 26 కోట్లు, ఓవర్ సీస్ కమ్యూనికేషన్లకు 12.04 కోట్లు. వైర్‌లెస్‌కు రు 1 కోటి హిందుస్థాన్ టెలిప్రింటర్లకు 1.75 కోట్లు. టెలిఫోన్ పరిశ్రమకు రు. 12.06 కోట్లు వినియోగిస్తారు,

నాలుగవ ప్రణాళిక కాలంలో 31,000 నూతన పోస్టాఫీసులను ఏర్పాటుచేశారు.

దూరప్రాంతాలకు ట్రాన్స్‌మిషన్ చేసే పరికరాలను తయారుచేసే ఫ్యాక్టరీ స్థాపించటం టెలిఫోన్ ఫ్యాక్టరీ విస్తృతం చేయుటం నాలుగవ ప్రణాళికలో జరుగుతాయి.

నాలుగవ ప్రణాళికాంతానికి హిందుస్థాన్ టెలిప్రింటర్స్ కంపెనీ సంవత్సరానికి 8500 టెలిప్రింటర్లను ఉత్పత్తి చేయగలదని భావిస్తున్నారు.

పూనావద్దగల ఆర్వేలోనిర్మిస్తున్న భూ ఉపగ్రహంతోపాటు, ఢిల్లీవద్ద మరొక భూ ఉపగ్రహ కేంద్రాన్ని ఓవర్‌సీస్ కమ్యూనికేషన్ల కొరకు ఏర్పాటు చేస్తారు.

విద్య కేటాయింపులు

రు. 550 కోట్ల ప్రణాళికేతర వ్యయం కాక నాలుగవ ప్రణాళికలో విద్యకు రు 802 కోట్లను కేటాయించారు,

మొత్తంవిద్య ప్రణాళికా పెట్టుబడిలో రాష్ట్రరంగాలకు రు. 543 కోట్లు (68 శాతం) రు, 28 కోట్లు కేంద్రఅనుబంధ రంగాలకు, రు. 231 కోట్లు కేంద్రరంగానికి కేటాయించారు,

నాల్గవ ప్రణాళికలో వ్యవసాయ ఉత్పత్తి లక్ష్యాలు

సరుకు	యూనిట్	అధికోత్పత్తి లక్ష్యం	ఉత్పత్తి అంచనా	పెరుగుదల శాతం
		69.74	78.74	
ఆహార పదార్థాలు	మిలియన్ టన్నులు	31.00	129.00	31.6
నూనె గింజలు	.. ..	2.00	10.50	24
చెరకు (బెల్లం)	.. ..	3.00	15.00	25
పత్తి	.. బేళ్లు	2.00	8.00	33
జనపనార	.. ..	1.20	7.40	13
పొగాకు	.. కిలోలు	100	480	26
కొబ్బరి	.. కాయలు	1000	6600	'8
పోకచెక్క	వేల టన్నులు	24	150	17
జీడిపప్పు	.. ..	76	236	79
మిరియం	.. ..	19	42	88
లక్క	.. ..	17	52	48

అల్యూమినియంలో స్వయం సమృద్ధి

త్వరలో సాధించగలమని లోక్‌సభలో మంత్రి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 21

చతుర్థ ప్రణాళిక చివరకు అల్యూమినియం విషయంలో భారతదేశం స్వయం సమృద్ధి సాధిస్తుందని పెట్రోలియం రసాయనాల స్టేట్ మంత్రి శ్రీ జగన్నాథరావు నేడు లోక్‌సభలో చెప్పారు.

సీతమ్ కేసరీ ప్రశ్నకుఆయన సమాధానం చెబుతూ చతుర్థ ప్రణాళికలో రెండు కర్మాగారాలు ప్రభుత్వరంగంలో నిర్మించ తున్నారనీ, చతుర్థ ప్రణాళిక చివరకు దిగుమతులు అనుమతించ బడవని అన్నారు.

ఆల్వేలో వున్న జింక్ కర్మాగారం విస్తృతం చేయడానికి అంగీకరించామనీ పి. గోపాలన్‌కు మంత్రి చెప్పారు.

1971 నాటికి కోయ్నాలో అల్యూమినియం ఫాక్టరీ నిర్మింపబడుతుందని అన్నారు.

జింక్ దిగుమతి

ఉదయపూర్ ఆల్వే కర్మాగారాలు 1973-74 నాటికి నిర్మింపబడిన తరువాత గూడా భారీయెత్తున జింక్ దిగుమతి చేసుకోవలసివుంటుందని జగన్నాథరావు చెప్పారు.

శ్రీ జగన్నాథరావు, వేద్రవత బారువా ప్రశ్నకు సమాధానం చెబుతూ 1973-74కు 1,40 000 టన్నులు కావలసి వస్తుందని అన్నారు. ఉదయపూర్ ఆల్వే కర్మాగారాలను విస్తృతంచేసినా వాటి ఉత్పత్తి వరుసగా 30000, 40000 టన్నులు వుంటుందని అన్నారు.

ఉదయపూర్‌లోని హిందూస్థాన్ జింక్ లిమిటెడ్ ఉత్పత్తిచేసే జింక్, దిగుమతి చేసుకొన్నదానికి మాదిరిగానే వుంటున్నదనీ, జింక్ దిగుమతిపై పరిమితి ఆంక్షలున్న కారణంగా మార్కెట్లు బాగా అమ్ముడు పోతున్నాయని అన్నారు.

ఖేత్రిరాగి ప్రాజెక్టు

1971 నాటికి ఖేత్రిరాగి కర్మాగారం పూర్తిఅవుతుందని అన్నారు. ఈ విషయంలో కొద్దిగా జాప్యంజరుగుతున్న విషయం నిజమేనని అన్నారు.

నేపాల్‌లో ఇద్దరు అమెరికా శాంతిదళ వాలంటీర్ల అరెస్టు

ఖాట్మండు, ఏప్రిల్ 21

అమెరికా శాంతిదళ సభ్యులను యిరువురిని గతవారం జుమ్లాలో నేపాల్ పోలీసులు అరెస్టుచేసినట్లు నేపాల్‌లో వెలువడేదినపత్రిక తెలియజేసింది.

నేపాల్ ఉత్తర సరిహద్దులలోని నిషిద్ధ ప్రాంతంలో ప్రవేశించారన్న నేరంపై వారిని బంధించినట్లు ఆ పత్రిక పేర్కొన్నది.

బంధింపబడినవారి పేర్లు తెలియజేయుటకు నేపాల్ అధికారులు నిరాకరించారని, వారిని నేపాల్ రాజధానికి తీసుకువెళ్ళినట్లు ఆ పత్రిక తెలియచేసింది.

కమ్యూనిస్టుపార్టీ చీలిక వార్తలపై శ్రీ మీనన్ ఖండన

తిరువనంతపురం, ఏప్రిల్ 20

జెకోస్లోవేకియా సమస్యపై భారత కమ్యూనిస్టుపార్టీలో చీలిక ఉన్నదనే వార్తను కమ్యూనిస్టుపార్టీ కేంద్ర కార్యవర్గ సభ్యుడు శ్రీ సి. అచ్యుతమీనన్ త్రోసిపుచ్చారు.

జెకోస్లోవేకియా సమస్యపై పార్టీలో భిన్నాభిప్రాయాలు వున్నమాట వాస్తవం. అయితే భేదాభిప్రాయాలు పార్టీలో చీలికకు దారితీయలేదని శ్రీ మీనన్ నేడిక్కడ పత్రికావిలేకరులతో మాట్లాడుతూ అన్నారు.

జెకొస్లోవేకియా సమస్యపై పశ్చిమబెంగాల్ కమ్యూనిస్టుపార్టీ నాయకుడు శ్రీ సోమనాథ్ లాహిరి రాజీనామా చేసినట్లు వచ్చిన వార్తలను శ్రీ మీనన్ త్రోసిపుచ్చారు. తనను జాతీయ సమితి బాధ్యతలనుండి తొలగించవలసిందిగా శ్రీ లాహిరి ఒక సంవత్సరం క్రితం కోరాడని శ్రీ మీనన్ తెలియజేశారు. అయితే అప్పుడు సమితి నిర్ణయం చేయలేదు. ఈసారి తిరిగి శ్రీ లాహిరి తన బాధ్యతలనుండి తొలగించవలసిందిగా చేసిన అభ్యర్థనను జాతీయ సమితి ఆమోదించింది. అని శ్రీ మీనన్ తెలియచేశారు.

50 శాతం పిల్లలకు పౌష్టికాహారం కొరత

న్యూఢిల్లీ, ఏప్రిల్ 21

దేశంలోని దాదాపు 50 శాతం పిల్లలు పౌష్టికాహారం లోపంవల్ల క్షీణిస్తున్నారని నేడు లోక్‌సభలో ఆరోగ్యశాఖ స్టేట్‌మంత్రి డాక్టర్ ఎస్. చంద్రశేఖర్ రాతపూర్వక సమాధానం యిచ్చారు.

ఆంధ్రజాతి సమైక్యత అవసరం

శ్రీ వాసుదేవరావు ప్రసంగం

హైదరాబాద్, ఏప్రిల్ 20

గత నవంబర్‌నుంచి ప్రాంతీయ సంఘం వ్యవహారాలు పెడదారిని పట్టాయని రాజకీయంగా నాయకత్వానికి, వ్యక్తులకు మధ్య సంఘర్షణలు దోహదంచేసే విధంగా రూపొందించబడ్డాయిగాని, సమస్యా పరిష్కారానికి దారితీయలేదని శ్రీ అక్కిరాజు వాసుదేవరావు యివాళ గాంధీభవన్‌లో జరిగిన ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్‌లోని తెలంగాణా సభ్యులసమావేశంలో మాట్లాడుతూ చెప్పారు

తెలంగాణా సమస్యనుగురించి ప్రాంతీయ సంఘం అధ్యక్షులుగాని, శాసనసభ్యులు గాని వెళ్ళి మనవి చేసినప్పుడు ముఖ్యమంత్రి శ్రీ బ్రహ్మానందరెడ్డిగాని, తెలంగాణా మంత్రులుగాని, ఉదాసీనభావాన్ని గాని, నిర్లక్ష్య భావాన్నిగాని వ్యక్తీకరించలేదని గుర్తుంచుకోవాలని కోరారు.

తెలంగాణాకు ఏమి జరగాలి, ఏమి జరుగలేదు అని తేల్చివేసుకుని ఏమేరకు ఉన్నదో చూసుకోవాలని, ఉన్న పరిస్థితిని తగ్గించి చెప్పడంగాని, అతిశయోక్తులు చెప్పడం వల్లగాని ప్రయోజనంలేదని అందరూ గ్రహించాలని శ్రీ వాసుదేవరావు చెప్పారు.

పెద్దలు శ్రీ అచ్యుతరెడ్డి, శ్రీ హయగ్రీవాచారి ప్రాంతీయ సంఘాధ్యక్షులుగా,ప్రాంతీయ సంఘంవ్యవహారాలుచూస్తూవచ్చారనివీరంతా శ్రద్ధ వహించిన వారేనని, శ్రీ చొక్కారావు అధ్యక్షులుగా వచ్చాక యింకా కొంత శ్రద్ధ వహించటంప్రశంసనీయమని. జరిగినలోపాలు వుంటే శాసనసభ్యులు, మంత్రులు అందరూ బాధ్యత వహించాలిగాని ఎవరిమీదో త్రోసివేయడం సరికాదన్నారు.

జనవరి 19 ఒప్పందం తర్వాత జరిగిన సంఘటనలు కొన్ని మనకు గర్వకారణం కాదని, అసలు వాటిని అమలు చేయడానికే వీలు చెయ్యకుండాచేస్తే ఎట్లాగని అడిగారు.

ఆంధ్రప్రదేశ్ సమైక్యత వర్ధిల్లాలని, తెలుగుజాతి ఏకోన్ముఖంగా సర్వతోముఖాభ్యుదయాన్ని పొందాలని, కోస్తా, రాయలసీమ, తెలంగాణా అనే భేదభావాలులేక తెలుగుజాతి కలిసికట్టుగా వ్యవహరించాలని తాము విశ్వసించి ప్రజలు విశ్వసించాలని కోరేవారము తామని శ్రీ వాసుదేవరావు అన్నారు.

ఒక విద్వేష పూరితమైన వాతావరణాన్ని కల్పించి ప్రత్యేక తెలంగాణా అనే వూహాజనితమైన హర్మ్యాన్ని నిర్మించుకుని, వ్యవహరించే నాయకులు విత్తు ఏది వేస్తే పండు అదే వస్తుందని, ఆ ఫలాన్ని అనుభవించక తప్పదని గ్రహించాలని హెచ్చరించారు.

దౌర్జన్యం జరిగితే పిల్లలు,పెద్దలు ఎవ్వరుగాని హింసను నిర్జించవలసిందేనని, అది పోలీసు హింసకానివ్వండి, మరొకరి హింస కానివ్వండి అని అన్నారు. తెలంగాణా రాష్ట్రం కావాలని చెప్పడం. ఈ ఉద్యమం ప్రారంభించి నప్పుడు పిల్లలతో బాధలు, పోలీసులతో బాధలు, నాయకులతో బాధలు, ఏదోవిధంగా అంతా పడ్డవారేగాని, ఈ దౌర్జన్యాన్ని ఖండించకుండా, ద్వేషపులంగా కూర్చుంటే మోక్షం లేదని గ్రహించాలని శ్రీ వాసుదేవరావు హెచ్చరించారు.

కాంగ్రెస్ నాయకులంతా అరాచకాన్ని, అల్లర్లను ఖండించకుండామూకీభావంవహించి కూర్చుంటే, పెద్దఎత్తున అన్యాయం చేసినవాళ్ళం అవు[illegible]తెలుసుకోవాలన్నారు. కాంగ్రెసు వాదులు ఏకమై. దౌర్జన్యాన్ని ఖండిస్తూ తెలుగుజాతి ఐక్యజాతిగా వర్ధిల్లేందుకు, యిది వీర తెలంగాణా అని చెప్పుకొనేందుకు తగిన ప్రయత్నాలు చేసుకోవాలని హర్షధ్వానాలమధ్య తెలియచేశారు.

భారత్‌కు మరొక నౌక

పూల(యుగోస్లోవియా) ఏప్రిల్ 20

భారతదేశం కొరకు యుగోస్లోవియా షిప్‌యార్డులో నిర్మించిన 85 000 టన్నుల నౌకకు బెల్‌గ్రేడ్‌లోని భారత రాయబారి సతీమణి ప్రారంభోత్సవం చేసింది.

భారతదేశ రాయబారి సతీమణి శ్రీమతి రామిగండెశాల్. నౌకకు "[illegible]" అనే పేరును పెట్టారు.

బీహార్ యూనివర్శిటీ ఉపాధ్యాయ సమ్మె

పరిష్కారానికి శ్రీ మధులిమాయే విజ్ఞప్తి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 21

బీహార్ విశ్వ విద్యాలయ ఉపాధ్యాయుల సమ్మె విరమణకు తగిన చర్యలు తీసుకోవలసిందిగా యస్. యస్. పి నాయకుడు శ్రీ మధులిమాయే ప్రభుత్వాన్ని నేడు కోరారు

ఆయన నేడొక ప్రకటనచేస్తూ ఉన్నత విద్యా విషయంలో విద్యాశాఖ మంత్రి తన బాధ్యతలను మరువరానన్నారు.

విద్యాశాఖమంత్రి యూనివర్సిటీ గ్రాంట్ల కమీషన్ అధ్యక్షుడు ఈ విషయంలో కలుగజేసుకొని ఉపాధ్యాయుల కష్టాలను తొలగించుటకు తగిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

భద్రాచలం డివిజన్‌లో నక్సల్‌బరీ వాదుల దాడి?

హైదరాబాద్, ఏప్రిల్ 20

భద్రాచలం డివిజన్ బూర్గం పహాడ్ తాలూకాలోని 5 గ్రామాలపై నక్సల్‌బరీ వాదులని అనుమానిస్తున్న 25 మంది దాడి జరిపినట్లుగా యిక్కడకు అందిన అధికార వార్తలు తెలుపుతున్నాయి

ఈ దాడిలో వారు గ్రామస్థుల నుండి ఆయుధాలను, బంగారం, వెండి వస్తువులను తీసుకుపోయినట్లుగా తెలుస్తుంది

ఇక్కడకు అందిన మరొక సమాచారం ప్రకారం శ్రీకాకుళంజిల్లాలోని మక్కెనపల్లి గ్రామంలో నక్సల్‌బరీవాదులు అని అనుమానిస్తున్న కొంతమంది యిద్దరు వ్యక్తులను కాల్చివేశారు.

యూనివర్శిటీ వ్యవహారాల్లో విద్యార్థులకు స్థానం

వైస్ ఛాన్సలర్ల సమావేశంలో విద్యా మంత్రి శ్రీ వి. కె. ఆర్. వి. రావు సూచన

న్యూఢిల్లీ, ఏప్రిల్ 21

యూనివర్శిటీ అకాడమీ వ్యవహారాలలో విద్యార్థులు పాల్గొనే విషయమై త్వరగా నిర్ణయం తీసుకోవలసిన అవసరం వున్నదని కేంద్ర విద్య, యువజన శాఖా మంత్రి శ్రీ వి. కె. ఆర్. వి. రావు అన్నారు.

విద్యాశాఖ, యూనివర్శిటీ గ్రాంట్స్ కమిషన్‌లు సంయుక్తంగా ఏర్పాటు చేసిన మూడు రోజుల వైస్-ఛాన్సలర్ల సమావేశాన్ని ప్రారంభిస్తూ ఈ విషయమై యూనివర్శిటీలో నిర్ణయం తీసుకోవలసిన సమయం ఆసన్నమయిందని శ్రీ రావు అన్నారు. నిపుణులతోను, విద్యార్థి ప్రతినిధులతోను సంప్రతించి ఈ నిర్ణయం తీసుకోవాలని అన్నారు.

విద్యార్థులు యూనివర్సిటీ వ్యవహారాలలో పాల్గొనే విషయమై చట్టబద్ధ గుర్తింపును కలుగచేసేందుకు ప్రస్తుతం పార్లమెంటు ముందు ఒక బిల్లు వున్నదని ఆయన తెలియచేశారు,

విద్యార్థులను శాసించటం కాకుండా, అకాడమిక్ వ్యవహారంలో వారికి కూడ పాత్ర నిచ్చేందుకు తీసుకోవలసిన చర్యల అవసరం వున్నదని అన్నారు.

యూనివర్శిటీ స్థాయిలో కూడ ఉపాధ్యాయులు, విద్యార్థుల మధ్య భేదాలసహేతుకమైనవి, విద్యార్థులను "పెద్దలుగా" పరిగణించటంవలన బాధ్యతాయుత పౌరులుగా వారు రూపొందేఅవకాశంవున్నదని అన్నారు.

బోధనా భాష విషయం ప్రస్తావిస్తూ, ప్రాంతీయ భాషలనుబోధనాభాషలుగారూపొందించటమంటే యూనివర్శిటీలనుండి పూర్తిగా ఇంగ్లీషును రద్దుచేయటం కాదని అన్నారు.

ఇంగ్లీషును రద్దుచేయటంకాక, విద్యార్థులు ఇంగ్లీషు భాషలో మంచి ప్రావీణ్యం సంపాదించాలని, లైబ్రరీ భాగం దానిని అభివృద్ధి చేసుకోవాలని అన్నారు, అందువలన ప్రతి యూనివర్శిటీ విద్యార్థి ఇంగ్లీషులో మంచి ప్రావీణ్యాన్ని సంపాదించుకోవాలని అన్నారు.

ఇంగ్లీషులో ప్రావీణ్యం వున్నట్లయితే. పెరుగుతున్న విజ్ఞానాన్ని విద్యార్థులు అర్థం చేసుకోగలరు. విద్యాస్థాయిని నెలకొల్పగలరు అని శ్రీ రావు అన్నారు.

ముందు జాగ్రత్తలు లేకుండ ప్రాంతీయ భాషలను బోధనా భాషలుగా మార్చరాదని శ్రీ రావు వైస్-ఛాన్సలర్లను హెచ్చరించారు. ప్రాంతీయ భాషలను బోధనాభాషలుగామార్చేటప్పుడు విద్యా స్థాయి పడిపోకుండ, జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు.

ప్రాంతీయ భాషలను ప్రవేశపెట్టేముందు మంచి పాఠ్యపుస్తకాలను రూపొందించాలని అన్నారు.

యూనివర్శిటీలకు సంబంధించి రానున్న సంవత్సరంలో అమలు పరుపనున్న 8 అంశాల కార్యక్రమాన్ని గురించి శ్రీ రావు వివరించారు.

కార్యక్రమంలో మొదటి అంశం పుస్తకాల అభివృద్ధి కార్యక్రమం. ప్రాంతీయ భాషలలో పుస్తకాలను తయారుచేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రతి రాష్ట్రానికి ఒకకోటి రూపాయలను అందచేస్తుంది పుస్తకాల అభివృద్ధిలో ప్రభుత్వానికి సలహా యిచ్చేందుకు కేంద్ర బోర్డును స్థాపించాలని తాను ఒక ప్రతిపాదన చేశానని శ్రీ రావు అన్నారు.

రెండవ కార్యక్రమం ; అండర్ గ్రాడ్యుయేట్ మొదట రెండు సంవత్సరాలలో ఎన్. సి. సి. కి ప్రత్యామ్నాయంగా క్రీడలు. నేషనల్ సోషల్ సర్వీసులు ప్రవేశపెట్టటం క్రీడల అభివృద్ధికి యూనివర్శిటీ గ్రాంట్సు కమీషన్, విద్యా శాఖలు యూనివర్శిటీలకు ఆర్థిక సహాయం కలుగచేస్తాయి

మూడవ కార్యక్రమం : యూనివర్శిటీ వ్యవహారాలలో విద్యార్థులు పాల్గొనేందుకు ప్రాతినిధ్యం కలిగించటం.

రాష్ట్రపతి తేజ్‌పూర్ రాక

విమానాశ్రయంలో గవర్నర్ ప్రభృతుల స్వాగతం

తేజ్‌పూర్, ఏప్రిల్ 21

రాష్ట్రపతి డా॥ జాకిర్‌హుస్సేన్ నేటి ఉదయం ఢిల్లీ నుండి ఇక్కడికి వచ్చారు.

ఇక్కడికి 7 మైళ్ళ దూరంలో వున్న సలానిబరి విమానాశ్రయంలోదిగిన రాష్ట్రపతికి అస్సాం, నాగాలాండ్ గవర్నర్ శ్రీ బి. కె. నెహ్రూ, మంత్రివర్గ సభ్యులు, సైనికాధికారులు, ఇంకా ఇతర ప్రముఖులు స్వాగతమిచ్చారు. అస్సాం రెవిన్యూ మంత్రి శ్రీ చౌదరి ఢిల్లీనుండి రాష్ట్రపతి వెంట వచ్చారు, గవర్నర్ రాష్ట్రపతి మెడలో పూలమాలలు వేశారు. విమానాశ్రయంనుండి పట్టణం వరకు గల 7 మైళ్ళ రోడ్డును ఆర్చీలతో అలంకరించారు. వేలాదిప్రజలు దారి కిరువైపుల నిలబడి జయజయ ధ్వానాలతో రాష్ట్రపతికి స్వాగత మిచ్చారు.

చెస్టర్ బౌల్సు స్వదేశ ప్రయాణం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 21

భారత దేశంలో అమెరికా రాయబారిగా 8 సంవత్సరాలు పనిచేసిన శ్రీ చెస్టర్ బౌల్సు నేడు ఢిల్లీనుండి స్వదేశానికి బయలుదేరి వెళ్ళారు. ఆయనతోపాటు శ్రీమతి బౌల్సు వున్నారు.

భారతదేశంలో అమెరికా రాయబారిగా ఈయన రెండుసార్లు పనిచేశారు. మొదటి సారిగా 1951 లోను, రెండవసారి 1963 లోను పనిచేశారు.

ఉత్తర ఐర్లాండుకు బ్రిటిష్ సైన్యం

మతకల్లోలాన్ని అణచివేసేందుకు

బెల్‌ఫాస్టు (ఉత్తర ఐర్లాండ్), ఏప్రిల్ 20

పెరుగుతున్న అశాంతి. విచ్ఛిన్నకర చర్యలను అణిచి వేసేందుకు ఉత్తర ఐర్లాండ్ ప్రభుత్వం ఈరోజు బ్రిటిష్ సైనిక దళాల సహాయాన్ని కోరింది.

ముఖ్యమైన ప్రాంతాలలో బ్రిటిష్‌సైన్యాలు కాపలా కాస్తాయని, ఐర్లాండ్ మంత్రివర్గ అత్యవసర సమావేశం తరువాత విడుదల చేసిన ప్రకటనలో తెలియచేయబడింది.

ప్రస్తుత సంక్షోభంలో త్వరగా నిర్ణయాలు చేసేందుకు మంత్రివర్గం 4 గురు సభ్యులతో భద్రత కమిటీనికూడ ఏర్పాటు చేసినట్లు తెలియచేయటం జరిగింది

ఉత్తర ఐర్లాండ్ ప్రాంతంలో నిన్నరాత్రి మత విద్వే[illegible] జరిగిన కొట్లాటలో 150 మంది [illegible] గాయపడటంతో బ్రిటిష్ సైన్యాలను పంపించవలసివచ్చింది.

గతరాత్రి విధ్వంసక చర్యలవలన విద్యుచ్ఛక్తి లైన్లు తెగిపోయాయి. బెల్‌ఫాస్టు నగరానికి నీటి సరఫరా చేసే నీళ్ళ టాంక్ పగిలిపోయింది.

వచ్చే వారాలకు నీటి రేషనింగ్ పద్ధతిని ప్రవేశపెట్టటం జరుగుతుందని అధికార ప్రతినిధి తెలియచేశారు.

గత అక్టోబర్ మాసం నుండి కాథలిక్‌లు వివక్షత విధానానికినిరసనగా ఆందోళన సాగిస్తున్నారు. ఆందోళన ప్రారంభమయినప్పటి నుండి నేటిరాత్రి జరిగినంత పెద్దఎత్తున ఘర్షణలు ఎప్పుడూ జరగలేదు. రోమన్ కాథలిక్‌లకు ఉద్యోగ వసతి తదితర సౌకర్యాలు కలిగించటంలో వివక్షత చూపుతున్నారనేది వారి ఫిర్యాదు.

నిన్నరాత్రి ఘర్షణల సందర్భంగా అనేక చోట్ల దహనాలు, లూటీలు జరిగాయి.

మంటలు ఆర్పేందుకు అవసరమయిన అగ్నిమాపకదళాలు లేనందువలన చాలా భవనాలు కాలిపోయాయి.

ప్రత్యేక తెలంగాణాకు గ్రామీణ ప్రజల వ్యతిరేకత

శ్రీ భీమిరెడ్డి నర్సింహారెడ్డి స్పష్టీకరణ

హైదరాబాద్, ఏప్రిల్ 21

ప్రత్యేక తెలంగాణాకు, గ్రామీణ ప్రజలు వ్యతిరేకంగా వున్నారని, ప్రత్యేక తెలంగాణా వల్ల, పేద, నిరుపేద రైతాంగం, సామాన్య ప్రజల ఇక్కట్లు, దూరమయ్యేదేమీలేదని. ఎక్కువవుతుందనే గుర్తింపు. తెలంగాణా గ్రామసీమల్లో క్రమంగా ఎక్కువవుతున్నదని మార్క్సిస్టు పార్టీ శాసన సభా పక్షనాయకుడు శ్రీ భీమిరెడ్డి నరసింహారెడ్డి నేడొక ప్రకటనలో స్పష్టం చేశారు. ఆ ప్రకటనలో యింకా యిలా వుంది:

"ఇటీవల నల్లగొండ, హుజూర్‌నగర్, సూర్యాపేట, భువనగిరి తాలూకాలు పర్యటించాము. అనేకగ్రామాల్లో ఇటీవలఉత్పన్నమైన ఆంధ్ర-తెలంగాణా సమస్యపై సమావేశాలు, సభలు జరిగాయి. గ్రామగ్రామాన జరుగుతున్న స్థానిక సమావేశాలు గాక 6 ప్రదేశాల్లో చిట్యాల, నకిరేకల్లు, మునగాల, జాజిరెడ్డిగూడెం,బోనగిరిలలో పెద్దసభలు, బహిరంగ సభలు జరిగాయి. ఇందులో ఒక్క బోనగిరికి మినహా తక్కిన వాటికి నేను హాజరయ్యాను. ఇవి కాక కొంది గ్రామాల నుండి పాల్గొన్న రైతుకూలీ ప్రతినిధులతో జయప్రదంగా జరిగిన సభలు. జాజిరెడ్డి గూడెం, మునగాల, బోనగిరిలలో వేలకొలది ప్రజలతో సభలు జరిగాయి.

ఇది విశాలాంధ్ర సమైక్యతను సమర్థిస్తూ ప్రత్యేక తెలంగాణా నినాదాన్ని వ్యతిరేకిస్తూ కాంగ్రెసు ప్రభుత్వాన్ని గద్దె దిగాలని కోరుతూ విశాలాంధ్రలో ప్రజారాజ్యమే తమ ఆశయమార్గమని ప్రకటిస్తూ తీర్మానించాయి. ఇలాంటి దృఢనిశ్చయంతో ఈ సభలు గ్రామగ్రామాన విస్తృత మవుతున్నాయి. వీటిలో ప్రజలు విరివిగా పాల్గొంటూ విశాలాంధ్ర సమైక్యతభావంతో కాంగ్రెసుపాలనకు వ్యతిరేకంగా ఒక ఉద్యమంగా కదలి ముందుకు పోతున్నారు.

ప్రత్యేక తెలంగాణా నినాదం తెలంగాణాలోని భూస్వామ్యదొరల నినాదమని, పూర్వం నుండి ఈ శక్తుల పెత్తనానికి వ్యతిరేకంగా పోరాడిన ప్రజలు తమ అనుభవం ద్వారా అర్థంచేసుకుంటున్నారు వెనుకబడినపరిస్థితిని తొలగించుటకు అభివృద్ధిని సాధించడానికి అవశ్యమైన భారీ పరిశ్రమల[illegible] 4 కోట్ల ప్రజల సమైక్య పోరాటం ద్వారానే సుసాధ్యమనే విషయం తెలంగాణా ప్రజానీకానికి [illegible]మైనది. అందువల్ల ప్రత్యేక తెలంగాణా నినాదంలో ప్రభుత్వ వ్యతిరేక [illegible]

గించుకోడానికి ఎంత ప్రయత్నం చేసినా సాధారణ రైతుకూలీలు ఇందుకు సిద్ధంగాలేరు. పైగా అనాటికినాడు సమైక్యత ఏర్పడి నూతన ప్రమాదాన్ని గ్రహించి రంగంలో ప్రవేశిస్తున్నారు. నాడునిజాంకు వ్యతిరేకంగా నేడు కాంగ్రెసుకు వ్యతిరేకంగా ప్రజా రాజ్యంకొరకు సాగే పోరాటంలో మొదటినుండి ముందుశ్రేణిలో నిలబడియున్న ఖమ్మం, నల్లగొండ జిల్లాలలో ఈవేర్పాటు ఉద్యమానికి బహిష్కృతస్థానం గలదు. "మాది వీర తెలంగాణా కాని వేరు తెలంగాణా కాదు" అనేది విప్లవ తెలంగాణా పోరాటంలో కీలక పాత్ర వహించిన యీ జిల్లాల ప్రజల నినాదం. విద్యార్థులు, ఉద్యోగులు నిరుద్యోగులు, ఆర్థిక సంక్షోభం మొదలగు అసంతృప్తితో ఈ ఆందోళనలో విరివిగా పాల్గొంటున్నప్పటికి ఈ ఉద్యమానికి ముఖ్యంగా కరీంనగర్, వరంగల్, మహబూబ్‌నగర్ వినా భూస్వామ్యశక్తులు వీరికి ప్రాతినిధ్యంవహించే కాంగ్రెసు బలంగా నాయకత్వం వహిస్తున్నాయనేది ఈనాడు సాక్షాత్తుగా కనబడుతున్న దృశ్యం. వీరి ప్రయోజనాన్ని నెరవేర్చు ప్రత్యేక తెలంగాణా నినాదాన్ని, వీరి పెత్తనానికి దోపిడికి గురవుతున్న సామాన్య రైతు కూలీలు తమ భుజాన వేసుకునే సమస్య లేనేలేదు."

శ్రీ రాజేశ్వరరావు స్పష్టీకరణ

(1 వ పేజీ తరువాయి)

తొలగించేందుకు తెలంగాణా ప్రాంతంతో సహా ఆంధ్రప్రాంతంలోకూడా విశ్వాసాన్ని కోల్పోయిన శ్రీ బ్రహ్మానందరెడ్డి రాజీనామా చేయాలి. ఆయన తెలంగాణా ప్రజలకు అన్యాయం చేసిన చిహ్నంగానే వున్నారు. ఎందుకనగాఆంధ్రప్రదేశ్ ఏర్పడినఅనంతరం 12 సంవత్సరాలపాటు ప్రధానమైన మంత్రిత్వశాఖలను నిర్వహించిన వారిలో ఆయన ఒకరు. ఏదో కొద్దికాలం మినహా ఆర్థికమంత్రిత్వశాఖను ఆయనేనిర్వహించారు. గత అయిదు సంవత్సరాల నుండి ముఖ్యమంత్రిగా వున్నారు ఆయన తలబిరుసు వైఖరి. కుట్రలతో కూడుకున్న రాజకీయాలు, వినయం లేకుండా ముఖ్య మంత్రి పదవిని అంటి పెట్టుకొని వుండటంవల్ల తెలంగాణా ప్రజలకు ఆగ్రహం కల్గించటమేకాక తెలంగాణా నాయకులను అతివాద స్థానాలకు నెట్టి వేర్పాటు ఉద్యమానికి దారి తీసారని శ్రీ రాజేశ్వరరావు అన్నారు.

తన ముఖ్యమంత్రి పదవిని కాపాడుకునే నిమిత్తం ఆంధ్రప్రదేశ్ ఐక్యతనూ, భవిష్యత్తును ఆయన బలిపెట్టకూడదు. నాలుగు కోట్ల తెలుగు ప్రజల ప్రయోజనాలను ఆయన మనస్ఫూర్తిగా కోరుతున్న పక్షంలో యింత ఆలస్యం జరిగినా యిప్పటికైనా కనీసం రాజీనామా చేయాలి. ఆయన రాజీనామా చేయని పక్షంలో మన రాష్ట్ర ప్రజల ప్రయోజనాల దృష్ట్యా జాతీయ స్థాయిలో దేశ ప్రయోజనాల దృష్ట్యా ఆయనను రాష్ట్రపతి డిస్మిస్ చేయాలని శ్రీ రాజేశ్వరరావు స్పష్టీకరించారు,

ఆందోళనకారులకు సహృదయతతో విజ్ఞప్తి

తెలంగాణా ప్రజలకు అన్యాయం జరిగిందని చెప్పే విషయంలో భేదాభిప్రాయాలు ఏమీలేవని ప్రత్యేక తెలంగాణా కొరకు ఆందోళన చేస్తున్న స్నేహితులకు, విద్యార్థులకు, యువకులకు మనవి చేస్తున్నాను. తెలంగాణా ప్రజలకు జరిగిన అన్యాయాలను వెంటనే తొలగించాలనే విషయంలో భారత కమ్యూనిస్టుపార్టీ మీతోసంపూర్ణంగా ఏకీభవిస్తున్నది అని ఆయన అన్నారు.

నాలుగుకోట్ల తెలుగుప్రజల ఐక్యతకు భంగం కలగకుండా, రాష్ట్రాన్ని ముక్కచెక్కలు చేయకుండానే తెలంగాణా ప్రజలకు జరిగిన అన్యాయాలను తొలగించేందుకు యితర మంచి మార్గాలు వున్నాయి. అందుకు మనమంతా తీవ్రమైన కృషిచేసి తెలంగాణాకు జరిగిన అన్యాయాలను తొలగించేందుకు పరిష్కార సూత్రాన్ని కనుక్కొని రాష్ట్ర సమైక్యతను కాపాడాలని ఆయన అన్నారు.

ఆంధ్రులపట్ల విద్వేష వైఖరి విడనాడండి

ఆందోళన సందర్భంగా మీరు చేపడుతున్న హానికరమైన పద్ధతులను విడనాడండి. ఆంధ్రులపట్ల విద్వేషాన్ని రెచ్చగొట్టి ఆంధ్ర ప్రాంత ప్రజలను ద్వేషించి గోడలపై అసహ్యకరమైన నినాదాలు రాసి, ఆంధ్రప్రాంత ప్రజలపై దాడిచేసి. ప్రభుత్వ ఆస్తులైన బస్సులు, రైల్వే బోగీలను, పోస్టాఫీసులను ప్రభుత్వ భవనాలను తగుల బెట్టడం మున్నగు చర్యలు మీకు సహాయకారిగా వుండవు, ఈ చర్యల మూలంగా మీరు తెలంగాణా ప్రజల ఆశయాలకే తీరని నష్టం కలిగిస్తున్నారు. అందువల్ల మీ ఆందోళనలో అటువంటి చర్యలకు స్వస్తి చెప్పండి అని ఆయన ఆందోళనకారులను కోరారు.

రాష్ట్రంలో ఏర్పడ్డ ప్రతిష్టంభన తొలగించేందుకు అన్ని రాజకీయ పార్టీలు. తదితర సంస్థలు, సహృదయులైన ప్రజలు పరిస్థితికి తగినట్లుగా ముందుకువచ్చి పరిష్కార మార్గాన్ని రూపొందించేందుకు ప్రధాని రౌండ్ టేబుల్ సమావేశాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేయాలని ఆయన చెప్పారు.

రాజమండ్రి మీదుగా విశాఖపట్నం - నర్సాపూర్‌ల మధ్య నడిచే ఆర్. టి. సి నైట్ ఎక్స్‌ప్రెస్ బస్సు యిక నుండి కాకినాడ మీదుగా పోతుంది

విశాఖ నౌకా నిర్మాణ కేంద్రం ఉత్పత్తిశక్తి పెంపుదల

— చతుర్థప్రణాళికలో

న్యూఢిల్లీ, ఏప్రిల్ 20

చతుర్థ ప్రణాళికా కాలంలో విశాఖపట్నంలోని హిందూస్థాన్ నౌకా నిర్మాణ కేంద్రపు సాలుసరి ఉత్పత్తిశక్తి ప్రస్తుతపు 2½ ఓడల నుండి 6 ఓడలకు పెంచబడుతుంది.

చతుర్థ ప్రణాళికా కాలంలో పారిశ్రామికోత్పత్తి ఏటా 8 నుండి 10 శాతం పెరుగుదల రేటు సాధ్యమని ఆశింపబడుతోంది పరిశ్రమల్లోనూ, మైనింగులోనూ మొత్తం పెట్టుబడి రు. 5200 కోట్లుంటుందని అంచనా వేయబడుతోంది.

చతుర్థ ప్రణాళికారంభంలో మైనింగ్, (గని త్రవ్వకం) ఉత్పత్తి రంగాల్లో కేంద్రం పెట్టుబడులు రు 3400 కోట్లుంటుంది. దీనిలో చాలాభాగం ఉక్కు, బొగ్గు, లిగ్నైట్ భారీ యింజనీరింగ్, విద్యుత్ పరికరాలు, పెట్రోలియం, ఎరువులు మొదలైన భారీ పరిశ్రమల అభివృద్ధికి కేటాయింపబడుతుంది.

ప్రణాళికాంతానికి ఉక్కు ఉత్పత్తి ప్రస్తుతమున్న 90 లక్షల టన్నుల నుండి 120లక్షలటన్నుల ప్రమాణానికిచేరుకుంటుంది

ప్రణాళికాంతానికి 10 లక్షల టన్నుల ఉక్కు, 15 లక్షల టన్నుల దుక్క యినుము ఎగుమతి చెయ్యబడుతాయి.

అల్యూమినం ఉత్పత్తి రెట్టింపు (అంటే 2,20,000 టన్నులు) అవుతుంది.

కేంద్రరంగ పరిశ్రమలపైన, గనులపైన వెచ్చింపబడే మొత్తం రు. 2310 కోట్లలోనూ రు. 213 కోట్లు పరిశ్రమలకు, రు 986 కోట్లు లోహాలకు, రు 153 కోట్లు యంత్రాలు. ఇంజనీరింగు పరిశ్రమలకు రు 483 కోట్లు ఎరువులకు, చీడనివారక మందులకు, రు 184 కోట్లు యింధనోత్పత్తులకు, రు 36 కోట్లు వాడకం వస్తువులకు, రు 287 కోట్లు యితర పథకాలకు, రు 717 కోట్లు ఖనిజాలకు, రు 60.90 కోట్లు అణుశక్తి ఉత్పత్తికి వెచ్చించబడతాయి.

సాంకేతిక పరిజ్ఞానం విషయంలో గత్యంతరంలేని పరిస్థితుల్లో మాత్రమే విదేశీ సహకారాన్ని పొందాలని నిర్ణయించబడింది

న్యూస్‌ప్రింట్ పరిశ్రమకు రు. 60 కోట్లు కేటాయింపబడింది.

సిమెంటు రంగంలో ప్రస్తుతం నిర్మాణంలో వున్న రెండు కర్మాగారాలు పూర్తి చెయ్యబడతాయి సిమెంటు కొరత వున్న ప్రాంతాల్లో మరో రెండు కర్మాగారాలు నిర్మింపబడతాయి.

ప్రైవేటు, సహకారరంగాల్లో

ప్రైవేటు, సహకార రంగాల్లో పరిశ్రమలకు, రు. 2400 కోట్లు కేటాయింపబడ్డాయి.

ప్రైవేటు రంగంలో ఉక్కు కర్మాగారపు ఉత్పత్తిశక్తి 20 లక్షల టన్నులనుండి 40 లక్షల టన్నులకు పెంచబడుతుంది

హిందుస్థాన్ యంత్ర పరికరాలు, మైనింగ్ అండ్ ఎలైడ్ మెషినరీ కార్పొరేషన్, భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ వగైరా పరిశ్రమల్లో కొద్దిమొత్తాల్లో మదుపు పెట్టబడుతుంది.

యంత్రపరికరాలు, రవాణా పరికరాలు, సాధనాలు, వ్యవసాయిక యంత్రాల పరిశ్రమల విస్తృతికి చర్యలు తీసుకోబడతాయి.

ఎరువులు

నానాటికీ ఎరువులకు పెరుగుతున్న గిరాకీ దృష్ట్యా ప్రస్తుతం నిర్మాణంలోవున్న23లక్షల టన్నులకర్మాగారాలతోబాటు, 11లక్షలటన్నుల ఉత్పత్తిశక్తిగల మరో7 కర్మాగారాల నిర్మాణంకూడ చతుర్థప్రణాళికా కాలంలో జరుగుతుంది

బొగ్గు ముడి సరుకుగా ఎరువుల కర్మాగారాల స్థాపనకు యీకాలంలో కృషి జరుగుతుంది

కృత్రిమ దారాలు, కృత్రిమ రబ్బరు, ప్లాస్టిక్ పరిశ్రమల కవసరమైన నాఫ్తా కర్మాగారం కొయాలీలో ప్రభుత్వ రంగంలో నిర్మింపబడుతుంది.

ప్రభుత్వ రంగంలోని నూనె శుద్ధి కర్మాగారాల ఉత్పత్తిశక్తి పెంపొందింప బడుతుంది.

బొగ్గు

1973-74 నాటికి బొగ్గు ఉత్పత్తి 9 కోట్ల 35 లక్షల టన్నులకు పెంచబడుతుంది.

కాంగ్రెసు పార్టీలో గుత్తవర్గాల ప్రభావం

శ్రీ చంద్రశేఖర్ అభిప్రాయం

కాన్పూరు, ఏప్రిల్ 20

కాంగ్రెసుపార్టీలో స్వార్థపర వర్గాలు, గుత్తపెట్టుబడిదారీ వర్గాలది పైచేయి అయిన పక్షంలో భారత రాజకీయ పటమునుండి పార్టీ తుడిచిపెట్టుకపోతుందని కాంగ్రెస్ పార్లమెంటు సభ్యుడు శ్రీ చంద్రశేఖర్ నేడిక్కడ చెప్పారు.

స్వార్థపరులు పార్టీలో లేనట్లయితే దేశ ఆర్థిక సాంఘిక పరివర్తనను కాంగ్రెస్‌పార్టీ సాధించ గాగలదని యువకాంగ్రెస్ వాదుల నాయకుడైన శ్రీ చంద్రశేఖర్ నేడిక్కడ పత్రికా గోష్టిలో చెప్పారు.

కాంగ్రెస్‌పార్టీ దశసూత్ర కార్యక్రమంలో విశ్వాసంలేనివారిని పార్టీనుండి బహిష్కరించాలని ఆయన అన్నారు.

డా॥ సుశీలా నయ్యార్ నిరవధిక నిరశన దీక్ష

ఝాన్సీ (ఉ.ప్ర.), ఏప్రిల్ 20

ఝాన్సీలో అఖిలభారత మద్యనిషేధ సమితి అధ్యక్షురాలు డాక్టర్ సుశీలానయ్యర్ చేస్తున్న నిరవధిక నిరాహారదీక్ష నేటితో అయిదవరోజు జేరుకుంది.

ఝాన్సీ జిల్లాలో మద్యపానానికి వ్యతిరేకంగా జరుగుతున్న ఆందోళనసందర్భంగా ఆమె యీ నిరశన వ్రతాన్ని ప్రారంభించారు.

ఆమె దీక్షకారీ ప్రారంభమైన నాటినుండి, ఇప్పటికి 10 సారాయి దుకాణాలు మూసుకోబడ్డాయి. ఇప్పటికి 10 సారాయి దుకాణాలు

ఆమె రోజువారీ ప్రార్థనల్లో పాల్గొంటోంది, ఇప్పటికి 10 సానుల బరువు కోల్పోయింది.

శ్రీ మాన్‌సింగ్ రావత్ కూడా తన నిరశన వ్రతాన్ని కొనసాగిస్తున్నారు.

జనపనార సాగుపై ఆంక్షలు రద్దు

తూర్పు పాకిస్తాన్‌లో

ఢాకా, ఏప్రిల్ 20

సరిహద్దు ప్రాంతాలలో జనపనార వ్యవసాయంపైగల ఆంక్షలను తక్షణం ఉపసంహరించాలని తూర్పుపాకిస్తాన్ ప్రభుత్వం నిశ్చయించింది.

సరిహద్దు ప్రాంతంలో జనపనార సాగుకు అనుమతించాలని రాష్ట్ర ప్రజలు పదే పదే కోరుతున్న దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకోబడినట్లు పాకిస్తాన్ రేడియో నిన్నటి ప్రసారంలో తెలియజేసింది.

మృతుల సంఖ్య 670 కి పెరుగుదల

ఢాకా, ఏప్రిల్ 20

గతవారం తూర్పు పాకిస్తాన్‌లో సంభవించిన పెనుతుపానులో మృతి చెందిన వారి సంఖ్య 670 కి చేరినట్లు ఢాకాలో అధికారికంగా ప్రకటించబడింది.

సహాయ కార్యక్రమాలు ఉధృతం చేయబడినట్లు పాకిస్తాన్ రేడియో తెలిపింది

ఆధునిక పద్ధతుల ద్వారా ప్రత్తి వుత్పత్తి పెంపు

బొంబాయి, ఏప్రిల్ 21

ఆధునాతన పద్ధతులద్వారా దేశంలో ప్రత్తి వుత్పత్తిని మూడురెట్లు పెంచవచ్చునని తెలుస్తూంది.

కోయంబత్తూరులోని ప్రత్తి పెంపకం కేంద్రంలో గత రెండు సంవత్సరముల నుండి జరిపిన పరిశోధనవల్ల పై విషయం తెలిసింది.

పాత పద్ధతులద్వారా హెక్టారు 7.8 క్వింటాళ్ళ ప్రత్తిని పండించవచ్చును అధునాతన పద్ధతులద్వారా హెక్టారుకు 21.8 క్వింటాళ్ళ ప్రత్తిని పండించవచ్చునని పరిశోధనలవల్ల తెలిసింది.

మార్క్సిస్టుపార్టీచే ట్రేడ్‌యూనియన్ ఉపసంఘం ఏర్పాటు

కలకత్తా, ఏప్రిల్ 20

ఈ నెల 18 వ తేదీతో యిక్కడ ముగిసిన మార్క్సిస్టుపార్టీ కేంద్ర కమిటీ సమావేశం వివిధ రాష్ట్రాల్లో ట్రేడ్‌యూనియన్ రంగంలో పనిచేస్తున్న కార్యకర్తల కృషిని అనుసంధానం చెయ్యడానికిగాను 10 మంది సభ్యులతో ట్రేడ్‌యూనియన్ ఉపసంఘాన్నొకదాన్ని నియమించింది.

ఈ ఉపసంఘంలో ముగ్గురు పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీయుతులు బి.టి. రణదివే (కన్వీనర్), పి. రామమూర్తి, ప్రమోద్ దాస్ గుప్తాలు పశ్చిమ బెంగాల్ కార్మిక మంత్రి శ్రీ కృష్ణపదఘోష్ సభ్యులుగా వుంటారని పార్టీ ప్రతినిధి ఒకరు నేడిక్కడ చెప్పారు.

కమ్యూనిస్టు పార్టీలో చీలిక వచ్చినప్పటికీ ట్రేడ్ యూనియన్ రంగంలో మటుకు భారత కమ్యూనిస్టుపార్టీ, మార్క్సిస్టుపార్టీ ఐక్యంగా పనిచేస్తున్నాయి

భారత కమ్యూనిస్టుపార్టీకి అఖిలభారత ట్రేడ్‌యూనియన్ సమితి యింతకు ముందేవుంది మార్క్సిస్టుపార్టీ దాన్ని యిప్పుడేర్పాటు చేసింది

ఈ ఉపసంఘ నియామకం అఖిల భారత ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్‌కు పోటీగా ఏదో ఉద్దేశంతో జరిగిందనే ట్రేడ్ యూనియన్ ల సమైక్యతను మరింత బలిష్టంగా రూపొందించుకోవడానికి వీలుగా ఏర్పాటవ జరిగిందని పార్టీ ప్రతినిధి చెప్పారు

ఎ ఐ టి యు సి జనరల్ సెక్రటరీ శ్రీ యస్. ఎ. డాంగే (సి పి ఐ) అధ్యక్షుడు, శ్రీ ఎస్. రాయ్ (సి పి ఎం) కార్యదర్శిగా ఐక్యంగా పనిచేస్తోందని కూడా ఆయన చెప్పారు.

పట్టణ ఎన్నికల సంరంభం

సమితి ఆధ్వర్యాన వెయ్యిమందితో ఊరేగింపు

(విశాలాంధ్ర విలేకరి)

విజయవాడ, ఏప్రిల్ 20

పట్టణ మున్సిపల్ఎన్నికలలో కాంగ్రెస్‌ను ఓడించే నిమిత్తం ప్రజాతంత్ర అభ్యుదయవాద పార్టీలతోను, ఇండిపెండెంట్లతో ఏర్పడిన పట్టణ అభివృద్ధి సమితి ఆధ్వర్యాన నేటిసాయంత్రం 30, 31, 32 వార్డులలో వెయ్యిమందితో ప్రదర్శన జరిగింది. ఊరేగింపు ఉత్సాహపూరితంగా జరిగింది.

"ఈ మురికి వీధులు బాగుపడాలంటే సమితి అభ్యర్థులకే మీ ఓటు వెయ్యాలి" "కాంగ్రెస్‌ను ఓడించాలి" "సమితిఅభ్యర్థుల్ని గెలిపించాలి" అని ప్రదర్శకులు నినాదాలు చేశారు. 31 వ వార్డు సమితి అభ్యర్థి శ్రీబెల్లపు శ్రీరాములు, 32వవార్డు అభ్యర్థి శ్రీకోయపాటి మాధవరావు 29వ వార్డు అభ్యర్థి శ్రీకాట్రగడ్డ రాజగోపాలరావు, 30 వ వార్డు అభ్యర్థి శ్రీ వెల్లంకి మోహనరావు ప్రభృతులు ఊరేగింపుముందు నడిచారు.

సమితి ఆధ్వర్యాన పోటీచేస్తున్న అన్ని వార్డులలోను ఉధృత ప్రచారం ప్రారంభమై కొనసాగుతోంది.

అన్నివార్డులలోను ఎన్నికల కార్యాలయాలను ఏర్పరిచారు.

సమితి గుర్తైన పుష్పాన్ని ఎర్రకాగితపు తోరణాలపై ముద్రింప జేశారు

వార్డులన్నిటిలో అరుణారుణ తోరణాలు కట్టబడ్డాయి. తెల్లని జెండాపై పుష్పం గుర్తుగల పతాకాలు ఎగురుతున్నాయి.

ఎన్నికల సభలు: ప్రదర్శనలు

నిన్న సాయంత్రం కృష్ణలంకలో 36 వ వార్డు సమితి ఎన్నికల కార్యాలయంవద్ద జరిగిన బ్రహ్మాండమైన బహిరంగసభకు శ్రీ అడుసుమిల్లి దామోదరప్రసాదరావు అధ్యక్షతవహించారు. శ్రీ పొన్నం వీరరాఘవయ్య, 35 వ వార్డు సమితిఅభ్యర్థి శ్రీచెన్ను తిరుమలరావుని 36 వ వార్డు అభ్యర్థి శ్రీ పొట్లూరి కృష్ణారావుని, 37 వ వార్డు అభ్యర్థి శ్రీ రామమోహనరావుని పరిచయం చేశారు.

శ్రీయుతులు టి. వెంకటేశ్వరరావు కాట్రగడ్డ రాజగోపాలరావు, మాదిరెడ్డి సుబ్బారావు. తమ్మిన పోతరాజులు ప్రసంగిస్తూ, ఇంతకాలం కాంగ్రెస్ గావించిన దుష్కృత్యాలను వివరించి. లోగడ సమితి పట్టణ అభివృద్ధికి ఎంత కృషి చేసిందీ వివరించారు.

అనంతరం మోగివేసిన హరికథ చెప్పబడింది.

పడవ ప్రమాదంలో ఏడుగురు మృతి

బొంబాయి చేరువలో

బొంబాయి, ఏప్రిల్ 20

ఉత్తర బొంబాయి శివార్లలోని మాహిం దీవిలో నేటి ఉదయం వినోదయాత్రికుల బృందం పడవ నీట మునిగిన ఫలితంగా నలుగురు బాలికలతోసహా ఏడుగురు పిల్లలు నీటమునిగి పోయారు. మరో ముగ్గురిని నగర ఆస్పత్రిలో చేర్చారు.

శంకరాచార్యకు మేజిస్ట్రేట్ సమన్లు

ఈ నెల 24 న కోర్టుకు హాజరు కావలసిందిగా

పాట్నా, ఏప్రిల్ 20

మార్చి 29 న యిక్కడ అస్పృశ్యతను గురించి చేసిన ప్రసంగానికిగాను జగద్గురు పూరీ శంకరాచార్యులవారిని యీ నెల 24 వ తేదీన కోర్టులో హాజరవవలసిందిగా పాట్నా సబ్‌డివిజనల్ మేజిస్ట్రేటు శ్రీ ఎస్. ఎన్. సహాయ్ ఉత్తర్వు జారీ చేశారు.

పిర్యాదీ శ్రీ శివానంద తివారీని కూడా ఆ రోజున కోర్టుకు హాజరు కావలసిందిగా మేజిస్ట్రేటు ఆదేశించారు.

ఈ విషయమై రేపటిలో చెలరేగిన వాదోపవాదాలపై మీ అభిప్రాయమేమిటని విలేకరు లడిగిన ప్రశ్నకు పూరీ శంకరాచార్యులవారు బదులిస్తూ తానెన్నడూ అస్పృశ్యతను సమర్థించలేదని, యీ విషయమై తాను ఎప్పుడో యిచ్చిన వివరణలను ప్రక్కకు నెట్టి, కొందరు కావాలని వస్తున్నారనే కోర్టుకుంటే, అందుకు నేను సర్వసంసిద్ధంగా ఉన్నానని చెప్పారు.

కాలికట్ ప్రాంతంలో తుపాను

ఒక వ్యక్తి మరణం

6గురికి గాయాలు

కాలికట్, ఏప్రిల్ 21

గతరాత్రి కాలికట్ ఉత్తరతీర ప్రాంతంలో సంభవించిన తుపాను, భారీవర్షంవల్ల ఒక వ్యక్తి మరణించినట్లు, 6 గురికి గాయాలు తగిలినట్లు నేడు అందినసమాచారం వల్ల తెలుస్తూంది. దాదాపు నూరుయిళ్ళు నాశనమైనట్లు తెలుస్తోంది.

వెల్లూరు, కక్కాయం, తిరువంబాడి కక్కయం కాయన్నా గ్రామాలలో తుపానువల్ల వందలాది కొబ్బరిచెట్లు వేళ్ళతో పెకలించివేయబడినట్లు తెలుస్తోంది. కొన్ని గంటలపాటు ఈ ప్రాంతాలలో విద్యుచ్ఛక్తి సరఫరా ఆగిపోయింది రవాణా, వార్తా సౌకర్యాలు ఆగిపోయాయి

కక్కయం డాం ప్రాంతంలో కొన్ని షెడ్లు అసిస్టెంటు ఇంజనీరు కార్యాలయంలోని కొంత భాగం పడిపోయాయి.

తిరువంబాడి గ్రామంలో రెండు చర్చి పైకప్పులు, కొన్ని యిళ్ళు నేలమట్టమయ్యాయి.

తుపానువల్ల దెబ్బతిన్న ప్రాంతాలలో సహాయ కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ప్రభుత్వాధికారి తెలియజేశారు.

ఆగ్రో పరిశ్రమల అభివృద్ధికి మైసూరు ప్రభుత్వ నిర్ణయం

బెంగుళూరు, ఏప్రిల్ 21

ఆగ్రో పరిశ్రమలను అభివృద్ధి చేయాలని మైసూరు ప్రభుత్వం తలపెట్టింది

భవిష్యత్తులో ఈ పరిశ్రమల అభివృద్ధిని గురించి పరిశీలించేందుకు హంగేరియన్ నిపుణులను ఆహ్వానించింది. ఆ నిపుణుల బృందం వచ్చే కొద్దినెలల్లో యిక్కడకు చేరుకుంటుంది.

వ్యవసాయ పనిముట్ల వుత్పత్తిని చేపడతారు.

గుండెమార్పిడి కొరకు భారత దేశం వచ్చిన ఆఫ్రికా స్కూల్ విద్యార్థి ఒకరు గుండెమార్పిడికి తిరస్కరించి తిరిగి స్వదేశానికి వెళ్ళిపోయారు.

వ్యవసాయాభివృద్ధికి ప్రభుత్వ, ప్రైవేటు రంగాల కృషి

నాల్గవ పంచవర్ష ప్రణాళికలో రు.4017కోట్లు కేటాయింపు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 20

వ్యవసాయానికి తత్సంబంధ కార్యక్రమాలకి చతుర్థ ప్రణాళిక ముసాయిదాలో రు. 2217 కోట్లు కేటాయించబడ్డాయి.

వ్యవసాయరంగంలో అధికోత్పత్తి సాధించడం, అసమానతలను తొలగించడం ప్రధాన లక్ష్యాలుగా వ్యవసాయరంగ కార్యక్రమం రూపొందించబడింది వ్యవసాయోత్పత్తిలో ఏటా 5 శాతం పెరుగుదల రేటు లక్ష్యంగా పెట్టుకోబడింది

పై రు. 2217 కోట్లకుతోడు ప్రైవేటు రంగంలో మరో రు. 1800 కోట్లుకూడ ప్రణాళికాకాలంలో వ్యవసాయంపై వెచ్చింపబడతాయి.

అగ్రికల్చరల్ రీఫైనాన్స్ కార్పొరేషన్, లాండ్ డెవలప్మెంట్ బ్యాంకులు సెంట్రల్ కోఆపరేటివ్ బ్యాంకులు, ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్, వాణిజ్య బ్యాంకులు మొదలైన వాటినుండి యీ మొత్తం లభిస్తుంది.

1974 నాటికి 12 కోట్ల 90 లక్షల టన్నుల ఆహార ధాన్యాలు, 74 లక్షల బేళ్ళ జనపనార, 80 లక్షల బేళ్ళ ప్రత్తి, 1 కోటి 5 లక్షల టన్నుల నూనెగింజలు 1½ కోట్ల టన్నుల చెరుకు (బెల్లం) ఉత్పత్తిని సాధించాలని నిర్ణయింపబడింది

అధికోత్పత్తి లక్ష్యం

అధిక దిగుబడి వంగడాలను 85 లక్షల ఎకరాల నుండి 2 కోట్ల 44 లక్షల యెకరాలకు పెంచాలని నిర్ణయించబడింది

చిన్న రైతుల అభివృద్ధి గాను ఒకటి నిస్తాపింప బడుతుంది ఈ శాఖ ద్వారా సన్నకారు రైతులకు భూములను చదునుచేసి, యంత్రాలిచ్చి, మార్కెటింగ్ సౌకర్యాలు కల్పింపబడతాయి.

వ్యవసాయ రంగం వివిధ అంశాలకు యీ క్రింది మొత్తాలు కేటాయింపబడ్డాయి.

1969 - 74	(కోట్ల రూపాయలు)
వ్యవసాయోత్పత్తి (పరిశోధన శిక్షణలతోబాటు)	510.23
మైనర్ ఇరిగేషన్	475.67
భూసార పరిరక్షణ	151.8
ప్రాంతాభివృద్ధి	29.51
పశుగణాభివృద్ధి	90.91
పాడిపరిశ్రమ, సరఫరా	45.11
మత్స్యపరిశ్రమ	83.67
అడవులు	92.80
వేర్‌హౌసింగ్ మార్కెటింగ్ స్టోరేజ్	65.34
ఆహారధాన్యాల ప్రాసెసింగ్	18.60
కేంద్ర సంస్థలు (వ్యవసాయరంగ ప్రత్యేక పథకాలు)	263.09
బఫర్ నిల్వలు	125.00
సహకారసంస్థలు	151.41
సామాజికాభివృద్ధి గ్రామాలు, పంచాయతీలు	115.81
మొత్తం	2217.44

రాష్ట్రాల్లో కేంద్ర రిజర్వు పోలీస్

కేంద్రంతో బెంగాల్ నాయకుల చర్చల్లో ప్రతిష్టంభన

న్యూఢిల్లీ, ఏప్రిల్ 21

బెంగాల్ కేంద్రరిజర్వు పోలీసులను వినియోగించే విషయానికి సంబంధించి కేంద్ర ప్రభుత్వానికి, రాష్ట్ర ప్రభుత్వానికి మధ్య జరుగుతున్నచర్చలలో ప్రతిష్టంభనఏర్పడిందని పశ్చిమ బెంగాల్ ఉపముఖ్యమంత్రి శ్రీ జ్యోతి బాసు నేడిక్కడ పత్రికాగోష్టిలో చెప్పారు.

ముఖ్యమంత్రి శ్రీ అజయ్ ముఖర్జీ అభివృద్ధిశాఖ మంత్రి శ్రీ సోమనాథలాహిరీలు పత్రికాగోష్టిలో ప్రసంగించారు.

కేంద్ర రిజర్వు పోలీసుల విషయం రేపు హోం మంత్రితో చర్చించగలమని శ్రీ జ్యోతి బాసు చెప్పారు.

రాష్ట్ర ప్రభుత్వం కోరితే తప్ప కేంద్ర పోలీసులను పంపగూడదన్నది రాష్ట్ర ప్రభుత్వాల హక్కు అని అన్నారు.

శ్రీ జ్యోతిబాసు యింకా ఇలా అన్నారు: శాంతి భద్రతలవిషయం రాష్ట్ర విషయం. రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తి మీదట తప్ప కేంద్ర రిజర్వు పోలీసులను వినియోగించడం అంటే పోటీగా పోలీసులను నియోగించడమే అవుతుంది ఫలితంగా పరిష్కరించబడలేని సంఘర్షణలు తలెత్తుతాయి. ఇదివరకుహోంమంత్రితోనేను చర్చలు జరిపినప్పుడు కేంద్రపోలీసులను ఉపసంహరించుకోవలసిందిగా విజ్ఞప్తి చేశాను, ఆయన అందుకు అంగీకరించారు.

కేంద్ర ప్రాంతాలకు చెందిన అధికారుల డిమాండుమేరకు ఫరక్కా బ్యారేజివద్ద కేంద్ర పోలీసులను వినియోగించడాన్ని హోం మంత్రి సమర్థించారని పత్రికలలో వార్తలు వచ్చాయి.

హోంమంత్రి వైఖరి యింతకుముందు వచ్చిన ఆ వార్తలకు వ్యతిరేకం ఫరక్కా బ్యారేజ్ రాష్ట్రంలో వుంది. బ్యారేజ్‌ను రక్షించే విషయంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలం అయిందని ఎవరూ చెప్పలేదు.

పశ్చిమ బెంగాల్‌లో 3½ లక్షల మంది కేంద్ర ఉద్యోగులున్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు 2 లక్షల 10 వేలకు పైగా వున్నారు. రాష్ట్రంలోని ఏ కేంద్ర ప్రభుత్వ ఉద్యోగి అయినా కోరితే కేంద్ర పోలీసులను నియోగించే హక్కు కేంద్రానికి ఉన్నదన్న సూత్రం ఆమోదిస్తే రాష్ట్ర ప్రభుత్వాన్ని త్రోసిరాజనడమే అవుతుంది."

రైల్వే మంత్రిని కలుసుకొని రాష్ట్రంలో వాగన్ల తయారుచేసే పరిశ్రమ ఎదుర్కొంటున్న యిబ్బందులను తెలియచేయగలనని అన్నారు.

పార్లమెంటు సమావేశం అయిన తరువాత తను, కేంద్ర ఉక్కు గనుల మంత్రి దుర్గాపూర్ ఉక్కు ఫ్యాక్టరీకి వెళ్ళి అక్కడి వివాదాన్ని పరిష్కరించగలమని అన్నారు.

అనేక సంవత్సరాలుగా పేరుకొనిపోయిన సమస్యల ఫలితంగా యీ వివాదం సంభవించిందని అన్నారు.

గవర్నర్

ధర్మవీర తరువాత గవర్నర్‌గా నియమించడానికి రాష్ట్ర ప్రభుత్వం సూచించిన రెండు పేర్లను కేంద్రం అంగీకరించలేదని తెలిపారు.

కాబోయే గవర్నర్ ఎవ్వరు వస్తారో తెలియదు "ఆయనకోసం యెదురుచూస్తున్నాము" అని జ్యోతిబాసు అన్నారు.

సోమనాథలాహిరి

ప్రణాళిక అభివృద్ధిశాఖ మంత్రి శ్రీసోమనాథలహిరి ప్రసంగిస్తూ, చిన్నవాటి దగ్గర నుండి పెద్దవాటి వరకు కేంద్ర ప్రభుత్వం పని నిర్వహణలో అడ్డంకులు కల్పిస్తూవున్నదని అన్నారు.

5 శాతం వ్యవసాయ కుటుంబాలకే పంపుసెట్‌ల వినియోగం పరిమితి

ఆంధ్రప్రదేశ్ పరిస్థితి

హైదరాబాద్, ఏప్రిల్ 20

ఆంధ్ర ప్రదేశ్‌లో గత ఏడు సంవత్సరాలలో వ్యవసాయానికి విద్యుత్ పంపుసెట్లు వినియోగం ఏడురెట్లు పెరిగింది అయితే మొత్తం వ్యవసాయిక కుటుంబాలలో 5 శాతం మాత్రమే ఈ పంపుసెట్లను వినియోగిస్తున్నవి. ఈపంపుసెట్లపై క్రొత్తగా పన్ను విధించాలని కేంద్ర ప్రభుత్వం తలపెట్టింది.

అలాగే నగటున ఎకరాకు వినియోగిస్తున్న ఎరువులు విషయంలో సన్నకారు రైతులు, 10 ఎకరాలు అంతకులోపుఅస్తిగల సగటు రైతులు ఎక్కువగా వాడుతున్నప్పటికీ ఎక్కువ అస్తిగలవారు కూడా విస్తృతంగానే వాడుతున్నారు.

రాష్ట్రంలోని 40 లక్షల 2 వేల వ్యవసాయ కుటుంబాలలో రెండు లక్షలకుటుంబాలకు పైగా మాత్రమే పంపుసెట్లను, అయిలు ఇంజన్‌లను ఉపయోగిస్తున్నట్లు అధికార లెక్కలు తెలుపుతున్నవి

రాష్ట్ర పరిశ్రమల శాఖ సమాచారం ప్రకారం రెండవ పంచవర్ష ప్రణాళిక ముగిసే నాటికి 11 వేల విద్యుత్ పంపుసెట్లు వాడుకలో వుండగా 1968నాటికి అవి 1 లక్ష 23 వేలకు పెరిగాయి అలాగే ఆయిల్ ఇంజన్లు 1961 లో 34 వేలు కాగా 1968 నాటికి 48,700కు పెరిగాయి.

అంటే దీని ప్రకారం ప్రతి 100 వ్యవసాయ కుటుంబాలలో ఐదు కుటుంబాలు క్రొత్తగా వీటిపై విధించే పన్నును చెల్లించవలసి వుంటుంది.

2.5 నుండి 5 ఎకరాల వరకు భూమి గలవారు కేవలం 0.5 శాతం, 10 నుండి 20 ఎకరాల కమతాలు 0.12 శాతం, 20 నుండి 30 ఎకరాలలోపు కమతాలు 0.28శాతం, 30 ఎకరాలు అంతకుపైబడిన కమతాలు 7.09 శాతం పంపుసెట్లను వినియోగిస్తున్నట్లు 1961 జాతీయనమూనా సర్వే తెలిపిన్నది. అలాగే వ్యవసాయానికి ట్రాక్టర్ల వినియోగం కూడా 20 ఎకరాలు, అంతకు పైబడిన వారిలో 0.06 శాతానికి వినియోగానికిమించలేదు.

సగటున ఎరువుల వినియోగం ఐదు ఎకరాలలోపు కమతాలలో 75 కేజీ, 250 ఎకరాలకు పైబడిన వారు 276 కేజీ, 50 ఎకరాలు, అంతకు మించిన కమతాలు 868 కేజీగా వున్నట్లు ఆ సర్వేలో తేలింది,

అధిక దిగుబడినిచ్చే వంగడాలను ప్రవేశపెట్టిన దరిమిలా బడా భూస్వాములలో కూడా ఎరువుల వాడకం బాగా పెరుగుతున్నది.

విశాలాంధ్ర కే

విజయవాడలో

లెనిన్ శతజయంతి సభ

విజయవాడ, ఏప్రిల్ 21

మార్క్సిస్టు ఎడ్యుకేషన్ సొసైటీ, స్థానిక ఇన్స్టిట్యూట్ ఆధ్వర్యాన రేపు సాయంత్రం 6 గంటలకు (22వ తేదీ) విశాలాంధ్ర ప్రచురణాలయ భవనంలో లెనిన్ శతజయంతి సభ జరుగుతుంది. సభకు శ్రీ మద్దుకూరి చంద్రశేఖరరావు అధ్యక్షత వహిస్తారు. శ్రీ కంభంపాటి సత్యనారాయణ తదితరులు ప్రసంగిస్తారు.

ప్రకటన

తేలప్రోలు గ్రామంలో శ్రీ తియ్యగూర సుబ్బారెడ్డి (ఫిరంగి పురం) గారి మాగాణి భూమి క్రయం పొందుటకు ఒప్పందం జరిగినది. ఎవరికైనా అభ్యంతర మున్నచో వారం రోజులలో తెలుపవలయును.

బొమ్మారెడ్డి సత్యనారాయణరెడ్డి,
తేలప్రోలు, కృష్ణాజిల్లా.

శ్రద్ధాంజలి

జలియన్‌వాలా బాగ్

మృత వీరులకు
మన స్వాతంత్ర్య
సమరంలో
ప్రముఖ పాత్ర
వహించిన దేశ
భక్తులను
గుర్తుంచుకొండి

పత్రికారంగం పట్ల ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి

నేషనల్ హెరాల్డ్ పత్రిక సంపాదకులు
శ్రీ యమ్. చలపతిరావు విమర్శ

భోపాల్, ఏప్రిల్ 21

"పత్రికా రంగం ఎదుర్కొంటున్న సమస్యలు చాలా తీవ్రమయినవిగా వున్నా, ఆ సమస్యలను పరిష్కరించటంలో, ప్రభుత్వం ఉపేక్షా వైఖరిని, కాలయాపనా పద్ధతిని అవలంబిస్తున్నది"ని 'నేషనల్ హెరాల్డ్' పత్రికా సంపాదకులు శ్రీ యమ్. చలపతిరావు మొన్న విమర్శించారు.

అఖిలభారత పత్రికా రచయితల మహాసభను ఆయన ప్రారంభిస్తూ, పత్రికా రంగం సమస్యలపై ప్రెస్ కమిషన్ ఇచ్చిన నివేదికలను ప్రభుత్వం తల క్రింద పెట్టుకుని నిద్రిస్తున్నది కాని, వాటిని చదవటం లేదని అన్నారు.

ప్రెస్ కౌన్సిల్ పని తీరును శ్రీ చలపతిరావుతోపాటు పత్రికా రచయితల సమాఖ్య అధ్యక్షులు శ్రీ వి. యన్. ధూమ్‌రావు విమర్శించారు.

అమలు జరుపకుండా పడివున్న అనేక ప్రెస్ కౌన్సిల్ సిఫారసులను శ్రీ చలపతిరావు తమ ప్రసంగంలో పేర్కొన్నారు.

"అభ్యంతరకరమైన వ్రాతలు" గురించిన నిర్వచనంతో, అటువంటి వ్రాతలను నిషేధించే బిల్లు తేవాలిసిందిగా కౌన్సిల్ సిఫారసు చేసిందని అన్నారు.

"వేతనాలనుబట్టి ధర నిర్ణయించాలనే ప్రతిపాదన" ఒక ప్రహసనంగా తయారయిందని విమర్శించారు. ఈ విషయంలో ప్రభుత్వం చేసిన చట్టాన్ని కోర్టు కొట్టివేసిన తర్వాత ప్రభుత్వం ఏచర్యా తీసుకోకపోవటం గమనించదగ్గ విషయమని చెప్పారు"

ప్రెస్ కౌన్సిల్ ఏర్పాటు విషయంలో ప్రభుత్వ విధానం అతుకుల బొంత అని చెబుతూ ప్రెస్ కౌన్సిల్ విషయంలో, పార్లమెంటరీ సలహాసంఘం రూపొందించిన నివేదికను జాగ్రత్తగా పరిశీలించ వలసిందిగా శ్రీ రావు పత్రికా రచయితలను కోరారు.

సంపాదకులను, మిగతా పాత్రికేయుల నుంచి వేరుచేయటం ద్వారా, పత్రికా రచయితల గొంతు నొక్కారని అన్నారు.

సంపాదకులకు, మిగిలిన పాత్రికేయులకు మధ్య కృత్రిమగోడను నిర్మించారని అన్నారు.

గుత్త పెట్టుబడి దారుల బారినుండి పత్రికా రంగాన్ని కాపాడటానికి పాత్రికేయులు నడుం కట్టాలని, దానితోపాటే దిన దినం దిగజారి పోతున్న వృత్తి విలువలను కాపాడుకోవటానికి గట్టి కృషిచేయాలని అన్నారు.

ప. గో. జిల్లా నిడదవోలులో 9.4.69 వ తేదీన ప్రముఖ రంగస్థల నటుడు శ్రీ సుంకర వెంకట్రావు కాలధర్మం చెందినారు. వయస్సు 44 సంవత్సరాలు. వీరు చిన్న తనంనుండి నాటక కళలోనే జీవించినవారు. "భీముడు", "పాపారాయుడు" పాత్రలలో వీరు ఖ్యాతి గడించారు. కొంతకాలం స్వంతంగా ఒక నాటక సమాజంను నడిపినారు.

ఇటీవల శ్రీ కర్రి అబ్బులు, శ్రీ కాగిత సుబ్బారావులు నడిపే శ్రీ దుర్గా వెంకటేశ్వర నాట్యమండలిలో చేరి శేష జీవితాన్ని ముగించారు. వీరి మృతికి సంతాపం తెలియజేస్తూ శ్రీ దుర్గా వెంకటేశ్వర నాట్యమండలి ఒక ప్రదర్శనను ఇచ్చి అతని కుటుంబానికి ఆర్థికంగా సహాయం చేయాలని తీర్మానించారు. అతని కుటుంబానికి ఒక సానుభూతి సందేశం అందజేసినారు.

వీరికి భార్య ఇద్దరు కుమారులు కలరు.

ఎర్నాకులంలో 5గురు కాంగ్రెసు సభ్యుల సస్పెండు

కొచ్చిన్, ఏప్రిల్ 21

ఎర్నాకులం జిల్లాకు చెందిన 5 గురు కాంగ్రెసు సభ్యులను కాంగ్రెసుపార్టీ నుండి తొలగించివేసినట్లు జిల్లా కాంగ్రెసు కమిటీ నిన్న ప్రకటించింది.

కొచ్చిన్ కార్పొరేషన్ ఎన్నికలలో వీరు ఇండిపెండెంటు అభ్యర్థులుగా పోటీ చేయుచున్నందువల్ల సస్పెండు చేయటం జరిగింది. మే 21 వ తేదీన ఎన్నికలు జరుగనున్నాయి.

సాధువు అరెస్టు

పాట్నా, ఏప్రిల్ 20

తన సంచిలో ఒక బాలుని మృతదేహం తీసుకెళుతున్న సాధువును నిన్న ఇక్కడ అరెస్టు చేసినట్లు పోలీసులు నేడు చెప్పారు.

కాళికాదేవిని మెప్పించడానికి బాలుని దేహంపై పూజ జరపాలని తాను భావించానని సాధువు చహోర్‌మల్ చెప్పారు.

ప్రముఖ
రంగస్థల నటుడు
శ్రీ సుంకర
వెంకట్రావు
9-4-69 న
నిడదవోలులో
అకాల మృతి
చెందారు.

బొమ్మల కథలు	—ఎన్. రాష్లావ్	0-90
కానుక		0-50
మాయగుర్రం మేటిగుర్రం		0-50
కాకి తెల్లరెక్కల కాకి		0-45
కరిబాజీ మరుగుజీ	—ఎస్. మర్షాక్	0-50
మేక మూడు మేకపిల్లలు	—ఇవాన్ క్రింగా	0-25
మత్స్యా మిత్రుని మంత్రమహిమ	—ఎమ్. బులాతొవ్	0-70
జీవిత కీపులు	—ఇ. దయాషిన్	0-65
నక్కా– పుంజుపిల్లా	—వి. బియాన్కి	0-45
మాష ఎలుగుబంటి		0-35
గమ్మత్తు బొమ్మలు	—ఎ. లాప్టెవ్	0-55
చిట్టి జంతువులు	—ఎగ్లే యే చరూషిన్	0-45
ఏడురంగుల పువ్వు	—వలెంటీన్ కటాయేవ్	0-50

పోస్టేజి అదనం — ప్రతులకు
విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, ఏలూరురోడ్, విజయవాడ-2
విశాలాంధ్ర బుక్ హౌస్, సుల్తాన్ బజార్, హైదరాబాద్

ADMARK

ఇంటింటికి గుడ్ల సరఫరా పథకం

విజయవాడ పౌల్ట్రి అధికారి వెల్లడి

(విశాలాంధ్ర విలేకరి)

విజయవాడ, ఏప్రిల్ 21

విజయవాడలో ఇళ్ళవద్దకు తెచ్చి గుడ్లను సరఫరాచేసే పథకం ప్రస్తుతం పరిశీలనలో వుందని విజయవాడ ముత్యాలంపాడు పౌల్ట్రి మార్కెటింగ్ అధికారి డాక్టర్ రామారావు విశాలాంధ్ర విలేకరికి తెలియచేశారు.

ప్రస్తుతం రోజూ 3 వేల వరకు గుడ్లను రిక్షాద్వారా అమ్మటం జరుగుతున్నదని ఆయన తెలిపారు.

విజయవాడ పట్టణంలో అలంకార్ టాకీస్ వద్ద, కొత్తపేట మార్కెట్, వెటర్నరీ ఆస్పత్రిలో–మొత్తం 3 చోట్ల ప్రభుత్వ అధ్వర్యంలో నడుపబడుతున్న గుడ్ల అమ్మకపు కేంద్రాలున్నాయి

పట్టణంలోని అన్ని ప్రాంతాలవారికి ఇళ్ళవద్ద అందుబాటుగా ఉంచేందుకు రిక్షా సర్వీసు ఏర్పాటుచేసి గుడ్లను అమ్మే పథకం ప్రస్తుతం పరిశీలనలో వుంది.

రోజూ కొన్ని ప్రాంతాల చొప్పున వారంలో రెండు మూడుసార్లు ఆ ప్రాంతాలలో అమ్మేందుకు ఏర్పాటు చేస్తారు.

అయితే పట్టణంలో కనీసం 500 మంది అలా కొనేందుకున్నట్లయితేనే ఇది సాధ్యపడుతుంది. ఇప్పుడు మొదటిరకం గుడ్లు 25 పైసలు, రెండవరకం 24 పైసలకు అమ్ముతున్నారు,

ఈ పథకం పట్ల ఆసక్తి ఉన్నవారు ముత్యాలంపాడు పౌల్ట్రి మార్కెటింగ్ అధికారిని సంప్రదించవచ్చు.

కేరళ ఉగ్రవాదుల మహాసభ ప్రారంభం

కన్ననూరు, ఏప్రిల్ 20

కేరళ ఉగ్రవాదుల రాష్ట్రస్థాయి మహాసభను ఆంధ్ర ఉగ్రవాదుల నాయకుడు శ్రీ తరిమెల నాగిరెడ్డి నేడిక్కడ ప్రారంభించారు.

రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలనుండి దాదాపు 250 మంది ప్రతినిధులు మహాసభకు హాజరయ్యారని కేరళ ఉగ్రవాదుల సమన్వయ కమిటీ కన్వీనర్ శ్రీ కె. పి. ఆర్ గోపాలన్ తెలియచేశారు.

మహాసభకు ఈ క్రింది సభ్యులతో అధ్యక్ష వర్గాన్ని ఎన్నుకున్నారు. యస్. డి. థామస్ (ఎర్నాకులం) పి. కె. కరుణాకరన్ (అలెప్పి), డేవిడ్ (తిరువనంతపురం). స్టీరింగు కమిటీ కూడా ఎన్నుకోవటం జరిగింది

మహాసభలో ప్రవేశపెట్టిన నివేదికపై చర్చ పూర్తికాలేదని తిరిగి రాత్రికి సమావేశమై చర్చించగలమని శ్రీ గోపాలన్ తెలియచేశారు.

చిత్ర పరిశ్రమచే రు. 24 లక్షల విదేశీ ద్రవ్య సంపాదన

న్యూఢిల్లీ ఏప్రిల్ 21

విదేశీ ద్రవ్య సముపార్జనలో భారతీయ చలనచిత్ర పరిశ్రమ ఉన్నత స్థానాన్ని పొందింది.

ఇండియన్ మోషన్ పిక్చర్ల ఎగుమతి కార్పొరేషన్ 1964లో రు. 60,319 సంపాదించగా 1967 68 లో రు 24 లక్షల 44 వేలు సంపాదించింది.

కేంద్ర సర్వీసుల్లో రాష్ట్రాలకు కోటా

పరిపాలనా సంస్కరణల కమిషన్ అధ్యక్షులు శ్రీ హనుమంతయ్య సూచన

బెంగుళూరు, ఏప్రిల్ 21

కేంద్రసచివాలయంలోని కొన్ని సాధారణ వుద్యోగాలకు వివిధ రాష్ట్రాలనుండి కోటా పద్ధతిపై అభ్యర్థులను ఎన్నిక చేయాలని పరిపాలనా సంస్కరణల సంఘం అధ్యక్షుడు శ్రీ కె. హనుమంతయ్య సూచించారు.

పరిపాలనా సంస్కరణల సంఘం నివేదికపై పత్రికావిలేకరులతో మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్రప్రభుత్వాల వుద్యోగుల జీతాలలో తేడా వున్నదన్నారు. ఈ తేడాలవల్ల రాష్ట్రాలు అధికభారాన్ని మోయవలసి వస్తుందన్నారు. ఈ సమస్యాపరిష్కారానికి కేంద్ర సచివాలయంలోని కొన్ని సాధారణమైన వుద్యోగాలకు అభ్యర్థులను రాష్ట్రాలనుండి ఎన్నుకోవాలన్నారు.

యూనియన్ పబ్లిక్ సర్వీసు కమిషన్ గాని, రిక్రూట్‌మెంటు కమిటీ గాని కోటా పద్ధతిపై అభ్యర్థులను ఎన్నిక చేయగలదన్నారు.

ప్రభుత్వ ఉద్యోగం చేయుచున్న యువతి తన తోటి ఉద్యోగస్థుని వివాహమాడితే ఆమె రాజీనామా చేయాలనేది మీ అభిప్రాయమా? అని విలేకరులు ప్రశ్నించారు. ఆ యువతిని రాజీనామా చేయమని తాము నిర్బంధించబోమని అన్నారు. అలాంటి సందర్భాలలో ఆమె భర్తయైనా రాజీనామా చేయవచ్చునని అన్నారు. సాధ్యమైనన్ని హెచ్చు కుటుంబాల వారికి ప్రభుత్వ సర్వీసులలో వుద్యోగాలు కల్పించటమే తమ అభిమత మన్నారు.

కాంగ్రెసుపార్టీకి బీహార్ హరిజన నాయకులరాజీనామా

జలంధర్, ఏప్రిల్ 21

జలంధర్, హోషియాపూర్ జిల్లాలకు చెందిన 10 మంది హరిజన కాంగ్రెస్ నాయకులు కాంగ్రెసుపార్టీకి తాము రాజీనామా చేస్తున్నట్లు నిన్న ప్రకటించారు.

అంటరానితనాన్ని ప్రోత్సహిస్తూ ప్రసంగించిన పూరీశంకరాచార్యులను బంధించుటకు బీహారు ప్రభుత్వం నిరాకరించటం ద్వారా తామీచర్య తీసుకొన్నట్లు ప్రకటించారు.

పంజాబ్ కాంగ్రెసుపార్టీలోని హరిజన విభాగం కార్యదర్శి శ్రీ అనంతరామ్‌బుద్దిన్ పత్రికా విలేకరుల సమావేశంలో పై విషయాన్ని ప్రకటించారు. తమ గౌరవాన్ని రక్షించలేని పార్టీలో తాముండదలచలేదని ఆయన అన్నారు.

రెండువారాల తరువాత హరిజనుల సదస్సు జరుగుతుందని. ఆ సదస్సులో కాంగ్రెస పార్టీకి పూరీశంకరాచార్యులపై ఆక్షేపణ తెలియచేయటం జరుగుతుందన్నారు సదస్సు ఎక్కడ జరిగేది తరువాత నిర్ణయిస్తామన్నారు.

ఉక్కు దిమ్మల ఎగుమతుల తగ్గింపు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 21

ఇంజనీరింగ్ పరిశ్రమలో ఉక్కు కొరత ఏర్పడినిమిత్తం ఉక్కు దిమ్మల ఎగుమతులను తగ్గించివేయుటకు ప్రభుత్వం నిశ్చయించినట్లు ఉక్కు, భారీ ఇంజనీరింగ్ పరిశ్రమల మంత్రి శ్రీ కె సి పంత్ నిన్న తెలియచేశారు.

బనస్కాంతలో శ్రీ కృష్ణమీనన్ ప్రచారం

ఇండిపెండెంటు అభ్యర్థికి తోడ్పాటుగా

అహమ్మదాబాద్, ఏప్రిల్ 20

మాజీ రక్షణమంత్రి శ్రీ వి. కె. కృష్ణమీనన్, సోమవారంసాయంత్రం అహమ్మదాబాద్ వస్తారు. అక్కడనుండి పలన్‌పూర్ వెడతారు.

బనస్కాంత పార్లమెంటరీ నియోజకవర్గంనుండి లోక్‌సభకు జరిగే పోటీలో పాటిల్‌పై పోటీచేస్తున్న హిమ్మత్‌సింగ్‌జీ ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారు.

గుజరాత్ యస్. యస్. పి. విజ్ఞప్తి

బనస్కాంత్ ఉప ఎన్నికలలో త్రికోణ పోటీ నివారించడానికి వీలుగా ఏకం కావలసిందిగా స్వతంత్రపార్టీ అభ్యర్థి మనూభాయ్ అమర్సే, ఇండిపెండెంటు అభ్యర్థి హిమ్మత్‌సింగ్‌జీలకు గుజరాత్ యస్.యస్.పి. నేడు విజ్ఞప్తి చేసింది.

ముక్కోణపు పోటీ నివారించడానికి పరిష్కారమార్గం కుదరకపోతే ఎస్. ఎస్. పి వైఖరి ఏమిటో తెలియచేయడానికి 5 గురు సభ్యులతో ఒక ఉపసంఘాన్ని రాష్ట్ర యస్. యస్. పి. కార్యవర్గం నియమించింది.

బనస్కాంతలో కరువు పరిస్థితి

బనస్కాంత ఉపఎన్నికల ప్రచారంలో కరువుపరిస్థితి సమస్య తీవ్రంగా వుంటున్నదని యు. యన్. ఐ. విలేకరి వ్రాస్తున్నాడు.

9 లక్షలమంది జనాభావున్న ఈ ప్రాంతం దీర్ఘ కాలంగా కరువుకు గురిఅవుతున్నది.

కాంగ్రెస్ అభ్యర్థిగా శ్రీ యస్. కె. పాటిల్ పోటీచేస్తున్న విషయం పాఠకు లెరిగినదే.

బెంగాల్ జూట్ కార్మికుల పోరాట సన్నద్ధత

కలకత్తా, ఏప్రిల్ 20

వేతనాలు పెంచాలన్న డిమాండ్‌తో సహా 10 అంశాల కోర్కెల పత్రాన్ని మేనేజ్‌మెంట్ అంగీకరించకపోతే మే 30 నుండి బెంగాల్‌లో 2 లక్షలమంది జనపనార కార్మికులు ఉద్యమం ప్రారంభించాలని పశ్చిమ బెంగాల్ చటకల్ మజ్దూర్ యూనియన్ నేడు హెచ్చరించింది

కలకత్తా మైదాన్‌లో జరిగిన జనపనార కార్మికుల బహిరంగసభలో ఈ విషయాన్ని కమ్యూనిస్టు పార్లమెంటు సభ్యుడు శ్రీ ఇంద్రజిత్‌గుప్తా ప్రకటించారు

ఈ కార్మికుల యూనియన్ ఎ. ఐ. టి యు సి. కి అనుబంధించబడింది.

శ్రీ ఇంద్రజిత్‌గుప్తా తరువాత యు.ఎన్.ఐ విలేకరితో మాట్లాడుతూ మే 30 నుండి జనపనార పరిశ్రమలో నిరవధిక సమ్మెకు పిలుపు ఇవ్వబడవచ్చునని అన్నారు.

మే 30 నుండి ప్రచార ఉద్యమం ప్రారంభించాలన్న తీర్మానాన్ని బహిరంగసభ ఆమోదించింది



పై పైకి, ఇంకా, ఇంకా పైకి

పైకి, పై పైకి. స్టేట్ బ్యాంక్ డిపాజిట్లు పై పైకి, పోతూనే ఉండినాయి గత సంవత్సరం. ఈ రోజు మాట చెప్పాలంటే డిపాజిట్లు మొత్తం రూ. 1,100 కోట్లు దాటాయి శాఖలు 1,660కి పైగా పెరిగినాయి. దీని అర్థం ఏమంటే లక్షలాది జనులకు, ముఖ్యంగా, మారుమూలల్లో జీవించేవారికి ఆధునిక బ్యాంకింగ్ సౌకర్యాలు కల్పించబడుతున్నాయి. మీకు వాడియైన సేవ. మీకు కావలసినప్పుడు సేవ. మీకు ఎక్కడ సేవ కావాలో అక్కడ.

స్టేట్ బ్యాంక్ సేవ నిమిత్తం

గెలుపుదార్లకు అభినందనలు!

లైఫ్‌బాయ్-మర్ఫీ బంతి ఎక్కడ పోటీ

10 మొదటి బహుమానాలు (మర్ఫీ 'ముసాఫిర్' ట్రాన్సిస్టర్లు) గెలిచినవారు!

■ 1. హిమత్‌లాల్ సి. షా, మద్రాసు-1 ■ 2. బి. యె. సువర్ణ, బొంబాయి-22 ■ 3. ఎస్. ఆర్. కామత్ కొల్హాపూరు ■ 4. ఎల్టి. పి. కె. రామస్వామి, కొచ్చిన్-4 ■ 5. జోషి కేశవ్ శంకర్, రత్నగిరి ■ 6. మేరీ ఫెర్నాండెస్, బొంబాయి ■ 7. ముమ్తాజ్ హసన్, నాగపూరు ■ 8. ఇబ్రహీమ్ యు. బావా, మంగుళూరు-5 ■ 9. సుందరి అమ్మాళ్ మద్రాసు-5 ■ 10. జోషీ కేశవ్ శంకర్, రత్నగిరి.

15 రెండవ బహుమానాలు (మర్ఫీ 'మినిమాస్టర్ 3' ట్రాన్సిస్టర్లు) గెలిచినవారు!

■ 1. మేరీ ఫెర్నాండెస్, బొంబాయి ■ 2. వి. కె. వెంకట రమణ సామి, ఈరోడ్. ■ 3. ఎస్. సుచరిత, త్రివేంద్రం ■ 4. పెస్లియా ఎమ్. లెవిస్, బరోడా-2 ■ 5. డా. పి. ఎల్. రసనె, ఎమ్.బి.బి.ఎస్., పూనా-2 ■ 6. వి. శేషయ్య, తణుకు ■ 7. అబ్దుల్‌గని కరీమ్, సతారా ■ 8. శశికళ ఆర్. కామత్ కొల్హాపూర్ ■ 9. రింటూ మిత్రా, పూనా-7 ■ 10. షానాజ్ ఖలీద్, బొంబాయి-58 ■ 11. మనోహర్ నాయక్ బొంబాయి-19 ■ 12. మొహమ్మద్ హబీబ్ నజ్‌ముద్దీన్ కడీవాలా, పూనా ■ 13. సునంద ఎస్. ఖకుర్దికర్ పూనా-2 ■ 14. బాబులాల్ చునీలాల్ మెహతా, భవానీనగర్ ■ 15. సంజయ్ దేశ్‌పాండె, నాందేడ్.

ఎవ్వరు ఇంత దీర్ఘకాలానికి బంతి ఎక్కడ వుందనో తెలిపింది. ఊహించుట వినోదం, కాదా?

గెలుపుదార్లందరికీ తపాలాద్వారా తెలుపబడును.



లైఫ్‌బాయ్ మర్ఫీ పోటీ కుప్పల కొలదీ ప్రవేశ పత్రములను రప్పించింది. పోటీదారుల ఉత్సాహంవల్ల, నిజంగా లైఫ్‌బాయ్ మరియు మర్ఫీ వ్యాపారుల అమూల్య సహకారం వల్లనే. మీ కందరికీ ధన్యవాదాలు.

ఆరోగ్యానికి లైఫ్‌బాయ్

హిందుస్థాన్ లీవర్ వారి విశిష్ట ఉత్పత్తి

లింటాస్-L. 57-2147

విశాలాంధ్ర విజ్ఞాన సమితి తరపున ప్రింటర్ అండ్ పబ్లిషర్ - టి. వెంకటేశ్వరరావు. ఎడిటర్: వేములపల్లి శ్రీకృష్ణ. ముద్రణ: స్వతంత్ర ఆర్టుప్రింటర్స్, విజయవాడ-4.

విశాలాంధ్ర

1969 ఏప్రిల్ 22 మంగళవారం

సమ్మె హక్కుపై దాడి

ప్రభుత్వోద్యోగుల సమ్మె హక్కును రద్దు చేయాలని పరిపాలనా సంస్కరణల సంఘం చేసిన సిఫారసు అత్యంత ప్రమాదకరమూ, అభివృద్ధినిరోధకమూ. ఈ సిఫారసును గనక ప్రభుత్వం ఆమోదిస్తే నియంతృత్వ దిశగా ప్రభుత్వం ఒకఅడుగు వేసినట్లే.

ఉద్యోగులకు పింఛను సౌకర్యాలు పెంచాలని, వారి సమస్యలను పరిష్కరించేందుకు కొత్త యంత్రాంగం ఏర్పరచాలని, ఉన్నత పదవులు పొందేందుకు అవకాశాలు కల్పించాలని, రహస్య ఫైళ్ళు రద్దుచేయాలని ఏవేవో సూచనలు ఈ కమిషన్ చేసి ఉండవచ్చు.

కాని "నేను సమ్మె చేయబోను అని ఉద్యోగిచే పనిలో ప్రవేశించేముందు హామీ తీసుకోవాలనే" ఒక విషతుల్యమైన సిఫారసుతో ఇతర సూచనలన్నీ నిరర్థకాలూ, బూటకాలూ అవుతున్నాయి.

పెట్టుబడిదారీ పంథా దుష్ఫలితాలలో నిరుద్యోగ సమస్య అతి ప్రధానమైనది. ఇందుకు కార్మికవర్గమూ, మధ్యతరగతి వర్గమూసమానంగా నేగురిఅవుతున్నాయి. ఒకవైపునఎంతోఆందోళన చేసినమీదట కాస్తో కూస్తో వేతనాలు పెంచుతూ, మరొకవైపున ధరలను అదుపులో పెట్టేందుకు నిరాకరిస్తూ, పరోక్ష పన్నుల విధింపుద్వారా ధరల పెరుగుదలకు కారణమౌతూ ఆచరణలో కార్మికుల, ఉద్యోగుల నిజవేతనాల్లో ప్రభుత్వం కోత పెడుతున్నది.

ఈ దోపిడీకి వ్యతిరేకంగానే ఉద్యోగులు పదే పదే తమ హక్కులకై ఆందోళన చేయవలసి వస్తోంది. సమ్మెలకి సైతం తలపడుతున్నారు.

కార్మిక మధ్యతరగతి తదితర ప్రజానీకం బాధలకు పెట్టుబడిదారీ పంథా ప్రధాన శత్రువు. ఈవాస్తవాన్ని మరుగుపరచేందుకుగాను అభివృద్ధినిరోధక శక్తులు, కుల, మత, ప్రాంతీయ విద్వేషాలను రెచ్చగొడుతున్నారు.

ప్రత్యేక తెలంగాణా-రాష్ట్రం ద్వారా తమకేదో ఒరుగుతుందని తెలంగాణాయన్ జి వో. లు కొందరు ఆందోళన చేయటం ఎంతటి ఆత్మహత్యా సదృశమో ఈ సందర్భంలో గుర్తు చేయవలసి ఉంది.

కార్మికులకు మధ్య తరగతి ఉద్యోగులకు మధ్య విభజన కల్పించటం, ఉద్యోగులలో సైతం ప్రాంతీయ విభేదాలు రెచ్చగొట్టటం, ఆ పిమ్మట ఒక్కొక్కరినీ విడదీసి అణచివేయటం, సమ్మెహక్కును రద్దుచేయటంఇదంతా పెట్టుబడిదారీ భూస్వామ్య కుత్సిత రాజనీతిలో ఒక భాగం.

ఇందులో భాగంగానే హనుమంతయ్య కమిటీ పై సిఫారసు చేసింది. ఇందులో భాగంగానే, బొంబాయిలో శివసేనను ప్రయోగించి మహారాష్ట్రేతరులపై అభివృద్ధి నిరోధక వర్గాలు దాడులు చేయించాయి. ఇందులో భాగంగానే తెలంగాణాలోని భూస్వామ్య శక్తులు, బిర్లాల వంటి గుత్త పెట్టుబడిదారులు నైజాం వారసులు, ప్రత్యేక తెలంగాణా వేర్పాటు ఉద్యమానికి పెద్ద ఎత్తున మద్దతిస్తున్నారు.

ప్రజానీకాన్ని అణచటానికి, గందరగోళ పరచటానికి, విభజనలను విద్వేషాలను కల్పించటానికి పెట్టుబడిదారీ భూస్వామ్య శక్తులకు, ఒక పథకం ఉంది. ఆ పథకం ఒక్కొక్కచోట, ఒక్కొక్క రాష్ట్రంలో ఒక్కొక్క రూపంలో వ్యక్తమౌతూ ఉంటుంది.

ఇందుకు ప్రతిగా, కార్మిక మధ్య తరగతి, తదితర ప్రజాతంత్ర శక్తులకు సైతం ప్రత్యామ్నాయ పథకం, ఆలోచన అవగాహనలతో ముందుకు సాగాలి. అది లోపించినపుడు వేర్పాటు ఉద్యమాల విషబీజాలలో మధ్య తరగతి ఉద్యోగులు, కార్మికులు సైతం తాత్కాలికంగా కొట్టుకుపోతూవుంటారు.

ఉద్యోగుల సమ్మెహక్కును రద్దుచేసే దుష్ట సంకల్పం. కేంద్రంలో పొంచిఉన్నది. సమయం కొరకు వేచిఉన్నది. ప్రభుత్వోద్యోగులందరూ ఈ ప్రమాదాన్ని గుర్తించాలి. ఆంధ్ర, తెలంగాణా అనే విభేదాలుమాని సమైక్య రాష్ట్రంలో, సమైక్యంగా ఈ దాడిని ప్రతిఘటించేందుకు పూనుకోవాలి.

ఈ సిఫారసును ప్రభుత్వం ఆమోదిస్తే తెలంగాణా, ఆంధ్ర మాత్రమే కాదు, యావద్భారతంలోని ప్రభుత్వోద్యోగుల గొంతులకు ఉరితాడు పడినట్లే.

ప్రాంతీయ విద్వేషాలకతీతం ఐనకార్మిక మధ్య తరగతి ఐక్యత ఒక్కటే ఈ దాడిని సమర్థవంతంగా ఎదుర్కొగలదు.

సమైక్య ఆంధ్రప్రదేశ్ రక్షణావశ్యకత

కడప బహిరంగసభలో పలువురి వివరణ

కడప, ఏప్రిల్ 21

తెలంగాణా వేర్పాటు ధోరణులను వ్యతిరేకిస్తూ, విచ్ఛిన్నకుల కుటిల రాజకీయాలను బహిర్గతంచేస్తూ, సమైక్య ఆంధ్రప్రదేశ్ పరిరక్షణావశ్యకతను నొక్కి చెబుతూ కడపలో 13 వ తేదీన మహాకవి పుట్టపర్తి ఆధ్వర్యాన గొప్ప బహిరంగసభ జరిగినది.

ప్రత్యేక తెలంగాణా వుద్యమంయొక్క స్వరూప స్వభావాలను అర్థం చేసుకోవలననే కుతూహలంతో అనేకమంది విద్యార్థులు, న్యాయవాదులు, ఉపాధ్యాయులు, యన్. జి. ఓ. లు సభకు హాజరైనారు.

వివిధ వర్గాలకుచెందిన 2 వేల మంది ప్రజానీకం హాజరైన ఈ బహిరంగసభలో జిల్లా ఉపాధ్యాయ ఫెడరేషన్ కార్యదర్శి శ్రీ కె. నాగముని, జిల్లా సెకండరీ టీచర్సు గిల్డు కార్యదర్శి శ్రీ పి. కృష్ణమూర్తి, జిల్లా కమ్యూనిస్టుపార్టీ నాయకులు శ్రీ జె. వెంకట్రామరెడ్డి, శ్రీ యన్. శివరామరెడ్డి, ప్రఖ్యాత కవి శ్రీ వై. సి. వి. రెడ్డి, జిల్లా ట్రేడ్ యూనియన్ నాయకులు శ్రీ సి. చంద్రశేఖర రెడ్డి ఉపన్యసించారు.

ఉపన్యాసకులందరూ తెలంగాణాకు జరిగిన అన్యాయాలను అభివర్ణిస్తూ, తెలంగాణా రక్షణలను అమలు పరపడంలో ప్రభుత్వం విఫలమైనందుకు తీవ్రంగా విమర్శించారు.

మహాకవి పుట్టపర్తి నారాయణాచార్యులు తమ అధ్యక్షోపన్యాసంలో ఆంధ్రజాతి పుట్టుపూర్వోత్తరాలను గూర్చి వివరించారు.

అనేక శతాబ్దాల తర్వాత యెన్నో నోముల పంటగా, యెంతో త్యాగం ఫలితంగా సాధించబడిన సమైక్య ఆంధ్రప్రదేశ్‌ను కొందరు స్వార్థపరులు అమాయకులైన విద్యార్థులను రెచ్చగొట్టి ముక్కలు చింపిన విస్తరిలాగా చేయ సంకల్పిస్తున్నారంటూ పుట్టపర్తి యెంతో ఆవేదనను వ్యక్తంచేసినారు. చరిత్రగతిని మార్పుచేయ సంకల్పించే వారందరూ చరిత్రలో హీనులవుతారు. చరిత్రమాత్రం ముందుకుపోయి తీరుతుందని తమ అధ్యక్షోపన్యాసాన్ని ముగించారు.

జిల్లా ఉపాధ్యాయ సంఘాల నాయకులు శ్రీ పి. కృష్ణమూర్తి, శ్రీ కె. నాగముని మొత్తం ఆంధ్ర ప్రదేశ్‌లో వుంటున్న ఉపాధ్యాయ సంఘాలన్నీ ప్రత్యేక తెలంగాణా నినాదాన్ని ఖండిస్తున్నవని, తెలంగాణా కివ్వబడిన రక్షణలను అమలు జరపడంలో దొర్లిన అక్రమాలను తొలగించుటకు సత్వరమే ప్రభుత్వం తమ చర్యలు తీసుకోవాలన్నారు.

ప్రఖ్యాత కవి శ్రీ వై. సి. వి. రెడ్డి ఉపన్యసిస్తూ "పాలక వర్గ పార్టీలో కొందరు, ప్రజల్లో కొద్దిమందికి తెలంగాణా విడిపోవడం మంచిదేననే అభిప్రాయం కలిగింది. ఇది దారుణమైనది. వ్యక్తి ఎక్కడైనా తనకు తోచిన రీతిని ఏదో ఒక వృత్తితో జీవించవచ్చు, కానిమనం పెంచి పోషించుకొన్న సంస్కృతి సంపద విచ్ఛిన్నం కావటం అతి ప్రమాదకరమైనది అన్నారు.

తర్వాత జిల్లా ట్రేడ్ యూనియన్ కౌన్సిల్ అధ్యక్షులు శ్రీ సి. చంద్రశేఖరరెడ్డి గారు కాంగ్రెసు నాయకుల ద్వంద్వ నీతిని నిశితంగా విమర్శించినారు.

జిల్లా కమ్యూనిస్టు నాయకులు జె. వెంకట్రామరెడ్డి యన్. శివరామరెడ్డి విశాలాంధ్ర కొరకై కమ్యూనిస్టుపార్టీ నడిపిన వీరోచిత పోరాటాలను గూర్చి వివరించినారు.

మొత్తం ఆంధ్రదేశంలోని అన్ని వర్గాల ప్రజలు ముక్తకంఠంతో రాజీనామాయివ్వాలని కోరుతున్నా కుర్చీకి అంటిపెట్టుకొని వుంటున్న బ్రహ్మానందరెడ్డి మంత్రివర్గం వెంటనే రాజీనామా యివ్వాలని డిమాండ్ చేశారు.

జాబిరెడ్డిగూడెంలో విశాలాంధ్ర సమైక్యత సదస్సు

సూర్యాపేట ఏప్రిల్ 21

నల్లగొండజిల్లా, సూర్యాపేట తాలూకా జాబిరెడ్డిగూడెంలో ఏప్రిల్‌నెల 14 వ తేదీన విశాలాంధ్ర సమైక్యతా సదస్సు జరిగింది. సదస్సుకు శ్రీ కె. బుచ్చిరాంరావు అధ్యక్షత వహించారు.

వివిధ గ్రామాల నుండి ప్రతినిధులు వచ్చారు. శ్రీయుతులు భీమిరెడ్డి నరసింహారెడ్డి, మల్లు వెంకట నరసింహారెడ్డిగారలు ఆంధ్రప్రదేశ్ సమైక్యంగా ఉండాల్సిన ఆవశ్యకతను గురించి వివరించారు. ప్రత్యేక తెలంగాణా నినాదం హానికరమని, విశాలాంధ్ర సమైక్యత వర్ధిల్లాలని, కాంగ్రెసు ప్రభుత్వం గద్దెదిగాలని ప్రవేశపెట్టిన తీర్మానం ఏకగ్రీవంగా ఆమోదింపబడింది.

ప్రజా ప్రదర్శన

ఆ రాత్రి వేయిమందికిపైగా ప్రజలు డప్పులు, కొమ్ములు మొదలగు వాయిద్యాలతో ఊరేగింపు జరిపారు. తదనంతరం గ్రామ పంచాయితీ ఆఫీసుముందు జరిగిన బహిరంగ సభకు శ్రీ బుచ్చిరాంరావు అధ్యక్షత వహించారు. శ్రీయుతులు భీమిరెడ్డి నరసింహారెడ్డి (ఎం. ఎల్. ఏ.), మల్లు వెంకట నర్సింహారెడ్డి, కాకి వంద్రారెడ్డి బి. కుశలవరెడ్డి వి. బుచ్చిరాములు, బి. జానయ్య మాట్లాడారు.

కె. సి. కెనాల్‌క్రింద రెండవ పంటకు నీరు

శ్రీ పూల సుబ్బయ్య ప్రకటన

మార్కాపురం, ఏప్రిల్ 21

ఆంధ్ర ప్రదేశ్ రైతుసంఘ కార్యదర్శి, శాసన సభ్యుడు శ్రీ పూల సుబ్బయ్య క్రింది విధంగా ప్రకటిస్తున్నారు.

ప్రతి సంవత్సరం కె. సి. కెనాలుక్రింద రెండవ పంటకు నీరు సకాలంలోనారుమళ్ళకు వదలరు. ఈ సంవత్సరంకూడా నవంబరు 28 తేదీకే కాల్వలక్రింద ఆయకట్టను నిర్ణయిస్తామన్నది. డిసెంబరు నెల 24 వరకు పోయింది. అందుచేత రైతాంగం రెండవ పంటకు నారుమళ్ళు పోసుకొనుటలో ఆలస్యమైంది.

కొన్ని కాల్వల క్రింద జనవరి 10-15 వరకు నారు పోయలేక పోయారు. ఈ కారణముచేత నాటు ఆలస్యంగా వేసుకొన్నారు. కాల్వలకు నీరు ఏప్రిల్ 30 వరకే వస్తాయని అధికారులు చెప్పుచున్నారు.

నీరు కనీసం మే నెల 10 వ తేదీ వరకైనా కాల్వలలో ప్రవహించని యెడల నూటికి 25 శాతం భూమిలోని పైరు దెబ్బతింటుంది. అసలే కరువుతోబాధపడే రాయలసీమ ప్రాంతానికి పైరు పూర్తిగా పండక పోతే తీవ్ర పరిస్థితులు యేర్పడుతాయి. కాన కర్నూలు కలెక్టరు తత్సంబంధమైన ఇంజనీయర్లకు వెంటనే కాల్వలలో మేనెల 10 వ తేదీ వరకు పారేటట్లు ప్రభుత్వం వుత్తర్వులు జారీ చేయాల్సిందిగా కోరుతున్నాను.

నిరుద్యోగ యాత్రా దళానికి ఒంగోల్లో ఘన స్వాగతం

ఒంగోలు, ఏప్రిల్ 21

నిరుద్యోగ యాత్రా దళం ఇటీవల ఒంగోలు వచ్చిన సందర్భంగా వారికి ఘనమైన స్వాగతం చెప్పి, విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యాన టాగూర్ ట్యుటోరియల్ కాలేజిలో సభ జరిగింది.

సభకు అనంతకృష్ణయ్య అధ్యక్షత వహించారు.

యాత్రాదళంలోని మద్రాసురాష్ట్ర ప్రతినిధి శ్రీ రమణి మాట్లాడుతూ యీ యాత్ర ప్రాముఖ్యాన్ని వివరించారు.

తర్వాత కేరళరాష్ట్రప్రతినిధి శ్రీ జాన్‌సన్ మాట్లాడుతూ ఈనాడు మనదేశంలో నిరుద్యోగం ప్రధాన సమస్యగా వుందనీ, సుమారు 80 వేలమంది ఇంజనీర్లు నిరుద్యోగానికి గురియ్యారని అన్నారు.

ఈ ప్రచారయాత్ర నిరుద్యోగ వ్యతిరేక పోరాటంలో ప్రథమ దశయని, పోరాటానికి యువకులు, విద్యార్థులు సమాయత్తం కావాలని కోరారు.

అఖిలభారత విద్యార్థి ఫెడరేషన్ కార్యదర్శి శ్రీ సుధాకరరెడ్డి, ఆంధ్రప్రదేశ్ విద్యార్థి ఫెడరేషన్ కార్యదర్శి శ్రీ వర్మ కూడా మాట్లాడారు.

మద్రాసు, కేరళ ప్రతినిధుల ప్రసంగాలను శ్రీ కరవది వెంకటేశ్వర్లు తెలుగులోకి తర్జుమా చేశారు.

విశాలాంధ్రకు రు. 10 విరాళం

శ్రీ చల్లా శ్రీ రాములుచే

విజయవాడ, ఏప్రిల్ 21

లెనిన్ శతజయంత్యుత్సవాలసందర్భంగా సోవియట్ భూమి ఏజంటు శ్రీ చల్లా శ్రీ రాములు (మాచర్ల) విశాలాంధ్ర దినపత్రికకు రు. 10 లు విరాళం యిచ్చారు.

విశాలాంధ్ర ఐక్యత రక్షణకు శపథం

పెదకాకాని టెక్స్‌టైల్ వర్కు యూనియన్ తీర్మానం

పెదకాకాని, ఏప్రిల్ 21

గుంటూరు తాలూకా పెదకాకాని హేమలతా టెక్స్‌టైల్ వర్కర్సు యూనియన్ సర్వసభ్య సమావేశం శ్రీ వాసిరెడ్డి మల్లికార్జునరావు అధ్యక్షతన జరిగింది.

ఆంధ్ర, తెలంగాణా విభేదాలను తెలంగాణా భూస్వామ్య వర్గము, వారిప్రతినిధి శ్రీ బ్రహ్మానందరెడ్డి మంత్రివర్గం, గత 12 సంవత్సరాలుగా అధికారములో వున్న కాంగ్రెసుపార్టీ బాధ్యత వహించాలనీ, బూర్జువా పార్లమెంటరీ సాంప్రదాయం ప్రకారమైనా శ్రీ బ్రహ్మానందరెడ్డి తక్షణం రాజీనామా యిచ్చివుండ వలసిందని, సుప్రీం కోర్టు తీర్పు తరువాత కూడ పదవికి అంటిపెట్టుకొనివుండటం గర్హించదగ్గ విషయమని, విశాలాంధ్ర సమైక్యతను కాపాడుటకు శపథం పూనుతూ పై సర్వసభ్య సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించినది.

శ్రీ బ్రహ్మానందరెడ్డిప్రభుత్వం రాజీనామా చేయకపోతే కేంద్ర ప్రభుత్వం బర్తరఫ్ చేయాలని కూడ ఏకగ్రీవంగా కోరుతూ తీర్మానించారు.

2 వ జాతీ వేజ్ బోర్డు సిఫార్సులను కేంద్ర ప్రభుత్వం వెంటనే ఆమోదించి ప్రకటించుతూ అమలు జరపాలని కోరుతూ మరొక తీర్మానం ఆమోదించబడింది.

పార్లమెంటుకు మేదేన జరుగబోవు కార్మికవర్గ కోర్కెల పత్రముపై సంతకాలు సేకరించుటయే గాక విరివిగా కార్మికులను పంపాలనికూడా నిశ్చయించు కొన్నారు.

పై అన్ని విషయాలపై ప్రధాన కార్యదర్శి శ్రీ వి. గంగాధరరావు, అధ్యక్షులు శ్రీ వి. మల్లికార్జునరావులు వివరణ యిచ్చారు.

తెలంగాణా రక్షణలు అమలు జరపాలి

యాడికి పట్టణంలో జరిగిన సభలో

కమ్యూనిస్టు నాయకుని డిమాండ్

తాడిపల్లి, ఏప్రిల్ 21

అనంతపురం జిల్లా తాడిపల్లి తాలూకా యాడికి పట్టణం కమ్యూనిస్టుపార్టీ ఆధ్వర్యాన 11 వ తేదీన బహిరంగసభ జరిగినది. బహిరంగసభకు తాలూకాకమ్యూనిస్టు సమితి సభ్యుడు పి. నారాయణస్వామి అధ్యక్షత వహించారు. తొలుత తాలూకా కమ్యూనిస్టు సమితికార్యదర్శి శ్రీ అశ్వర్థ నారాయణరెడ్డి మాట్లాడారు.

అటుపిమ్మట జిల్లా కమ్యూనిస్టు సమితి సహాయ కార్యదర్శి పి. వెంగమనాయుడు మాట్లాడుతూ 1956 ఒప్పందాన్ని వుల్లంఘించి తెలంగాణా కిచ్చిన రక్షణలు అమలు పరచనందువల్లనే నేడు ఈ పరిస్థితి ఏర్పడిందన్నారు.

అనేకమంది అమర వీరుల త్యాగాల ఫలితంగా ఏర్పాటైన విశాలాంధ్రను విచ్ఛిన్నంచేయజూచే శక్తులవలలో పడవలదని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

వచ్చే 5 సంవత్సరాలలో ఆంధ్రదేశంలో ఖర్చుపెట్టిన తెలంగాణా మిగులు నిధులను తెలంగాణాకు ఖర్చు పెట్టాలనీ, దీనికిగాను మద్యనిషేధాన్ని రద్దుచేసి, తద్వారా వచ్చే ఆదాయాన్ని వారికి ఖర్చుపెట్టాలని చెప్పారు. వెంటనే తెలంగాణా ప్రజానీకాన్ని శాంతింపచేయడానికి 'యింతవరకు వారికి' అన్యాయం చేసిన బ్రహ్మానందరెడ్డి మంత్రివర్గం రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

నిత్యం కరువుతో బాధపడే రాయలసీమను ప్రత్యేక దృష్టితో చూడాలని, లేకపోతే వెనుకబడిన ప్రాంతాలు అభివృద్ధి కావటం అసాధ్యమని చెప్పారు.

దగ్గులూరులో

దగ్గులూరు, ఏప్రిల్ 21

ప॥గో॥జిల్లా నర్సాపురం తాలూకా దగ్గులూరు గ్రామంలో ఈనెల11వ తేదీన కమ్యూనిస్టుపార్టీ ఆధ్వర్యాన రాష్ట్రసమైక్యతను కోరుతూ బహిరంగసభ జరిగింది.

500 మంది ప్రజలు హాజరైన ఈ సభకు శ్రీ భూపతిరాజు పెదఅప్పలరాజు అధ్యక్షత వహించారు.

సభలో శ్రీ యుతులు వంక సత్యన్నారాయణ, మారెళ్ళ నర్సింహారావు, ఎం. వి. ఎస్. కపర్ధిలు రాష్ట్ర సమైక్యతావశ్యకతపై విపులంగా మాట్లాడారు.

కమ్యూనిస్టు ఉద్యమంలోని చీలికవలన దేశానికి ఎంతో ముప్పు వాటిల్లిందని, ఆంధ్ర ప్రదేశ్‌లో కూడా చీలిక తత్వం పెచ్చు రిల్లినందువల్ల కూడా అలాంటి నష్టమే కలుగుతుందని వక్తలు వివరించారు. వామపక్ష పార్టీల ఐక్యకార్యాచరణతో విచ్ఛిన్న చర్యల్ని ఎదుర్కోవాలని ఉద్ఘాటించారు.

గుంటూరుజిల్లా వ్యవసాయ కార్మిక మహాసభ

ప్రతినిధులకు సూచనలు

గుంటూరు, ఏప్రిల్ 21

గుంటూరుజిల్లా వ్యవసాయ కార్మిక మహాసభ నర్సరావుపేటలో ఈ నెల 22, 23 తేదీలలో జరగనున్నది. మహాసభ జయప్రదంగా నిర్వహించుటకు ఆహ్వాన సంఘం వారు చురుగ్గా ఏర్పాట్లు సాగించుచున్నారు.

ఈ మహాసభకు రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘ అధ్యక్షులు శ్రీ స్వర్ణ వేమయ్య, ప్రధాన కార్యదర్శి శ్రీ గుజ్జుల యల్లమందారెడ్డి హాజరగుటకు తమ ఆమోదం తెలిపినారు.

జిల్లాలోని ప్రతి గ్రామ సంఘం తమ ప్రతినిధులను యీ మహాసభకు పంపవలసినదిగా జిల్లా వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు కోరుచున్నారు. ప్రతినిధులందరూ 22 మధ్యాహ్నం 1 గంట లోపుగా నర్సరావుపేట చేరాలి. మధ్యాహ్నం 3 గంటల నుండి మహాసభ ప్రారంభమగును.

శీరపు అప్పారావు అభ్యర్థిత్వాన్ని నిరాకరించండి

30, 31 వార్డుల ప్రజలకు అభివృద్ధి సమితి విజ్ఞప్తి

విజయవాడ, ఏప్రిల్ 21

పట్టణ అభివృద్ధి సమితి నిర్ణయానికి వ్యతిరేకంగా 30, 31 వ వార్డులలో పోటీచేస్తున్న శ్రీ శీరపు అప్పారావు అభ్యర్థిత్వాన్ని నిరాకరించి పట్టణ అభివృద్ధి సమితి అభ్యర్థులను ఆరెండు వార్డులలో గెలిపించవలసిందిగా అభివృద్ధి సమితి నాయకులు విజ్ఞప్తి చేశారు.

ఆ విజ్ఞప్తి పత్రంపై శ్రీయుతులు పి. వి. రాఘవయ్య (కన్వీనర్, పట్టణ అభివృద్ధి సమితి). తమ్మిన పోతరాజు (కార్యదర్శి, సిటీ కమ్యూనిస్టు కమిటీ). సి. హెచ్. వెంకటరత్నం (కార్యదర్శి, పట్టణ కమ్యూనిస్టు సమితి). ఎ. రామచంద్రరావు (కన్వీనరు, పట్టణ అభివృద్ధి సమితి). కె. రాజగోపాలరావు (అధ్యక్షుడు, పీపుల్స్ ఫ్రంట్). అయితా రాములు (కార్యదర్శి, మార్క్సిస్టు కమ్యూనిస్టు కమిటీ) సంతకాలు చేశారు.

ఆ ప్రకటనలో ఇలా ఉంది;

మునిసిపల్ ఎన్నికలలో పోటీ చేయుటకు పట్టణ అభివృద్ధి సమితి అభ్యర్థిగా తనను నియమించవలసిందిగా శ్రీ శీరపు అప్పారావు దరఖాస్తు చేయగా అనేక కారణాలవల్లసమితి ఆయన అభ్యర్థనను తిరస్కరించింది. ఆయన పోటీనుండి విరమించి సమితి అభ్యర్థులను బలపరచ వలసిందిగా కోరింది. అయినా మా అందరి కోరికలను తిరస్కరించి ప్రస్తుతం 30. 31 వార్డులలో పోటీ చేయుటకు నిర్ధారణ చేసుకున్నట్లుగా రూఢి అయింది.

అసమర్థమైన, అవినీతికరమైన కాంగ్రెసును ఓడించి పట్టణంలోసక్రమపరిపాలనను, సౌకర్యాలనూ నెలకొల్పేందుకు పూనుకుంటున్న సమితి అభ్యర్థులను గెలిపించటం ప్రతీ ప్రజాస్వామ్యవాదియొక్క కనీసధర్మం. శ్రీ శీరపు అప్పారావు పోటీ కొనసాగించాలని నిర్ణయించుకొనడం చాలా నష్టదాయకమేగాక, మొత్తం సమితియొక్క ప్రయోజనాలకే తీవ్ర విఘాతం కల్గించుతుంది అందుచేత శ్రీ శీరపు అప్పారావు అభ్యర్థిత్వాన్ని నిరాకరించి సమితి అభ్యర్థులు — 30 వ వార్డులో శ్రీ వెల్లంకి కృష్ణమోహనరావును. 31వ వార్డులో శ్రీ బెల్లపు శ్రీరాములుగార్లను పుస్తకం గుర్తుపై ఓటు ముద్రవేసి గెలిపించ కోరుచున్నాము.

ప్రత్యేక తెలంగాణాకై భూస్వాముల కుట్ర

శ్రీ సుందరయ్య హెచ్చరిక

నెల్లూరు, ఏప్రిల్ 20

"ఆంధ్ర, తెలంగాణా యిరు ప్రాంతాల్లో వున్న వ్యవసాయ కార్మికులు, పేదరైతులు, సామాన్య ప్రజలు భూస్వాములకు లక్షాధికారులకు వ్యతిరేకంగా పోరాడినప్పుడే మనం ఈ వేర్పాటు ధోరణులను అరికట్టి ఆంధ్రప్రదేశ్ ఐక్యతను కాపాడుకోగలం" అంటూ ఇచ్చట జరిగిన డా. పుచ్చలపల్లి రామచంద్రారెడ్డి స్మారక సభలో మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) కార్యదర్శి శ్రీ పుచ్చలపల్లి సుందరయ్య ఉద్ఘాటించారు.

కీర్తి శేషులయిన డాక్టరు పుచ్చలపల్లి రామచంద్రారెడ్డి ద్వితీయ స్మారకసభ సందర్భంలో నెల్లూరు పురమందిరం ఆవరణంలో 18.4.69 సాయంకాలం ఈ బహిరంగసభ జరిగింది. ప్రథమంలో డాక్టరు రామచంద్రారెడ్డి గుణగణాలను ప్రజాసేవను గూర్చి నెల్లూరు మునిసిపలు కౌన్సిలరు శ్రీ సి. వి. నరసింహం మాట్లాడారు.

శ్రీ సుందరయ్య యింకా ఇలా అన్నారు: తెలంగాణాలోని భూస్వాములు, లక్షాధికార్లు, బిర్లా మొదలుకొని మార్వాడీ వ్యాపారస్థుల వరకు అందరు తెలంగాణాలో విద్యార్థులను ఇతరులను ఆంధ్రకు వ్యతిరేకంగా రెచ్చగొడుతున్నారు.

ఆనాడు యేభూస్వాములైతే నాటి విశాలాంధ్రకై జరిపిన వుద్యమాన్ని అణచివేయుటకు కృషిచేశారో యీనాడు కొద్ది మినహాయింపులతో మరల ఆ భూస్వాములే ప్రత్యేక తెలంగాణా అంటున్నారు. చిన్న రాష్ట్రాలయితే తమ పెత్తనాన్ని కాపాడుకోవచ్చునీ, తమ దోపిడీని యధేచ్ఛగా కొనసాగించుకోవచ్చునీ ప్రజలను రెచ్చగొడుతున్నారు. ఈ అవకాశాన్ని తీసికొని యిటు ఆంధ్రప్రాంతంలో స్వతంత్ర పార్టీలోని భూస్వాములు తదితర భూస్వాములు తెలంగాణాను యిచ్చివేయండి ఆంధ్ర ప్రత్యేక రాష్ట్రం కానివ్వండి అని అంటున్నారు. కాబట్టి తమ దోపిడీని కొనసాగించుకునేందుకు అచటా యిచటాగల భూస్వాములు లేవనెత్తిన యీ విచ్ఛిన్నకరచర్యలను అర్థంచేసికొని వాటికి వ్యతిరేకంగా పోరాడినప్పుడే మనం ఆంధ్రప్రదేశ్ ఐక్యతను ప్రజాతంత్ర ఉద్యమాన్ని కాపాడుకోగలం అన్నారు.

నెల్లూరు పట్టణ ప్రాథమికోపాధ్యాయ సంఘ సర్వసభ్య సమావేశం

నెల్లూరు, ఏప్రిల్ 21

నెల్లూరు పట్టణ ప్రాథమికోపాధ్యాయ సంఘ సర్వసభ్య సమావేశం ఈనెల 16 వ తేదీన శ్రీ బళ్ళారం వెంకట సుబ్రహ్మణ్యం అధ్యక్షతన జిల్లాసంఘ కార్యాలయంలో జరిగింది.

సమావేశంలో జిల్లాసంఘ అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు శ్రీ పి. కృష్ణమూర్తి కార్యదర్శి నివేదికను సమర్పించారు.

నూతన సంవత్సర ఎన్నికల (1969-70) నిర్వహణకై జిల్లా సంఘ కార్యదర్శి శ్రీ ఎస్. అబ్దుల్‌ఖాదర్ రిటర్నింగ్ ఆఫీసరుగా వ్యవహరించారు.

సంఘాధ్యక్షుడుగా శ్రీబి వి.సుబ్రహ్మణ్యం, ఉపాధ్యక్షులుగా శ్రీ కె. సంపత్‌కుమార్, శ్రీ ఎం. రాధాకృష్ణమూర్తి, కార్యదర్శిగా శ్రీ పి. కృష్ణమూర్తి, సంయుక్త కార్యదర్శిగా శ్రీ వి. సదారామమూర్తి, శ్రీ ఎ. రంగారావు, మరో 7 గురు కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు.

జిల్లా కౌన్సిలర్లుగా శ్రీయుతులు బి. వి. సుబ్రహ్మణ్యం, వి. ఆరోగ్యస్వామి, టి. వెంకటసుబ్బయ్య ఎన్నుకోబడ్డారు.

సభలు-సమావేశాలు

మానుకోట తాలూకా కమ్యూనిస్టు సమితి కార్యవర్గ సమావేశం ఈ నెల 24 వ తేదీన మానుకోట పార్టీ కార్యాలయంలో జరుగుతుంది.

* * * *

వరంగల్ తాలూకా కమ్యూనిస్టు సమితి కార్యవర్గ సమావేశం ఈ నెల 25 వ తేదీన జిల్లా పార్టీ కార్యాలయంలో జరుగుతుంది.

* * *

పరకాల తాలూకా కమ్యూనిస్టు సమితి కార్యవర్గ సమావేశం ఈ నెల 26 వ తేదీన పరకాల పార్టీ ఆఫీసులో జరుగుతుంది,

* * *

జనగామ తాలూకా కమ్యూనిస్టు సమితి కార్యవర్గ సమావేశం ఈ నెల 28 వ తేదీన పరకాల పార్టీ కార్యాలయంలో జరుగుతుంది.

* * * *

నర్సంపేట తాలూకా కమ్యూనిస్టు సమితి కార్యవర్గ సమావేశం ఈనెల 29 న చెన్నారావుపేటలో జరుగుతుంది.

* * *

ఈ నెల 20, 21 తేదీలలో జరుగనున్న ఆంధ్రప్రదేశ్ ఎన్జీ ఎంప్లాయీస్ కన్వెన్షన్ జూన్ 8, 9 తేదీలకు వాయిదా వేయబడింది.

పిచ్చికుక్క కాటుకి బాలుని మృతి

ధర్మాస్పత్రి డాక్టర్ల నిర్లక్ష్యం

రామచంద్రపురం, ఏప్రిల్ 21

రామచంద్రపురం పట్టణ కమ్యూనిస్టు సమితి సభ్యుడు శ్రీ కలందాసరి అప్పారావుగారి కుమారుడు (8) పిచ్చికుక్క కరచి చనిపోయాడు

పిల్లవాణ్ణి రామచంద్రపురం ధర్మాస్పత్రికి తీసుకురాగా అచ్చట ఎవరూ లేనందున కాకినాడ జనరల్ ఆస్పత్రికి తీసుకెళ్ళగా డాక్టరు మరునాడు చూస్తానని సమాధానమిచ్చారు. కానీ మరునటి రోజున డాక్టరు చూసేటప్పటికి ఆ అబ్బాయి ప్రాణాపాయంలో వుండి ఒక అరగంటకే ప్రాణం విడిచాడు.

రోగులపట్ల ప్రభుత్వ ఆసుపత్రుల డాక్టర్లు చూపుతున్న అశ్రద్ధ, నిర్లక్ష్యంగానే అనేక మంది పేదలు ప్రాణాలు కోల్పోతున్నారనడాని కిది తార్కాణం.

ఈ బాలుని మృతికి పట్టణ కమ్యూనిస్టు సమితి సంతాపం తెలియజేస్తూ ఈ ప్రభుత్వ ఆస్పత్రి డాక్టర్లు నిర్లక్ష్య భావం విడనాడి రోగులపట్ల యికనైనా శ్రద్ధ వహించాలని కోరుతున్నది.

విజయనగరం సమీపంలో అగ్నిప్రమాదం

రు. 2 లక్షలు నష్టం; బాలిక మృతి

విజయనగరం, ఏప్రిల్ 21

విజయనగరంలో లక్ష్మీపురం అగ్రహారంలో 100 పైగాను, కణపాక గ్రామంలో 6వందలకు పైగా పూరిండ్లు ఈనెల 15 వ తేదీన అగ్నికి ఆహుతి అయ్యాయి.

ఈ మంటలలో సుమారు 3 సం॥ వయస్సుగల చి॥ గుణుపూరు లక్ష్మి అనే బాలిక ఇంటిలో తలుపుజరుగున నిలబడి వుండిపోయినది. బైటకు రాలేక అక్కడికక్కడే కాలిపోయింది.

అగ్నిమాపక దళాలువచ్చి మంటలను అదుపులో పెట్టటం ఆలస్యంగానే జరిగింది.

ఆస్తి సుమారుగా 2 లక్షలు వుంటుందని అంచనావేస్తున్నారు.

ప్రమాదంజరిగిన ప్రదేశానికి శాసనసభ్యులు శ్రీ వి. రామారావు, మాజీ శాసనసభ్యులు శ్రీ భాట్టం శ్రీరామమూర్తి, మున్సిపల్ ఛైర్‌మెన్ శ్రీ అప్పన్నదొర యితరులు, మాజీమంత్రి శ్రీ పి. వి. జి. రాజా కూడా ప్రమాద స్థలాన్ని తిలకించినట్లు తెలుస్తున్నది.

వర్షాభావంవలన నూతులలోను, చెరువులలోను నీరు లేనందువలన అగ్నిప్రమాదాలు జరిగిన సందర్భంలో అగ్నిమాపక దళంవారుగాని, ప్రజలుగాని నిస్సహాయులుగా వుండవలసి వస్తూయున్నది.

అందువలన విజయనగరంఆన్నినీటిగుండీలను వెంటనే రిపేర్లు చేయించి వీటి నిండుగా నీరు నిలువ చేయవలసిన అవసరం ఎంతైనా వున్నదని గతంలో అనేకసార్లు పత్రికా ముఖంగా ప్రకటించినప్పటికిన్ని ప్రభుత్వం చెడచెవిని పెట్టిందని ప్రభుత్వాన్ని హెచ్చరిస్తూ అగ్నిబాధితులకు సకాలంలో ఆర్థిక సహాయంగా కొంతడబ్బును, ఇల్లుకట్టుకొనుటకు ప్రభుత్వఅధీనంలోవున్న తాటిచెట్లను ఇప్పించవలసిందిగాను, సిమ్మెంటు రేకులతో ఇల్లు నిర్మించి దానికి అయే ఖర్చును ప్రభుత్వం భరించి 10 సంవత్సర వాయిదాలలో చెల్లించుకోవడం చేయాలని విజయనగరం తాలూకా కమ్యూనిస్టు సమితి కార్యదర్శి శ్రీ మొకర అప్పారావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

అచ్చంపేటలో అగ్నిప్రమాదం

చేనేత కార్మికుల ఇండ్లు దగ్ధం

అచ్చంపేట, ఏప్రిల్ 21

గుంటూరు జిల్లా, సత్తెనపల్లి తాలూకా, అచ్చంపేట గ్రామంలో 17 వ తేదీ మధ్యాహ్నం పెద్ద అగ్నిప్రమాదం సంభవించి చేనేత కార్మికులగృహాలు మూడు దహనమయ్యాయి.

చేమగ్గాలు, నేత పనిముట్లు, యితర సామానులు పూర్తిగా అగ్నికాహుతయ్యాయి. [illegible] మంటలను ఆర్పుటకు తగు కృషి చేయకపోతే ప్రక్కనున్న పెక్కు పూరిళ్ళు దగ్ధమయ్యేవి. పై ప్రమాదంవల్ల చేనేత కార్మికులు బిట్రా రాములు, కోకాటిత్తుల రంగనాయకులు, కాకాటిత్తుల సుబ్బయ్యలు చాలా నష్టపడారు వారికి ప్రభుత్వమువారు తక్షణమే తగుసహాయాన్ని అందచేయవలసినదిగా వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

నవయుగ వైతాళికుడు వీరేశలింగం పంతులు

రాజమండ్రి జయంతిసభలో పలువురి విమర్శ

రాజమండ్రి, ఏప్రిల్ 21

వీరేశలింగం సాంస్కృతిక సమితి ఆధ్వర్యాన ఏప్రిల్ 16 సాయంత్రం టౌన్ హాలులో శ్రీ కె. తారకం అధ్యక్షతను యుగపురుషుడు, నవయుగ నిర్మాత కందుకూరి వీరేశలింగంపంతులు జయంతిసభ జరిగింది.

అధ్యక్షులు శ్రీ తారకం. ఈ జయంతి భారతదేశ చరిత్రలోనే సుప్రసిద్ధమైన దినం. యుగపురుషుని చరిత్రను ఎన్నిసార్లు ప్రశంసించినా తీరదు. ఆంధ్రదేశ చరిత్రలో ప్రతిచోటా వారు కనిపిస్తారు అన్నారు.

శ్రీ మధునాపంతుల సత్యనారాయణ వీరేశలింగం పంతులుపై రచించినపద్యాలను చదివారు.

సహదేవసూర్యప్రకాశరావు, పంతులుగారి సారస్వత సేవను వివరించారు.

శ్రీ మహీధర జగన్మోహనరావుమాట్లాడుతూ "కార్యసూరుడు, సత్యశీలి, కర్మవీరుడు అయిన పంతులుగారు చిత్తశుద్ధితో సాంఘిక దురాచారాల నెదిరించారని అన్నారు.

శ్రీ మేడూరి సత్యనారాయణ మాట్లాడుతూ ఈనాడు విద్యార్థులలో డిసిప్లిన్ బాగాలేదని, సహవిద్య అనేకదుష్ఫలితాలకుదారితీస్తుందని, పంతులుగారి ఆశయాలకు భిన్నమైన దుస్థితి విద్యాలయాలలో కనిపిస్తోందని, ప్రస్తుతానికి సహవిద్యను మాన్పించాలని అన్నారు.

శ్రీయుతులు పొన్నాడ వెంకట్రాది, మారిసెట్టి నాగేశ్వరరావు, క్రొవ్విడి లింగరాజుగారలుకూడా పంతులుగారి ప్రజ్ఞ, త్యాగం, సాహసం, సాహిత్య సేవలను ప్రశంసిస్తూ ప్రసంగించారు.

ఈ సందర్భంలో సమితి వారు నిర్వహించిన వక్తృత్వ పోటీలలో గెలుపొందిన విద్యార్థినీ, విద్యార్థులకు రాజ్యలక్ష్మి స్త్రీల కళాశాల ప్రిన్సిపాల్ శ్రీమతి కె. రుక్మిణి బహుమతీ ప్రదానం చేశారు.

పంతులుగారి చిహ్నంగా తపాలా బిళ్ళ

అనంతరం "స్వర్గీయ వీరేశలింగం పంతులుగారి స్మారక చిహ్నంగా తపాలా బిళ్ళలు విడుదలచేయాలని, శ్రీపంతులుగారిపై ప్రసాద్ (ప్రొడక్షన్స్) వారు నిర్మించిన డాక్యుమెంటరీ చలన చిత్రాన్ని వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరుతూనూ, "ఇనిస్‌పేట పార్కులోని వీరేశలింగం పంతులుగారి విగ్రహం బీటలు పారుతున్న దృష్ట్యా వెంటనే రిపేరీలు చేయించాలని, వీరేశలింగం హైస్కూలును రిపేరీలు చేయించాలని హితకారిణీ సమాజం వారికి విజ్ఞప్తి చేస్తున్నారు.

"రాజమండ్రి పట్టణంలో పంతులు కాంశ్య విగ్రహ ప్రతిష్ఠాపనకు చర్యలు వెంటనే తీసుకోవాలని మునిసిపాలిటీకి విజ్ఞప్తి చేస్తూనూ తీర్మానించారు.

వీరేశలింగం హైస్కూలులో జయంతి ఉత్సవం

రాజమండ్రి వీరేశలింగం హైస్కూలులో 16వ తేదీన శ్రీ వీరేశలింగం పంతులు జయంతి ఉత్సవం శ్రీ పొన్నాడ వెంకట్రాది అధ్యక్షతను జరిగింది

శ్రీ మారిసెట్టి నాగేశ్వరరావు స్వాగతం చెప్పారు.

శ్రీ పోతుకూచి సూర్యనారాయణమూర్తి, శ్రీ మేడూరి సత్యనారాయణలు పంతులుగారి జీవితంపై ప్రసంగించారు.

కమ్యూనిస్టుపార్టీ శాఖా సమావేశాలు

తిరువూరు తాలూకా గ్రామాల్లో

తిరువూరు, ఏప్రిల్ 21

తిరువూరు తాలూకా తుమ్మగూడెం [illegible] కమ్యూనిస్టుశాఖ సమావేశం ఈ నెల 12 వ తేదీన జరిగింది.

గ్రామశాఖ కార్యదర్శిగా శ్రీ మాదల గోపయ్యను ఎన్నుకున్నారు.

లక్ష్మీపురంశాఖ సమావేశం

కలగర శివారు లక్ష్మీపురంశాఖ సమావేశమై శాఖ కార్యదర్శిగా శ్రీ చుట్టుసత్యనారాయణను ఎన్నుకొన్నారు.

ప్రత్యేక తెలంగాణా నినాదాన్ని వ్యతిరేకిస్తూ ఈ రెండు సమావేశాల్లో తీర్మానం చేశారు.

ఈ సమావేశాలకు తాలూకా కమిటీ [illegible] శ్రీ కేమిశెట్టి కోటయ్యహాజరైనారు.

ప్రపంచ పీడిత ప్రజల విప్లవనేత లెనిన్ శత జయంతి

విశాలాంధ్ర ప్రత్యేక అనుబంధం

భారతీయ సామాజికాలోచనా ధోరణుల గూర్చి లెనిన్

ప్రాచ్య దేశాలలోని నిర్దిష్టమైన సామాజిక ఆర్థిక పరిస్థితుల గురించి, సాంస్కృతిక, చారిత్రక సంప్రదాయాలను గురించి, సిద్ధాంతవిషయక ధోరణుల గురించీ లెనిన్ ప్రత్యేకించి, చాల లోతుగా అధ్యయనం చేశారు. మానవుని ఆత్మిక పెన్నిధికి ప్రాచ్య దేశాల ప్రజలు సమకూర్చి పెట్టిన సంపదలను విస్మరించేవారు, చెప్పే అభివృద్ధి నిరోధకమైన 'యూరపు కేంద్రక' భావనను ఆయన నిశితంగా విమర్శించారు. పాశ్చాత్య దేశాలలోనే నిసలైన తత్వశాస్త్రం ఆవిర్భవించిందనీ ప్రాచ్య దేశాల తత్వశాస్త్రం అనబడేది కేవలం "ప్రాచ్యదేశాల వారి మత దృక్పథం" మాత్రమేనని వాదించిన, జర్మన్ తత్వవేత్త హెగెల్‌ను ఆయన అతి నిశితంగా ఖండించడంలో ఆశ్చర్యం లేదు. భారతీయ తత్వశాస్త్రాన్ని అసలు తత్వశాస్త్రం అనడానికే వీలులేదంటూ హెగెల్ దానిని మానవుని సాధారణ తాత్విక భావననుంచే తొలగించారు. అందుచేత హెగెల్ రచనలన్నింటిమీద సమీక్ష చేస్తూ లెనిన్ భారతీయ తత్వశాస్త్రం గురించి ఆయన వెలిబుచ్చిన అభివృద్ధి నిరోధక, విధ్వంసాత్మక వాదాలను నిరాకరించారు. నాగరికత ఆరంభ దినాలలోనే భారతీయతత్వవేత్తలు ప్రతిపాదించిన గంభీరమైన భావాలను ఉటంకరిస్తూ, 'యూరపు కేంద్రక' భావాల్ని ఖండించారు. లెనిన్ తన "తాత్విక వ్యాఖ్యలు"లో ప్రాచీన భారతీయ తత్వశాస్త్రంలో అంతర్భూతమైవున్న గతితర్కాన్ని కనబరిచారు. బ్రహ్మ శివుడుగా మార్పు చెందడం అనే భావంలో మార్పు, అదృశ్యం కావడం, తిరిగి దృశ్యమానం కావడం అనే భావం నిర్దిష్టంగా కనబడుతున్నదన్నారు.

'యూరపు కేంద్రక' భావాన్ని విమర్శిస్తూ భారతదేశంతోసహా తూర్పు దేశాల ప్రజల సామాజికభావనలో ప్రత్యేకంగా, నిస్పష్టమైన ప్రాచీనకాలపు తాత్విక సంప్రదాయాలున్నాయని లెనిన్ చూపించారు వలస, పరాధీన దేశాలలోని శాస్త్రవేత్తలు ప్రాచ్య దేశ ప్రజలలో జాతీయ చైతన్యాన్ని మేల్కొలపడంలో సాధనంగా వుపయోగపడిన తమ తమ దేశాలలోని సామాజిక భావాల చరిత్రనంతనూ వివరించ వలసి వుంటుందని అన్నారు.

ప్రాచ్య దేశాలన్నింటిలోని సామాజిక భావాల విషయంలో లాగే భారత దేశానికి సంబంధించిన దాని విషయంలో కూడా లెనిన్ కేవలం పాండిత్య దృష్టితోగాక సామాజిక రాజకీయ దృక్పథంతో పరిశీలన జరిపారు. జాతీయ విముక్తి వుద్యమంలో భాగంగా కలిసిపోయిన ఇటీవలి సిద్ధాంత ధోరణుల వివేచనకు ఆయన విశేష శ్రద్ధ కనబరచారు. ఐతే ప్రాచ్య దేశాలు అనేకం వాటిలో యీ వుద్యమానికి జాతీయ బూర్జువా వర్గం నాయకత్వం వహించడంచేత, లెనిన్ ఆ వర్గం యొక్క సిద్ధాంతాన్ని, జాతీయ వాద సిద్ధాంతాన్ని సునిశితంగా పరిశీలించారు.

ప్రాచ్య దేశాలలోని బూర్జువా వర్గం అభివృద్ధి కారక సామర్థ్యాన్నే కలిగివున్నదనీ అభివృద్ధికరములూ, సామ్రాజ్యవాద వ్యతిరేకములూ అయిన భావాల్ని - జాతీయ స్వాతంత్ర్యం అభివృద్ధికి సంబంధించిన భావాల్ని యింకా కలిగివున్నదని లెనిన్ చూపించారు.

ఈ బూర్జువా వర్గం ప్రతిపాదించిన జాతీయవాద సిద్ధాంతం వలస పీడనకు వ్యతిరేకంగా, జాతీయ స్వాతంత్ర్యం, సామాజిక విముక్తి కోసం పోరాటం సాగించడానికై ప్రజలలో కలిగిన చైతన్యాన్ని ప్రతిబింబిస్తూంది. ఈ సిద్ధాంతం ఆ విధంగా అభివృద్ధికరమైనదిగా వుపయోగించిందని లెనిన్ చెప్పారు. "ఫ్యూడల్ నిద్రనుంచి ప్రజానీకం మేల్కోవడం, ఏ తరహాదైనా జాతీయ పీడనకు వ్యతిరేకంగా, ప్రజలు స్వతంత్ర కోసం, జాతియొక్క సర్వతంత్ర స్వతంత్రకోసం పోరాడడమే అభివృద్ధికరం."

జాతీయ స్వాతంత్ర్యం కావాలనటం. జాతీయ ప్రభుత్వ సర్వతంత్ర స్వతంత్రకు పోరాడడమూ జాతీయవాదంలోని అభివృద్ధికర లక్ష్యాలలో ముఖ్యమైన అంశం. అందుచేతనే యీ తరహా జాతీయవాదాన్ని చారిత్రకంగా సమర్థించవచ్చునని అన్నారు.

తిలక్‌కు లెనిన్ ప్రశంస

ప్రాచ్య దేశాలలోని జాతీయ బూర్జువాలు లక్షలాది రైతులా, మేధావులా ఆలోచనలను ఎంతో గాఢంగా ప్రభావితం చేసి, ఆ విధంగా సామ్రాజ్యవాద వ్యతిరేకపోరాటంలో ప్రముఖ శక్తి అయ్యాయనీ లెనిన్ బాగా ఎరుగును. భారత జాతీయోద్యమ ప్రముఖ నాయకుడు బాల గంగాధర తిలక్ యొక్క ప్రజాతంత్ర భావాలను లెనిన్ ఎంతో ప్రశంసించారు. వలస అధికారులు ఆయనను చాల కఠినంగా శిక్షించినప్పుడు ప్రజానీకం బొంబాయిలో సమ్మెలు, ప్రదర్శనలు జరిపి ఆయనను సమర్థించడాన్ని లెనిన్ 1908 లోనే గమనించారు.

భారత ప్రజల మహనీయ నాయకుడు మహాత్మాగాంధీ భారత దేశంలో ప్రారంభించిన సామ్రాజ్యవాద వ్యతిరేక ప్రజావుద్యమ భావాలను లెనిన్ ఎంతగానో మెచ్చుకొన్నారు. ఎం. ఎన్. రాయ్ "జ్ఞాపకాలూ", ఇతరేతర గ్రంథాలూ చూస్తే గాంధీని విప్లవ కారుడుగానే లెనిన్ గణుతించారు. అభివృద్ధికర శక్తులు ఆయనతో సహకరించాలన్నారు. ఆయన నడుపుతున్న వుద్యమాన్ని బలపరచాలనీ కోరుతూ, రెండో వేపున దానిని ఇంకా అభివృద్ధికరంగా సమరశీలంగా చెయ్యాలనీ అన్నారు.

సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటంలో భారత ప్రజలు కనబరచిన ఐక్యతా భావాన్ని లెనిన్ ఎంతగానో మెచ్చుకొన్నారు. 'విభజించి పాలించు' సూత్రాన్ని అనుసరిస్తూ వలస పాలకులు పనికట్టుకొని దేశంలో మత జాతి విభేదాలను, కలహాలనూ రెచ్చగొడుతున్న దృష్ట్యా యీ భావాలకు అధిక ప్రముఖ్యం వుంది. భారతీయ విప్లవకారుల అభినందనలకు సమాధానం యిస్తూ, 1920 లో లెనిన్ యిలా వ్రాశారు: "ముస్లిం, ముస్లిమేతర ప్రజల సన్నిహిత స్నేహాన్ని మేము అభినందిస్తున్నాము. ఈ స్నేహం ప్రాచ్యదేశాలలోని కార్మిక ప్రజలందరికీ విస్తరించాలని మేము మనస్ఫూర్తిగా వాంఛిస్తున్నాము."

జాతీయ బూర్జువా విప్లవం : మతం

జాతీయ బూర్జువా వర్గానికిగల సాంఘిక బలం రైతాంగంతో. వారిలో ఇంకా మత భావనలు చాలా బలంగా వున్నాయి. అందుచేత జాతీయ బూర్జువావర్గం నడుపుతున్న జాతీయ విముక్తి ఉద్యమంలో తప్పకుండా మతం వాసన వుండక తీరదని లెనిన్ గ్రహించారు.

"ఆధునిక భారతదేశం - భారతదేశంలో బ్రిటిష్ పరిపాలన సూత్రాలూ, సమస్యలూ" అన్న వెగెనర్ పుస్తకం గురించి సంగ్రహంగా వ్రాసుకుంటూ, "బ్రిటిష్ వాళ్ళకి వ్యతిరేకంగా, ఆసియన్ల కోసం, తమకోసం ఆసియన్ల కోసం మతోద్యమం" జరుగుతుందని ఆయన నొక్కి చెప్పారు.

దీనిని గమనిస్తే భారతీయ సామాజిక భావాల సంక్లిష్ట క్రమాన్ని లెనిన్ ఎంత లోతుగా, మెలకువగా ఆలోచించారో కనపడుతుంది. ఈ శతాబ్ది ఆరంభంలో వచ్చిన స్వదేశీ వుద్యమానికి పునాది "మత ప్రసక్తి గల జాతీయ వాదం" అని జవహర్‌లాల్ నెహ్రూ అన్నారు. ప్రాచ్య దేశాలన్నింటిలో లాగే భారతదేశంలో వచ్చిన నూతన జాతీయ వాదం కూడా మత ప్రసక్తి గల జాతీయ వాదమే."

జాతీయ విముక్తి వుద్యమ సిద్ధాంతానికి మతం వాసన వుండడంచేతనే ఆత్మిక, నైతిక పరిశుద్ధత స్వాతంత్ర్య పోరాట లక్ష్యాలలో ఒకటి, అతి నిర్ణయాత్మకమైన షరతూ అయ్యాయి. ఈ సిద్ధాంత సూత్రాలు 'ఆత్మ'కు విజ్ఞప్తి చేయడం మీద మత సంబంధమైన నైతిక ప్రవర్తనమీద ఏర్పడ్డాయి. పాత జీవిత పద్ధతులను ఛిన్నితంగా ఎదుర్కొంటూ, మూలగతమైన పరివర్తన సాధించడం ఏలాగో యింకా ఎరగని ప్రజానీకాన్ని అటువంటి భావాలు ఆకట్టుకొంటాయని లెనిన్ తెలిపారు.

వర్గపోరాటం ఒక్కటే మార్గమని లెనిన్

[illegible] రాజా మహేంద్ర ప్రతాప్ లెనిన్‌ను కలుసుకొని [illegible] 'ప్రేమ మతం' అన్న పుస్తకాన్ని ఆయనకు యిచ్చినప్పుడు తామూ పుస్తకాన్ని అదివరకే చదివామని టాల్‌స్టాయి తాత్వికవిధానంతప్ప దానిలోవేరు లేదనీచెప్తూ - భారతదేశం ప్రజలను మతం కాపడలేదు - అన్నారని రాజా అన్నారు. టాల్‌స్టాయీ - ఆయనవంటి యితరులూ రష్యాలో అదే పని చేశారనీ, కాని సఫలురు కాలేదని చెప్పారు. "మీ దేశం వెళ్ళండి. వర్గ పోరాటం బోధించండి భారత దేశ స్వాతంత్ర్యం త్వరగా చేకూరుతుంది." - అని లెనిన్ చెప్పారు.

జాతీయ విముక్తి విషయంలోనూ, సామాజిక విమోచన విషయంలోనూ వర్గ చైతన్యానికి, విప్లవ చైతన్యానికీ లెనిన్ ఎంతో ప్రాధాన్యం యిచ్చారు విముక్తి పోరాటంలోకి అసాధారణమైన వేగంతో ఆకర్షించబడిన ప్రజలకు శాస్త్రీయ, విప్లవకర సిద్ధాంతబలం వున్న గట్టి నాయకత్వం కావాలి. మార్క్సిజమ్, శాస్త్రీయ సోషలిజమ్ ఆ సిద్ధాంతభాగం లోటు పూర్తిచేసింది.

ప్రజలలో వర్గచైతన్యం కలిగించడానికై సోషలిస్టు సిద్ధాంతాల ప్రచారం చేయడం ఒక ముఖ్యమైన పద్ధతి, అయితే దేశంలోని నిర్దిష్టమైన రాజకీయ, సాంఘిక, ఆర్థిక పరిస్థితులకు మార్క్సిస్టు సిద్ధాంతాన్ని సృజనాత్మకంగా వర్తింపచెయ్యడమూ పరిణతి పొందడమూ కూడ ముఖ్యమేనని ఆయన చెప్పారు.

ప్రాచ్య దేశాలన్నింటిలో లాగే భారత దేశంలో కూడ ప్రజానీకంలో జాతీయ చైతన్యాని, విప్లవ చైతన్యాన్ని మేల్కొల్పడంలో అక్టోబరు సోషలిస్టు మహా విప్లవ విజయానంతరం ఎంతో ప్రచారం పొందిన లెనిన్ అమర భావాలు గొప్ప పాత్రను నిర్వహించాయి. కార్మిక ప్రజానీకాన్నేగాక, జాతీయ బూర్జువా వర్గంలోని పురోగామి శక్తుల్ని, భారత జాతీయ కాంగ్రెసు నాయకుల్ని బాగా ప్రభావితం చేశాయి.

లెనిన్ కు భారత జాతీయవాదుల నివాళి

కాంగ్రెసు నాయకులు లెనిన్ భావాలలోని శాస్త్రీయ సత్యాన్ని, నిర్నిరోధ బలాన్ని బహిరంగంగా గుర్తించారు. సామ్రాజ్యవాద ప్రచారకులు ఆయనను గురించి చేసే దుష్టప్రచారాల్నీ అపహాసల్నీ ధైర్యంగా, ఖండితంగా ఎదుర్కొన్నారు. అక్టోబరు విప్లవం జరిగిన మూడు నెలలకి 1918 జనవరి 11 వ తేదీన బొంబాయి క్రానికల్ ఒక వ్యాసం ప్రకటించింది. "లెనిన్-ఆయన ఆశయాలు" దాని పేరు. ఆయన ఆశయం పూర్తిగా నెరవేరగలదనే విశ్వాసం దానిలో స్పష్టం చేయబడింది. అదే సంవత్సరం జనవరి ఆఖరులో తిలక్ ప్రచురించిన 'కేసరి'లో రష్యను నాయకుడు లెనిన్ గురించి అని సంపాదకీయం వ్రాశారు. లెనిన్ గురించి బ్రిటిష్ అధికారులు చేసిన 'దుష్ప్రచారం' దానిలో ఖండించబడింది. జవహర్లాల్ నెహ్రూగారి భావాలు ఏర్పడి, వృద్ధి పొందడంలో లెనిన్ రచనల ప్రభావం ఎటువంటిదో ఎల్లరకూ తెలుసు. సోషలిస్టు రాజ్య సంస్థాపకుని యెడ ఆయన ఎంతో మెచ్చుకోలు కనబరచారు. మార్క్సిస్టు సిద్ధాంతం పరిణతికి లెనిన్ ఎంతో తోడ్పడ్డారని చెప్పారు. ప్రస్తుత కాలపు ప్రధాన సమస్యల్ని శాస్త్రీయంగా వివేచన జరపడానికి అవి ఎంతో తోడ్పడ్డాయి అన్నారు. లెనిన్ గురించి సామ్రాజ్యవాద ప్రచారకుల అబద్ధాలను ఆయన కూడా ఖండించారు, సుప్రసిద్ధులైన బ్రిటిష్ రాజనీతివేత్తలు చాల మంది దృష్టిలో లెనిన్ ఒక రాక్షసుడూ బందిపోటు దొంగా, కాని లక్షలాది ప్రజలు అయనను రక్షకునిగా, యుగపురుషుడినిగా భావిస్తారు - అని వ్రాశారు.

కార్మిక ప్రజల మహానాయకుడు లెనిన్‌ను మహాత్మా గాంధీకూడా ఎంతో ప్రస్తుతించారు. బోల్షివిక్ ఆదర్శాన్ని అసంఖ్యాకులైన స్త్రీ - పురుషులు మహా విశ్వాసంతో బలపరిచారు. లెనిన్‌లాటి వ్యక్తి త్యాగాలతో పునీతం అయిన భావాలు వ్యర్థంకావు అని ఆయన 1928 లోనే అన్నారు.

ప్రపంచం అంతటా లాగనే భారత దేశంలోకూడా మూలమూలకంటా లెనిన్ పేరు పరిచితమే. యుగయుగాల ఆశలను సఫలంచేసుకోడానికి, సామాజికఅసమానతలను వదల్చుకోవాలనే కలలు యదార్థం చేసుకోడానికి, పీడన - దోపిడి ఏ రూపంలోనూ లేకుండా నిర్మూలించడానికి [illegible] లెనిన్ [illegible] కార్మిక ప్రజలు [illegible] ప్రేమ పాత్రం అయింది.

— ఎ. డి. లిట్మన్

అధికార జాడ్యానికి లెనిన్ విధించిన శిక్ష : అరెస్టు

లెనిన్ సోవియట్ ప్రధానిగా ఉండే రోజుల్లో ప్రజలనుంచి స్థానికోద్యోగులపై అనేక ఫిర్యాదులు వచ్చేవి. అలాంటి ఫిర్యాదులు రెండు 1919 మే 13 న ఒకటి, 14 న మరొకటి వచ్చాయి. వాటిలో, తమ గుర్రాలను అన్యాయంగా స్వాధీనం చేసుకున్నారని యిద్దరు రైతులు విలపించారు. ఈ రెండు ఫిర్యాదులు ప్రధాని పేర వచ్చాయి. ఎడ్మినిస్ట్రేటివ్ ఆఫీసు వాటిని లెనిన్‌కి పంపకుండా, మొబిలైజేషన్ కమిషన్ అనే సంస్థకు పంపింది. అది రాజధాని వ్యవహారాల కమిషన్‌కి డైరెక్టు చేసింది. ఆ కమిషన్ ఈ క్రింది మాటలుగల నోట్‌తో ప్రధానిపేర తిప్పిపంపింది "మాకు చాలా పనులున్నాయి; యిలాంటి స్వల్పవిషయాలు చూడ్డానికి మాకు తీరిక లేదు"

ఈ నోట్ చూచి, లెనిన్ యిలా టెలిగ్రాం యిచ్చారు. "ఈ విధంగా జవాబు చెప్పిన 'ఉద్యోగిని అరెస్టు చేయండి."

తోటికామ్రేడ్స్ ఆరోగ్యం పట్ల లెనిన్ శ్రద్ధ

సోవియట్ ప్రజా మంత్రిమండలిలో లెనిన్ ప్రధాన మంత్రి. స్యురుపా అను నతడు ఆహారమంత్రి. స్యురుపా తన ఆరోగ్యాన్ని లెక్క చేయకుండా పరిపాలనా విధులను నెరవేరుస్తూంటే లెనిన్ రెండు నెలలు సెలవు తీసుకోవలసిందని ఎన్నోసార్లు చెప్పారు; ఉత్తరాలు వ్రాశారు: టెలిగ్రాము లిచ్చారు, అయినా అతడు లెక్కచేయు లేదు. చివరకు లెనిన్ 1918 ఆగస్టు 24 న టెలిగ్రాం ద్వారా యీ క్రింది ఉత్తర్వు జారీచేశారు. ("ప్రభుత్వం ఆస్తి" అనే మాటకు లెనిన్ ఆరోజుల్లో చమత్కారంగా చెప్పే అర్థం ఆరోగ్యం)

"ప్రభుత్వ ఆస్తిపట్ల ఎ.డి. స్యురుపా నిర్లక్ష్యంగా ప్రవర్తించి నందుకు ఆయనకు మొదటి వార్నింగ్ యివ్వడమైనది. తక్షణమే ఆయన యింటికి వెళ్ళిపోవాలి"

నిరంకుశోద్యోగులకు సింహస్వప్నం — లెనిన్

లెనిన్ సోవియట్ యూనియన్‌కి ప్రధానమంత్రిగా ఉన్న రోజులవి. దేశంలో కరువురాక్షసి తాండవ మాడుతోంది. మరోవైపు ప్రపంచ సామ్రాజ్యవాద ప్రభుత్వాలు దేశంపై దురాక్రమణ జరుపుతున్నాయి. స్థానికోద్యోగుల్లో నిరంకుశత్వం పొడసూపుతోంది ఇట్టి పరిస్థితుల్లో, కుర్‌స్క్ కేంద్ర కొనుగోలు సంస్థకు చెందిన కోగాన్ అను నతడు ఆకలితో అలమటించే 120 మంది మాస్కో కార్మికులకు ఆహారధాన్యం యివ్వకుండా, వట్టిచేతులతో వెనక్కి పంపించివేశాడు. ఈ వార్త ప్రధాని లెనిన్‌కి తెలిసింది. వెంటనే ఆయన కుర్‌స్క్ ఎక్‌స్ట్రార్డినరీ కమిషన్‌కి యిలా టెలిగ్రాం పంపారు.

"కుర్‌స్క్ కేంద్ర కొనుగోలు సంస్థ సభ్యుడు కోగాన్ ఆకలితో మాడే 120 మంది మాస్కో కార్మికులకు సహాయం చేయకుండా వట్టిచేతులతో వెనక్కి పంపించి వేసినందుకు తక్షణం అరెస్టుచేయండి. ఈ విషయం పత్రికల్లోను, కరపత్రాల్లోను ప్రచురించండి. ఎందుచేతనంటే, కొనుగోలు సంస్థలకు చెందిన ఉద్యోగులందరూ ఒక విషయం తెలుసుకోవాలి. అదేమంటే లాంఛనపూర్వక నిరంకుశవైఖరి నవలంబించే వారినీ, ఆకలిగొన్న కార్మికులకు సహాయం చేయనివారినీ కఠినంగా శిక్షించాలి; అవసరమైతే కాల్చాలి."

6-1-1919

సెక్స్ విశృంఖలత్వంపై లెనిన్ విమర్శ

"ప్రజానీకమూ, ప్రతి వ్యక్తి కాయ శక్తులా పని చేయాలని, కేంద్రీకరించి పనిచేయాలని విప్లవం కోరుతోంది... సెక్స్ విషయాల్లో విశృంఖలత్వం బూర్జువా లక్షణం. పతనానికది చిహ్నం. శ్రామిక వర్గం పురోగమిస్తున్న వర్గం. మైమరపించే మత్తు పదార్థాలు దాని కవసరంలేదు. లేనిపోని ఉద్రేకాలను కొనితెచ్చుకోడానికి నిషా వస్తువులూ అక్కర్లేదు. సెక్స్ విశృంఖలత్వంద్వారా నిషాగాని, మత్తుగాని దాని కవసరంలేదు. పెట్టుబడిదారీ విధానంలోని నైచ్యాన్నీ, కల్మషాన్నీ, కర్కశత్వాన్నీ మరచిపోడానికి ఆ వర్గం ఇష్టపడదు...ఆత్మనిగ్రహం స్వయంశిక్షణ దాస్యం కావు అవి ప్రేమకుకూడా అవసరమే"

— లెనిన్

లెనిన్‌కి రైల్వే కార్మికుల బహూకరణ

లెనిన్ వ్యాధిగ్రస్తుడై ప్రమాద స్థితిలో ఉన్నప్పుడు, 1923 లో, మాస్కో రైల్వే వర్క్స్ షాపులో పనిచేసే నాన్ పార్టీ కార్మికులు తమ విరామ కాలంలో ఒక రైల్వే ఇంజన్‌ను రిపేరుచేసి, లెనిన్‌కి బహూకరించారు. ఒక జాబులో వారిలా తెలియ జేశారు.

"ప్రియమైన వ్లాడిమిర్ ఇల్యిచ్, మేమందరం ఏకగ్రీవంగా మిమ్మల్ని ఈ ఇంజన్‌కు గౌరవ డ్రైవరుగా ఎన్నుకున్నాం. దీన్ని మీ చేతుల్లో పెడుతున్నామంటే, మీరు అనుభవం గల ఒక ఇంజను డ్రైవరు మాదిరిగా మమ్మల్ని ఉజ్వల భవిష్యత్తులోకి నడపగలరన్న విశ్వాసంతోనే."



తన సతి కృపస్కయాతో లెనిన్

నిరంకుశ కార్యకర్తలకు లెనిన్ మందలింపు

లెనిన్ సోవియట్ ప్రధానిగా వుండే రోజుల్లో, స్థానిక కార్యకర్తలు అమాయకుల్ని నిర్బంధంలో వుంచిన కేసులు ఆయన దృష్టికి వచ్చేవి. ఉదాహరణకు, షేరెమెకోవ్ సిటీ సోవియట్‌కు ఎన్నికలు జరిగినప్పుడు నాన్‌పార్టీ ఓటర్లను ప్రవేశమీయలేదట. ఈ విషయాన్ని కొటోవ్ అను కార్మికుడు లెనిన్ దృష్టికి తీసుకొచ్చాడు. ఈ విషయాన్ని కార్మికపార్టీ సభ్యులు ధృవపరుస్తూ ఒక స్టేట్‌మెంటు కూడా పంపారు. కాని, కొటోవ్ లెనిన్‌కి ఫిర్యాదు చేసినందుకు అరెస్టు చేయబడ్డాడు. దానిమీద లెనిన్ ఆ గుబెర్నియా కార్యనిర్వాహకవర్గాని కిలా టెలిగ్రాం యిచ్చారు:

"...అతని అరెస్టుకు యిది కారణమైతే, వెంటనే అతన్ని విడుదల చేయండి. అతని అరెస్టుకు కారణమైన వారిని [illegible] పెట్టండి. వారిని [illegible] నాకు టెలిగ్రాంద్వారా [illegible]"

ప్రాచ్య దేశాల కమ్యూనిస్టుల విప్లవ పోరాటాలు : లెనిన్

61 ఏళ్ళ క్రితం, 1908లో లెనిన్ ఒక ప్రకటన చేస్తూ భవిష్యత్తు గురించి ఇలా అన్నారు. "బుద్ధిగల యూరపియన్ కార్మికులకు ఆసియన్ కామ్రేడ్స్ వున్నారు. వారిసంఖ్య దినదినమూ కాదు, గంటగంటకూ పెరుగుతుంది. అయిదేళ్ళ తరువాత "వెనకబడిన యూరపు - పురోగమించిన ఆసియా" పేరున లెనిన్ ఒకవ్యాసంవ్రాస్తూ ఆసియాలో "వందల మిలియన్ల ప్రజలు జీవితానికి, వెలుతురుకూ స్వాతంత్ర్యానికీకళ్ళు తెరుస్తున్నారు." అన్నారు. వలసపరాధీన దేశాల ప్రజలపురోగతి, ఏకైక విప్లవాత్మక పరిణామంలో అంతర్భాగమని లెనిన్ భావించారు. "సోషలిస్టు విప్లవం కేవలం ప్రధానంగా ఒక్కొక్క దేశంలోని విప్లవకర కార్మికవర్గం తమ బూర్జువా వర్గంతో జరిపే పోరాటమేకాదు. సామ్రాజ్యవాదులు అణచివుంచిన వలసలూ, దేశాలూ అన్నీ జరిపే పోరాటం అది. అంతర్జాతీయ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పరాధీన దేశాలన్నీ జరిపే పోరాటం అది" అని లెనిన్ కనబరిచారు.

జాతీయ - స్వాతంత్ర్యోద్యమం గురించి లెనిన్ చెప్పిన బోధలు ప్రాచ్య దేశాలకు ఎంతో వుపయోగకరం అయాయి, అనేక శతాబ్దాల పీడన ఫలితంగా వలస, పరాధీన దేశాలలో చారిత్రకంగా పరిణతి పొందిన పరిస్థితులకు ఆ సోషలిస్టు విప్లవ సిద్ధాంతం ఆచరణయోగ్యం. ఆ పరిస్థితులు ఏమిటి?

ప్రాచ్యదేశాలకు విప్లవ సిద్ధాంతం

మొదటిది ; వలస, పరాధీన దేశాల ప్రజలు ప్రధానంగా రైతులు. రెండోది ; శ్రామికవర్గ సిద్ధాంతాన్ని కొనిపోయే శ్రామిక వర్గం సంఖ్య అల్పం. ఇంక ఆఖరుది ; పెట్టుబడిదారీ విధానానికి పూర్వంనాటి సంబంధాలు వున్నాయి అక్కడ. 1919 నవంబరులో ప్రాచ్యదేశాల, కమ్యూనిస్టు సంస్థల రెండవ మహాసభ ప్రతినిధులకు వుపన్యసిస్తూ లెనిన్ అన్నారు. "...ప్రపంచంలో ఇతర కమ్యూనిస్టులను ఎదుర్కొని వుండని బాధ్యత మిమ్మల్ని ఎదుర్కొంటూంది, సామాన్య కమ్యూనిస్టు సిద్ధాంతమూ, ఆచరణమీద ఆధారపడి, మీరు యూరపియన్ దేశాలలో లేని చిత్రమైన పరిస్థితులకు సర్దుకోవాలి. జనాభాలో అధికభాగం రైతులుగా వుండిన పరిస్థితికి ఆ సిద్ధాంతాన్నీ, ఆచరణనూ వర్తింపచెయ్యాలి. ఆ పరిస్థితిలో జరపవలసిన పోరాటం పెట్టుబడిదారీవిధానానికి వ్యతిరేకంగా కాదు, మధ్యయుగాల అవశేషాలకు వ్యతిరేకంగాకాని..."

వలస, పరాధీన దేశాలలో జాతీయ - విముక్తివుద్యమాలు వృద్ధిపొందుతున్న, పైన చెప్పిన పరిస్థితులనుబట్టి ప్రాచ్య దేశాలలోని కమ్యూనిస్టులు సాగించవలసిన విప్లవ పోరాటాలకు లెనిన్ ఒక కార్యక్రమాన్ని తయారు చేశారు. అదేనేటికీ క్రియాచరణకు మార్గదర్శకంగా వుంది. ఈ కార్యక్రమాన్ని కమింటర్న్ రెండవ, మూడవ, నాలుగవ మహాసభ పత్రాలలోనూ, అనేకవ్యాసాలు, ఉపన్యాసాలు, నివేదికలు రూపంలోనూ ఆ విప్లవనాయకుడు వివరించారు.

కమింటర్న్ రెండో మహాసభయొక్క జాతీయ, వలస సమస్యల కమిషన్ నివేదికలో లెనిన్ యీ దిగువ విషయాలను పేర్కొన్నారు. సోషలిస్టు రాజ్యం ఒకటి ఏర్పడడ వలన ప్రపంచశక్తుల బలాబలాలు జాతీయ విముక్తి వుద్యమానికి అనుకూలంగా బాగా మార్పుచెందాయి. జాతీయ విముక్తి వుద్యమానికి సోవియట్ రష్యా రాజకీయంగా, పాదార్థికంగా, నైతికంగా వత్తాసునిస్తూంది. రష్యాలో విప్లవంయొక్క అనుభవాలను, ముఖ్యంగా రష్యాను అనుకొనివున్న జాతీయ ప్రాంతాల విప్లవోద్యమాల అనుభవాలను అధ్యయనం చేయవలసిందిగా లెనిన్ ప్రాచ్య దేశాల కమ్యూనిస్టులకు సలహా ఇచ్చారు. లెనిన్ ఇలా అన్నారు; "ఇదిల్లావున్నా, స్వతంత్ర రాజకీయ ఆలోచనకూ, స్వతంత్ర రాజకీయ కార్యాచరణకూ ప్రజలలో వుత్సాహం రేకెత్తించడానికై ... మనం నాయక పాత్రను తీసుకొన్నాము. తీసుకుతీరాలి".

పెట్టుబడిదారీ దశలో కాలుపెట్టకుండానే....

పీడితదేశాలు పెట్టుబడిదారీ పూర్వ ఆర్థిక వ్యవస్థనుంచి పెట్టుబడిదారీ దశను దాటించి సోషలిస్టు ఆర్థిక వ్యవస్థలోకి క్రమంగా పరివర్తన పొందుతాయనే భావాన్ని లెనిన్ కమింటర్న్ రెండో మహాసభలో తెచ్చారు. "ఈ వెనుకబడిన దేశాలు, పురోగమించిన దేశాల కార్మికవర్గం సహాయంతో, సోవియట్ వ్యవస్థను చేపట్టగలవనీ, పెట్టుబడిదారీ దశలో కాలుపెట్టకుండానే కొన్ని నిర్దిష్ట పరిణామ దశలగుండా, కమ్యూనిజాన్ని చేరుకోగలవనే ప్రతిపాదనను కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ తీసుకురావాలి, దానిని సైద్ధాంతికంగా ధృవీకరించాలి" - అన్నారు. రష్యాలో జీవితానుభవం లెనిన్ అభిప్రాయాలను ధృవపరచింది.

ఆసియా, ఆఫ్రికా, దక్షిణ అమెరికాలలో పోరాటం సాగిస్తున్న దేశాలకు లెనినిస్టు సిద్ధాంత ఎంతో ప్రయోజనకారి. మాజీ వలసలూ, పరాధీన దేశాలా ప్రజలు క్రియాశీల రాజకీయ జీవితాన్ని అందుకొన్నారు. సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా శాంతి స్వాతంత్ర్యం సోషలిజాలకై సాగిస్తున్న పోరాటాలలో నూతన విజయాలను సాధించి వారు లెనిన్ శత జన్మదినోత్సవానికి సన్నాహపడుతున్నారు.

— వి. యాకోవ్‌లేవ్

నిరంకుశోద్యోగిపట్ల లెనిన్ కరకుతనం

లెనిన్ సోవియట్ ప్రధానిగా ఉన్నప్పుడు, ఒక నిరంకుశోద్యోగి విషయంలో క్రింది విధంగా పమూటిప్ ఉయేజ్డ్ కార్యనిర్వాహక వర్గానికి టెలిగ్రాం యిచ్చారు. (18 11.1919)

"సొర్మోవో కమ్యూనిస్టు, రుకలిష్నికోవ్ అను నతడు యిప్పటికి నెలరోజులుగా జైల్లో నిర్బంధింపబడి కేసు విచారణ యింకా ప్రారంభం కాలేదనే మాట నిజమేనా? నిజమే అయితే యిందుకు కారకుడైన వ్యక్తిని అధికార జాడ్యం అనే నేరానికి విచారణ జరపాలి. టెలిగ్రాం ద్వారా జవాబు [illegible]ండి."

రాజకీయ ప్రత్యర్థిపట్ల లెనిన్ ఔదార్యం

పి. ఎ. క్రోపోట్కిన్ (1842 - 1921) ప్రఖ్యాత అరాచక వాది. మార్క్స్, ఎంగెల్సులు యీ ధోరణిని సిద్ధాంతపరంగా ఎదుర్కొని పోరాడారు. క్రోపోట్కిన్ చిరకాలం విదేశాల్లో వుండి, 1917 లో స్వదేశమైన రష్యాకు తిరిగి వచ్చారు. వృద్ధాప్యంలోనున్న క్రోపోట్కిన్ వ్యాధిగ్రస్తుడై యుండగా, డాక్టర్లు ప్రత్యేక రైల్లోవెళ్ళి రోగిని పరీక్షించ వలసివచ్చింది. ఈవిషయం తెలుసుకొని ప్రదాని లెనిన్ 1921 ఫిబ్రవరి 5 న యిలా ఆర్డరు జారీ చేశారు : "క్రోపోట్కిన్ కొరకు ప్రత్యేక రైలు తీసుకెళ్ళడానికి అనుమతింపబడింది"

To catch up with the latest in Science and Technology Study Russian Thro'

Russian Language Monthly

(English Medium)

One Year (any 12 issues) Rs. 4-00
Two Years (any 24 issues) Rs. 6-00
Three Years (36 issues from 1 to 36) Rs. 8-00

Please subscribe for these magazines through our authorised agents possessing our Authority Letter or remit the money directly to our office.

Soviet Land office,
MADRAS-17.